అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 28 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 30 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

ఖాళీలు 60లక్షలు



మోడీరాజ్‌లో భర్తీకాని సర్కారు నౌకరీలు

నిరుద్యోగులతో చెలగాటం

- విద్యా, వైద్యరంగాలకు నిధుల కోత
- నిధులలేమితో రాష్ట్రాల్లో నిలిచిన ఉద్యోగాల భర్తీ
- ప్రమాదంలో విద్యా, వైద్యరంగాలు
- ఎన్నికల్లో లబ్ధి కోసం తెరపైకి 'రిజర్వేషన్ కోటా'



కొత్త ఉద్యోగాల కల్పన సంగతేమోగానీ, లక్షల్లో పేరుకుపోయిన ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని మాత్రం మోడీ సర్కార్ పట్టించుకోవటం లేదు. ఒకటి కాదు...రెండు కాదు...దేశవ్యాప్తంగా 60లక్షలకుపైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నప్పటికీ మోడీ ప్రభుత్వం భర్తీ చేయలేదనీ వార్తా కథనాలు వెలువడుతున్నాయి. మరోవైపు 'రిజర్వేషన్ కోటా'పేరుతో నిరుద్యోగుల్లో లేనిపోని ఆశల్ని కల్పిస్తోందనీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు పార్లమెంట్‌లో కేంద్రం చెప్పిన సమాధానాలు, వివిధ సంస్థలు విడుదల చేసిన సమాచారాన్ని బట్టి దేశవ్యాప్తంగా 60లక్షలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ నిలిచిపోయిందనీ, వీటిని భర్తీ చేయాలన్న ఆసక్తి మోడీ సర్కార్‌కు ఎంతమాత్రమూ లేదని తేలింది. విద్యా, వైద్యరంగాల్లో పెద్ద ఎత్తున ఖాళీలు ఉన్నాయనీ, పెద్ద ఎత్తున నిధుల్లో కోతపెట్టడం, అరకొర నిధుల్ని కేటాయించటం...ద్వారా ఆయా శాఖల్లో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు నిలిచిపోయాయనీ, ఖాళీల భర్తీ పక్కనపెట్టారనీ తేలింది.

ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు

కేంద్రం, ఇతర సంస్థలు	కేంద్ర ప్రభుత్వ ఖాళీలు	4,12,752
	పోస్టల్, టెలిగ్రాఫ్ శాఖలు	57,574
	రైల్వేలు	2,45,204
	బ్యాంకులు, ఆర్థిక సంస్థలు	6,135
ఉన్నత విద్య	సెంట్రల్ వర్సిటీల్లో టీచింగ్	5,606
	సెంట్రల్ వర్సిటీల్లో నాన్‌టీచింగ్	11,429
	ఐఐటీ, ఐఐఎం,ఎన్ఐటీ	6,355
	రూరల్ కాలేజీలు	1,37,298
పాఠశాల విద్య	ప్రాథమిక పాఠశాల	9,00,316
	ఉన్నత పాఠశాల	1,07,689
ఆరోగ్యసంరక్షణ	ఆరోగ్య సిబ్బంది	2,23,327
	అంగన్‌వాడీ	2,22,348
సైన్యం, పోలీసు	ఆర్మీ	29,063
	కేంద్ర బలగాలు	1,66,896
	రాష్ట్ర పోలీసు	5,38,237
న్యాయవ్యవస్థ	జిల్లా జడ్జీలు, సబ్ జడ్జీలు	5,135
	హైకోర్టు జడ్జీలు	387
	సుప్రీంకోర్టు జడ్జీలు	3
	రాష్ట్రాల్లో	30,00,000
	కేంద్ర స్థాయిలో	30,75,754
మొత్తం		60,75,754

పార్లమెంట్ ప్రశ్నలు, సీసీజీఈడబ్ల్యూఎఫ్, ఏఐఎస్‌జీఈఎఫ్, ఆర్‌హెచ్ఎస్-2018, బీపీఆర్‌డీ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా..

వివరాలు 9లో

హామీలు నెరవేర్చకపోతే..

జనం దాడి చేస్తారు

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హెచ్చరిక



న్యూఢిల్లీ : తమ హామీలను నెరవేర్చే ఏ నేతనైనా ప్రజలు మెచ్చుకుంటారని, ఎప్పుడైతే ఆ కలలను 'కల్లలు' చేస్తారో ఆ నేతలపై దాడి చేయడానికైనా వారు వెనుకాడబోరని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదివారం తన తోటి నేతలను హెచ్చరించారు. అందువల్ల నెరవేర్చగల హామీలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయండని హితవు పలికారు. తాను అనవసరపు హామీలివ్వననీ, చేసేదే చెబుతానని అన్నారు. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఇప్పటి వరకు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని తోటి నేతలకు సూచించారు. 2014లో తప్పుడు హామీలను ఇచ్చినట్టు సూచనప్రాయంగా అంగీకరించారు. తాము ఎన్నటికీ అధికారంలోకి రామని నిర్ధారణకు వచ్చాక.. భారీ హామీలను ఇవ్వాలని తమ పార్టీకి సలహాలిచ్చినట్టు తెలిపారు. అయితే తాము అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ వాగ్దానాలను ప్రజలు గుర్తుచేస్తున్నారని, వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగుతున్నామని గడ్కరీ అన్నారు. దీంతో తమపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయని చెప్పారు. అయితే గతంలో కూడా తన పార్టీని ఇబ్బందుల్లో పడేసే విధంగా గడ్కరీ వ్యాఖ్యానించారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతలు తక్కువ మాట్లాడాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ముంబయిలో బాలీవుడ్ నటి ఇషాకొప్పికర్ బీజేపీ చేరిన సందర్భంగా గడ్కరీ పై విధంగా స్పందించారు.

మోడీకి తంబిల సెగ

నల్ల బ్యాడ్జీలు, బ్యానర్లతో ప్రదర్శన



వివరాలు 9లో

69 ఏండ్లలో.. 8 మంది జడ్జీలా !

సుప్రీంకోర్టులో మహిళల ప్రాతినిధ్యం 3 శాతమే..

- 50 శాతం మంది మహిళలే ఉండాలి : పార్లమెంటరీ కమిటీ



న్యూఢిల్లీ : భారత రాజ్యాంగం అమల్లోకొచ్చి సరిగ్గా 69 ఏండ్లు దాటింది. సరిగ్గా ఇదే సమయంలో సుప్రీంకోర్టు కూడా ...9లో

ఫిలిప్పీన్స్‌లో జంట పేలుళ్లు

21 మంది మృతి, 70 మందికి గాయాలు

2లో..

అవినీతి ఆరోపణలున్నా ఏంచేయలేం

సీవీసీపై ఫిర్యాదులకు కేంద్రం జవాబు

వివరాలు 10లో

రైతును ముంచింది

పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వాన



- దెబ్బతిన్న వరి, మిర్చి, పత్తి పంటలు
- కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- హైదరాబాద్‌లో ముసురు

9లో

31 నుంచి పార్లమెంట్

ఫిబ్రవరి 1 ఓటాన్ అకౌంట్ బడ్జెట్




- మోడీ సర్కార్‌కు చివరి సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరగనున్నాయి. మోడీ సర్కార్‌కు ఇవే చివరి పార్లమెంట్ సమావేశాలు కానున్నాయి. ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా 30న ...9లో





అంబేద్కర్, ఆజాద్ విగ్రహాలు ధ్వంసం



దళిత, ప్రజా సంఘాల ధర్నా

- పోలీసుల అదుపులో నిందితుడు


నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

గణతంత్ర వేడుకలు ముగిసిన మరుసటి రోజే రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, చంద్రశేఖర్ ఆజాద్‌ల విగ్రహాలను ధ్వంసం చేశాడు ఓ వ్యక్తి. నిందితుడు రిటైర్డ్ ఉద్యోగి కావడం గమనార్హం. విషయం తెలుసుకున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు రోడ్డుపై బైటాయించి నిందితుడిని శిక్షించాలని ఆందోళన చేశారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని రాంపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. రాంపల్లి ప్రధాన చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహ తలను ఆదివారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి చాందీయా రాయితో ధ్వంసం చేశాడు. దానికి దగ్గర్లోనే ఉన్న చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహాన్నీ పాక్షికంగా ధ్వంసం చేశాడు. సమాచారం తెలుసుకున్న దళిత, ప్రజా సంఘాలు నాయకులు మెయిన్‌రోడ్డుపై బైటాయించి విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్టు ...9లో

జైట్లీకి గుస్సా..!

ఐసీఐసీఐ కేసులో కేంద్రమంత్రి జోక్యం

- సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేసేలా ఒత్తిడి
- 'సాహసిక చర్యలతో ఉన్నత వ్యక్తుల గౌరవానికి భంగం' అంటూ పోస్ట్
- చందా కొచ్చర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మరుసటి రోజే అధికారి బదిలీ





మోడీ క్యాబినెట్‌లోని కొందరు మంత్రులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూరుతున్నది. లలిత్‌మోడీ, విజయ్‌మాల్యాలాంటి రుణ ఎగవేతదారులు పరారవ్వటానికి కేంద్రమంత్రులే సహకరించారన్న విషయాలు వెలుగుచూశాయి. తాజాగా ఐసీఐసీఐ బ్యాంక్ చీఫ్ చందా కొచ్చర్ అక్రమాలపై జరుగుతున్న సీబీఐ దర్యాప్తుపై కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ అగ్గిమీదగుగ్గిలమవుతున్నారు. జైట్లీ ఆరోగ్యం బాగాలేకపోతే అమెరికాలో వైద్యం చేయించుకోవటానికి వెళ్లారు. కానీ అక్కడ తన ఆరోగ్యం గురించి కన్నా..చందాకొచ్చర్ పై జరుగుతున్న దర్యాప్తుమీద జైట్లీ జీర్ణించుకోలేకపోతున్నట్టున్నారు. ఆమెకు అండగా నిలవాలనుకున్నారో..లేక మరొకటో కానీ..సాహసిక చర్యలతో ఉన్నత వ్యక్తుల గౌరవానికి భంగం కలుగుతున్నదంటూ.. ఫేస్‌బుక్‌లో చేస్తున్న పోస్టులు ఇపుడు దుమారం రేపుతున్నాయి. మరోవైపు కొచ్చర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుచేసిన కొన్ని గంటల్లోనే దర్యాప్తు అధికారి బదిలీకావటం చర్చనీయాంశంగా మారింది.

వివరాలు 9లో

ప్రశ్నిస్తే 'దేశద్రోహం' ముద్ర



- ఆర్టీఐ కార్యకర్త అరుణారాయ్

జైపూర్ : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దేశద్రోహం ముద్ర వేస్తున్న పరిస్థితి నెలకొన్నదని ఆర్టీఐ కార్యకర్త అరుణారాయ్ అన్నారు. దేశంలో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు. జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో ఆమె మాట్లాడుతూ.. దేశంలో చర్చలు పెట్టడం, అసమ్మతిని తెలిపే స్వేచ్ఛ క్రమంగా తగ్గిపోతున్నదని అన్నారు. నేడు ప్రభుత్వంపై ఎవరైనా వ్యతిరేక అభిప్రాయంతో ఉంటే దాన్ని దేశద్రోహం కిందనే పరిగణిస్తున్నారని విమర్శించారు. అలాంటి సందర్భాల్లో సదరు వ్యక్తులు అత్యంత ప్రమాదకర పరిస్థితుల మధ్య జీవనం గడపాల్సిన దుస్థితి తలెత్తుతున్నదని తెలిపారు. ఒక ఆర్టీఐ కార్యకర్త ఎలాంటి సమాచారం కోరినా సరే.. కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. ఒకవేళ భూముల యాజమాన్యాలపై రెవెన్యూ అధికారిని ఎవరైనా ప్రశ్నిస్తే.. వారిని ప్రభుత్వ వ్యతిరేకులుగా చూస్తారని చెప్పారు.

అసోం గాయకుడిపై కేసు

గువహతి: భారత అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణతో అసోంకు చెందిన గాయకుడు జుబీన్ గార్గ్‌పై కేసు నమోదైంది. హజోయ్ జిల్లా లంక పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గణతంత్రం దినోత్సవం సందర్భంగా అసోం జానపద కళాకారుడు భూపేన్ హజారికా (మరణానంతరం)కు భారతరత్న ప్రకటించిన మరుసటి రోజే గార్గ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆయన అలా మాట్లాడాడని భావిస్తున్న ఆడియో క్లిప్ ఒకటి బయటకు వచ్చింది. ఆ గొంతు జుబీన్‌దేనా కాదా అన్నది ఇంకా నిర్ధారించాల్సి ఉన్నదని పోలీసులు తెలిపారు. హిందీ చిత్రసీమతో పాటు పలు భాషలలో గాయకుడిగా పేరొందిన జుబీన్.. 2016లో అసోంలో బీజేపీ విజయానికి తనవంతు కృషి చేశారు. పాటలు పాడి జనాన్ని ఆకర్షించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. అయితే కొంత కాలంగా రాష్ట్రంలో చిచ్చు రేపిన పౌరసత్వ నమోదు బిల్లుపై ఆయన బీజేపీపై బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సర్బానంద సోనావాలాకు ఫేస్‌బుక్‌లో లేఖ రాశారు. లేకుంటే తాను కూడా దీనికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాలలో పాల్గొంటానని హెచ్చరించారు. అంతేగాక బిల్లుపై 'రాజకీయాలు చేయకండి సోదరా' (డోన్ట్ డూ పాలిటిక్స్ బ్రదర్) అంటూ ఓ పాటను కూడా రికార్డు చేశారని వార్తలు వెలువడుతున్నాయి.

క్రిమినల్ కేసుల్లో 'ఆధార్' ఫైనల్ కాదు

లక్నో: క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు కోసం ఆధార్ కార్డులోని వివరాలు తుది ఆధారాలు కావని అలహాబాద్ హైకోర్టు ఆసక్తికర తీర్పునిచ్చింది. ఆధార్ అనేది కేవలం సందేహ నివృత్తి కోసమేనని స్పష్టం చేసింది. ఓ కేసుకు సంబంధించి ఈనెల9న కోర్టు వెల్లడించిన తీర్పు ఇటీవల వెలుగులోకి వచ్చింది. కార్డుదారు ఫోటో, వేలిముద్రలు, యూఐడీతో కూడి న ఐరిష్‌కు మధ్య అనుసంధానం ఉన్నదని ధ్రువీకరించేందుకే ఆధార్ కార్డు ఉపయోగపడుతుందని కోర్టు తెలిపింది. కాబట్టి ఆధార్ కార్డులోని వివరాలు తుది ఆధారంగా పరిగణించేలేమని అలహాబాద్ హైకోర్టు న్యాయ మూర్తులు అజయ్ లంబా, రాజీవ్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. తాము మేజర్లమేనని, ఇష్టపూర్వకంగానే పెండ్లి చేసుకున్నామని పేర్కొంటూ ఓ ప్రేమజంట వారు పుట్టిన తేదీలకు సంబంధించి ఆధార్ కార్డులోని వివరాలను కోర్టు ముందు ప్రవేశపెట్టింది. ఆ ఇద్దరి ఆధార్ కార్డుల్లో వారు పుట్టిన సంవత్సరాలు వేరుగా ఉన్నప్పటికీ పుట్టిన రోజులు మాత్రం జనవరి1 గా నమోదై ఉన్నది. దీనిపై కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ విషయంలో లక్నోలోని యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జాస్మిన్‌ను వివరణ కోరింది. ఎవరైనా తాము పుట్టిన తేదీకి సంబంధించి సరైన పత్రాలు సమర్పించలేనప్పుడు సదరు వ్యక్తి తెలిపిన వయసును బట్టి ఆపరేటర్లు దాదాపుగా లెక్కగట్టి ఆధార్‌లో వారి జనన సంవత్సరాన్ని నమోదు చేస్తారని జాస్మిన్ వివరణ ఇచ్చారు. ఇక పుట్టిన తేదీ మాత్రం డిఫాల్ట్‌గా క్యాలెండర్‌లోని జనవరి 1 నమోదవుతుందని తెలిపారు.అధికారి వివరణను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. ఆధార్ కార్డులోని పేరు, జెండర్, అడ్రస్, పుట్టిన తేదీ వంటి ఇతర విషయాలను తుది ఆధారాలుగా పరిగణించలేమని తీర్పునిచ్చింది.

దళితుల బతుకులు దయనీయం

- ఉత్తర కర్నాటక జిల్లాలో శతాబ్దాలుగా అంటరానితనం, కుల వివక్ష
- అధికారుల దృష్టికి వెళ్లినా ఫలితం శూన్యం
- స్వాభిమాని దళిత్ శక్తి అధ్యయనంలో వెల్లడి

అంటరానితనం, కుల వివక్ష చూపటం నేరమని చట్టాలు చేశాం. సమాజంలో ఇలాంటివి ఉండకూడదని ఆరు దశాబ్దాలుగా చెబుతున్నాం. అయినా భారతీయ సమాజంలో కుల దురహంకార పోకడలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తర కర్నాటక హవేరీ జిల్లాలో దళితుల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉందని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. గాలి, నీరు, ఆహారం, ఆవాసం....అన్నింటా దళితుల్ని వేరుగా చూస్తున్నారు. కర్నాటక హవేరీ జిల్లాలో 'స్వాభిమాని దళిత్ శక్తి' అధ్యయనంలో వెలుగుచూసిన విషయాలు ఇలా ఉన్నాయి...







బెంగళూరు: మూడేండ్లకుపైగా రణబెన్నూర్ తాలూకాలోని 87గ్రామాల్లో ఈ అధ్యయనం సాగింది. దళిత, అణగారిన వర్గాలకు చెందిన ప్రతీ కుటుంబాన్ని ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూల్లో 4,076 కుటుంబాల నుంచి అభిప్రాయాల్ని సేకరించారు. సామాజిక, ఆర్థిక, విద్యారంగాల్లో దళితుల స్థాయి ఏవిధంగా ఉంది? స్వంత భూమి ఉందా? కుల వివక్ష, అంటరానితనం ఎదుర్కొంటున్నారా? పని చేసుకునే హక్కు, ప్రభుత్వ సేవలు ఉన్నాయా? మొదలైనవాటిపై అధ్యయనం ప్రధానంగా దృష్టి పెట్టింది.

మూడు సంవత్సరాలు పట్టింది

స్వాతంత్ర్యం వచ్చి 70ఏండ్లు దాటినా దళితులకు ఎలాంటి హక్కులూ దక్కలేదు. గ్రామాల్లో అంటరానితనం ఇంకా కొనసాగుతోంది. ప్రభుత్వ సేవలు, పథకాలు అందటం లేదు. దీంతో మేము తాలూకాలోని ప్రతీ గ్రామాన్ని సర్వే చేయాలని నిర్ణయించుకున్నాం. సామాజికంగా, ఆర్థికంగా దళితుల జీవితాలు మారలేదని సర్వేలో తేలింది. ప్రభుత్వాలు తమ బాధలు వింటాయనీ, సమస్యలు తీరుస్తాయనీ సర్వేలో పాల్గొనవారు ఆశాభావం వ్యక్తం చేశారు. దళితుల ఇంటర్వ్యూలు పూర్తిచేయటం కోసం మా ఆర్గనైజేషన్‌కు మూడు సంవత్సరాలు పట్టింది. 2,580 పేజీలతో నివేదికను తయారుచేశాం. ఈనెల 18న 'రాణెబెన్నూర్' పట్టణంలో ఈ నివేదికను విడుదల చేశాం. అంటరానితనం, కుల వివక్షలపై స్థానిక తాహసిల్దార్, జిల్లా డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.



◆ స్వాభిమాని దళిత్ శక్తి, సభ్యుడు మలిప్ప నడువినకేరి

హెయిర్ కట్ కోసం..19 కి.మీ ప్రయాణం

సర్వేలో అంటరానితనం గురించి పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమైంది. హారాన్‌గిరి గ్రామంలోని క్షౌరశాలలోకి దళితుల్ని రానివ్వటం లేదు. దళితుల తల వెంట్రుకలు కత్తిరించమనీ, గడ్డాలు గీయమనీ దుకాణాలు మూసేసి, వేరే కులస్తుల ఇండ్ల వద్దకు వెళ్లి సేవలు అందిస్తున్నారు. దీనిపై దళితులు ఆందోళన వ్యక్తం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో వారు 19కి.మీ దూరంలో ఉన్న 'రాణెబెన్నూర్' అనే పట్టణానికి వెళ్లి హెయిర్ కట్టింగ్, షేవింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. వందల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ కుల వివక్షను ఎవరూ అరికట్టడం లేదు.

అంటరానితనం రూపుమాపాలని చట్టాలు తెచ్చి ఆరు శతాబ్ధాలుదాటినా, అనేక గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి అమలుజేస్తున్నారు. సర్వే జరిగిన 87గ్రామాల్లోని...72 గ్రామాల దళితులకు దేవాలయ ప్రవేశాన్ని నిషేధించారు. గుడి బయట నిలబడి వారు మొక్కుకుంటున్నారు. 57 గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి నడుస్తోంది. గ్రామాల్లో పశువులు చనిపోయినప్పుడు వాటి మృతకళేబరాన్ని తొలగించేది దళితులు. పెత్తందారీ కులాలకు చెందిన కుటుంబాల్లో పెండ్లి జరిగినా, ఎవరైనా చనిపోయినా దళితులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు.



సర్వేకు సంబంధించి మరికొంత..

- సర్వే జరిగిన గ్రామాల్లోని 66శాతం దళితులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. 42శాతం కుటుంబాలకు స్వంత భూమి లేదు.
- నడిహారలల్లి అనే గ్రామంలో 61 దళిత కుటుంబాలకు తాగునీటి కనెక్షన్, మురుగునీటి సౌకర్యం, రోడ్డు వసతి లేవు. ప్రభుత్వం దళితు లకు ఇండ్ల స్థలాలు ఇస్తే, వీటిపై పెత్తందారీ కులాలు కోర్టు కేసులు వేశాయి. దీంతో ఆ స్థలాల్లో దళితులు ఇండ్లు కట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది.
- స్వచ్ఛభారత్ కింద ఎక్కడా కూడా దళితులకు మరుగుదొడ్లను కట్టించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ పథకాల్ని అమలుజేయటం లేదని 70 గ్రామాల్లోని దళిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.
- ఉపాధి చట్టం కింద కేవలం 15రోజుల పని మాత్రమే దొరుకుతోందని హరాన్‌గిరి దళితుడు ఒకరు చెప్పా రు. 87 గ్రామాల్లో కేవలం 27 మంది పురుషులు, 5గురు మహిళలు మాత్రమే గ్రాడ్యుయేషన్ చదివారు. వైద్యవిద్య చదివినవారెవరూ లేరు.

యూపీ టు గల్ఫ్

మధ్య ఆసియా దేశాలకు పెరుగుతున్న వలసలు

- కేరళలో సర్కారు సంస్కరణలతో భారీగా తగ్గుముఖం



న్యూఢిల్లీ: ఒకప్పుడు గల్ఫ్ కార్మికులంటే దక్షిణాది రాష్ట్రాల పేరు ఎక్కువగా వినిపించేది. మరీ ముఖ్యం గా తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ నుంచి వీరి వలసలు ఎక్కువగా ఉండేవి. కానీ, కొంతకాలంగా దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరాదిలో బీజేపీ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్ నుంచి కార్మికుల వలసలు పెరి గాయి. మధ్య ఆసియా దేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఓమన్ వంటి దేశాలకు యూపీ, బీహార్‌ల నుంచి వలసలు అధికమౌతున్నాయని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచారం ద్వారా వెల్లడైంది. కాగా, గత పదేండ్లలో కేరళ నుంచి గల్ఫ్‌కు వెళ్లే కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. రాష్ట్రంలో కార్మికులకు వేతనాలు పెంచడం, వామపక్ష సర్కారు చొరవతో అందరికీ ఉపాధి అవకాశాలు లభ్యమవుతుండటంతో వలసలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి.గణాంకాల ప్రకారం 2018 నాటికి యూపీ నుంచి గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న కార్మికులు 86,273 మంది ఉన్నారు. వీరందరూ భవన నిర్మాణంలో కూలీలుగా (వీరిని బ్లూ కాలర్ వర్కర్లు అని కూడా అంటారు), ఇంటి పనులు చేసే వర్కర్లుగా కాలం వెల్లదీస్తున్నారు. విస్తీర్ణంలోనూ, జనాభా పరంగా దేశంలోనే అతి పెద్దదైన యూపీలో గడిచిన కొంతకాలంగా ఉపాధి అవకాశాలు సన్నగిల్లడంతో గ్రామాల నుంచి కార్మికులు వలసపోతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు చూపించాల్సిన బీజేపీ సర్కారు.. ఆ ఊసే మరిచింది.. పదేండ్ల క్రితం (2009లో) ఇక్కడి నుంచి 50 వేల మంది వలస కార్మికులుండగా గతేడాదికి ఆ సంఖ్య 59,181కి చేరింది. ఇదిలాఉంటే కేరళ నుంచి గల్ఫ్‌కు వెళ్లే వలస కార్మికుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. 2009లో కేరళ నుంచి 1 లక్షా 19 వేల మంది కార్మికులు గల్ఫ్ దేశాలలో ఉంటే 2108 నాటికి ఆ సంఖ్య 14,496 మందికి తగ్గింది. కేరళతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి కూడా గల్ఫ్ దేశాలకు వలసలు తగ్గుతున్నాయని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

లీడర్లు లేక చాక్లెట్ ఫేసులపై ఆధారపడుతున్న కాంగ్రెస్

- బీజేపీ నాయకుడు కైలాష్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీలో లీడర్లు లేరు, అందుకే 'చాక్లెట్ ఫేసుల'పై ఆధారపడుతోందని బీజేపీ నాయకుడు కైలాష్ విజయ్‌వర్గీయ అన్నారు. గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై కరీనా, సల్మాన్ వంటి సినీ తార పేర్లను తెరపైకి తీసుకురావడంతో పాటు తాజాగా ప్రియాంక రాజకీయాల్లోకి రావడాన్ని ఉద్దేశించి ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ పార్టీలో నాయకులు లేరు. అందుకే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించడానికి ఆ పార్టీ చాక్లెట్ ఫేసులపై ఆధారపడుతున్నది. కాంగ్రెస్ పార్టీలో ఒకరు బాలీవుడ్ హీరోయిన్ కరీనాను భోపాల్ నుంచి ఎన్నికల్లో దింపాలని మాట్లాడుతారు. మరొకరు సల్మాన్ ఖాన్‌ను ఇండోర్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీలో ఉంచాలంటారు. తాజాగా ఇప్పుడు వారు ప్రియాంకను తీసుకొచ్చారు. ఆ పార్టీలోని నాయకులకు ఆత్మ విశ్వాసం లేదనడానికి ఇదే నిదర్శనం' అని కైలాష్ అన్నారు. కైలాష్‌కు ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు తొలిసారేం కాదు. ప్రియాంకగాంధీకి అందం తప్ప ఇతర ఏ అర్హతలూ లేవని, కేవలం అందంతోనే ఎన్నికల్లో ఓట్లు రాలవని బీజేపీ నాయకుడు, బీహార్ మంత్రి వినోద్ నరైన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం తెలిసిందే.


ఉత్తరకొరియా సరిహద్దులో 'ఫిషింగ్ ఫెస్టివల్ '



సియోల్ : దక్షిణకొరియా పౌరులు ఉ.కొరియా సరిహద్దులో ఫిషింగ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. హ్వాచియన్ కౌంటీ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఈ సంబురాల్లో దాదాపు 20లక్షల మంది పాల్గొన్నారు. ఉభయ కొరియా దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలు పునరుద్ధరించుకోవడంతో ఈ ఫెస్ట్ నిర్వహణ సాధ్యమైందని నిర్వాహకులు తెలిపారు. ఇరు దేశాల మధ్య మైత్రిని పెంపొందించేందుకు ఫిషింగ్ ఫెస్టివల్ ఉపకరిస్తుందని అన్నారు.

లూసియానాలో కాల్పుల కలకలం

- ఐదుగురు మృతి



వాషింగ్టన్ : అమెరికాలోని లూసియానా నగరంలో ఆదివారం కాల్పులు కలకలం సృష్టించాయి. రెండు వేర్వేరు చోట్ల జరిగిన కాల్పుల ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో నిందితుని కుటుంబ సభ్యులు, ప్రియురాలు ఉన్నారు. ఒకే వ్యక్తి కాల్పులకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. లూసియానా పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...లివింగ్టన్ పారిష్ ప్రాంతంలో డకోటా తిరియాట్(21) అనే యువకుడు ఉన్మాదిగా మారిపోయాడు. తండ్రిని, స్నేహితున్ని, ప్రియురాలిని తుపాకీ కాల్చి చంపి ఘటనాస్థలం నుంచి పరారయ్యాడు. ఈ ఘటన జరిగిన కొద్ది గంటల తర్వాత మరో ఇద్దరు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. ఘటనాస్థలం వద్ద పలు కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ఈరెండు హత్యలకు పాల్పడింది కూడా తిరియాటేనని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు నేరచరితుడని పోలీస్ అధికారులు తెలిపారు. గతంలో పలు పోలీస్ స్టేషన్‌లలో అతనిపై చోరీ, హత్యాయత్నం కేసులు నమోదై ఉన్నాయని అన్నారు. నిందితుడు కాల్పులకు పాల్పడ్డ కారణం తెలియరాలేదని అన్నారు.

నేటి నుంచి హెచ్-1బి ప్రీమియం ప్రాసెసింగ్

వాషింగ్టన్: హెచ్-1బి వీసా దరఖాస్తుల 'ప్రీమియం ప్రాసెసింగ్' ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుందని అమెరికా ప్రకటించింది. 2019 ఆర్థిక సంవత్సరానికి గానూ దాఖలైన అన్ని 'హెచ్-1బి క్యాప్' పిటిషన్లను పరిశీలించనున్నట్టు తెలిపింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకే ఇది వర్తిస్తుందని, కొత్తవాటిని స్వీకరించట్లేదని స్పష్టం చేసింది. ప్రీమియం ప్రాసెసింగ్ కింద పిటిషన్‌దారులు అదనంగా రుసుము చెల్లించి తమ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను 15 రోజుల్లోపే పూర్తిచేసుకోవచ్చు. పెద్ద మొత్తంలో పిటిషన్లు పెరుకుపోవడంతో ఇటీవల కొంత కాలం ఈ ప్రక్రియను అమెరికా నిలిపివేసింది. కొన్ని విభాగాల్లో ఈ నిలిపివేత ఇంకా కొనసాగుతోంది.

ఫిలిప్పీన్స్‌లో జంట పేలుళ్లు

21 మంది మృతి, 70 మందికి గాయాలు



మనీలా : ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా జంట పేలుళ్లలో దద్దరిల్లింది. దక్షిణ ఫిలిప్పీన్స్ ప్రాంతంలోని రోమన్ కాథలిక్ కాథడ్రల్ చర్చి లక్ష్యంగా పేలుళ్లు సంభవించాయి. ఈ రెండు పేలుళ్లలో 21 మంది మృతిచెందగా, మరో 70 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మిలిటెంట్ల ప్రాబల్యం అధికంగా ఉండే జోలో ప్రాంతంలోని కాథడ్రల్ చర్చికి సమీపంలో మొదటగా బాంబు పేలుడు చోటుచేసుకుంది. అనంతరం చర్చి ఆవరణలో ఉగ్రవాదులు మరో పేలుడుకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న భద్రతాబలగాలు ఘటనాస్థలికి చేరుకొని ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయి ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. జంట పేలుళ్లలో 21 మంది మృతి చెందారు. క్షతగాత్రుల్లో పలువురిని హెలికాప్టర్లలో సమీపంలోని జాంబోంగా నగరానికి తరలించారు. ఈ ఘటనపై ఆ దేశ రక్షణ మంత్రి డెల్ఫిన్ లోరెన్జనా స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని సైనికాధికారులను ఆదేశించారు. ప్రార్థనాస్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఉగ్రసంస్థలు పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నాయని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. కాగా, జోలో ద్వీపంలో అబు సయ్యఫ్ సంస్థ మిలిటెంట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ సంస్థను అమెరికా నిషేధిత జాబితాలో చేర్చింది. గత కొంత కాలంగా ఈ ఉగ్రవాద సంస్థ ఆ ప్రాంతంలో బాంబు పేలుళ్లు, కిడ్నాప్‌లు, అరాచకాలు సృష్టిస్తున్నారు. ఈ సంస్థకు చెందిన సభ్యులే ఈ పేలుళ్లకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా, ముస్లింల జనాభా అధికంగా ఉన్న బాంగ్సామోరో ప్రాంతాన్ని ఫిలిప్పీన్స్ ఈశాన్య ప్రాంతంలో చేర్చాలా ?వద్దా ? అనే అంశంపై ప్రభుత్వం ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. అయితే, ఇక్కడి ప్రజలు రిఫరెండమ్‌కు ఓటు నమోదు చేశారు. ఈ రిఫరెండమ్ పట్ల మోరో ఇస్లామిక్ లిబరేషన్ ఫ్రంట్ సభ్యులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ప్రభుత్వ చర్యలపై వ్యతిరేకతతో మిలిటెంట్లు ఈ పేలుళ్లకు పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లెనిన్‌గ్రాడ్‌లో పరేడ్

- నాజీల దిగ్బంధనానికి 75ఏండ్లు



మాస్కో : రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నాజీల లెనిన్‌గ్రాడ్ దిగ్బంధనానికి స్వస్తి పలికి 75ఏండ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ప్యాలెస్ స్క్వేర్ దగ్గర భారీగా సైనిక బలగాల పెరేడ్ జరిగింది. చలి విపరీతంగా ఉన్నప్పటికీ దాన్ని లెక్కచేయకుండా ప్రజలు అక్కడకు వచ్చి పరేడ్‌ను వీక్షించారు. ముందుగా అందరూ ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం బాధితులకు శ్రద్ధాంజలి ఘటించారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అత్యంత విషాదకరమైన సంఘటన అంటే లెనిన్‌గ్రాడ్ దిగ్బంధన అని పరేడ్ ఇన్‌చార్జి కమాండింగ్ ఆఫీసర్ అలెగ్జాండర్ జురవ్‌లెవ్ వ్యాఖ్యానించారు. సైన్యంలోని త్రివిధ దళాలకు చెందిన సైనికులు ఈ పెరేడ్‌లో పాల్గొన్నారు. అందరూ రెడ్ ఆర్మీ యూనిఫారాలు ధరించి పరేడ్‌లో పాల్గొనడం విశేషం. సైనిక బలగాల వెంట రెండవ ప్రపంచ యుద్ధ కాలం నాటి ఆయుధాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఆధునిక కాలం నాటి సైనిక సంపత్తిని కూడా ప్రదర్శనలో ఉంచారు. శతఘ్నులు, రాకెట్ లాంచర్లు, క్షిపణులు అన్ని రకాల ఆయుధాలను ప్రదర్శించినట్టు రష్యా సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. పరేడ్ ముగుస్తుందనగా ఆరు మిగ్ విమానాలు ఆకాశంలో కన్నుల పండువుగా విన్యాసాలు నిర్వహించాయి.

ట్రంప్-కిమ్ రెండో దఫా భేటీకి ఏర్పాట్లు

- శాంతి ఒప్పందం, ఆంక్షల సడలింపు, బలగాల ఉపసంహరణపై పావులు కదుపుతున్న అమెరికా

వాషింగ్టన్ : ఉత్తర కొరియాతో జరగనున్న రెండవ శిఖరాగ్ర సదస్సులో ఎలాగైనా పురోగతి సాధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. ఇందుకోసం ఆయన పావులను కదుపుతున్నారు. ఉత్తర కొరియాపై ఆంక్షలను సడలిస్తామని, శాంతి డిక్లరేషన్‌పై సంతకాలు చేస్తామని, దక్షిణ కొరియా నుండి బలగాలను ఉపసంహరిస్తామని ప్రతిపాదనలు తీసుకువస్తున్నారు. గత జూన్‌లో మొదటి శిఖరాగ్ర సదస్సు తర్వాత ఫిబ్రవరి చివరిలో రెండవ సమావేశం జరుగుతుందని భావిస్తున్నారు. వియత్నాం దీనికి వేదిక కావచ్చు. ఈ సమావేశం నాటికి ఉత్తర కొరియా అణు కార్యక్రమానికి సంబంధించి స్పష్టమైన పురోగతి ఉండేలా చర్యలు తీసుకోవాలని అమెరికా అధికారులు పట్టుబట్టారు. అయితే ట్రంప్ వైఖరిపైనే అంతా ఆధారపడి వుంది. కాగా ఉత్తర కొరియా విషయాన్ని పరిశీలించినట్లైతే ముందుగా అంతర్జాతీయ ఆంక్షల నుండి ఉపశమనం కావాలన్నది కిమ్ లక్ష్యంగా వుంది. కరువు కాటకాల సమయంలో కూడా దశాబ్దాల తరబడి నిర్మించుకుంటూ వచ్చిన అణ్వాయుధాలను ఒక్కసారిగా వదులుకోవడంపై విశ్లేషకులు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. దేశంలో తీవ్రమైన ఆర్థిక సమస్యలు సష్టించేంత గట్టిగా ఆంక్షలు లేవన్నది వారి వాదనగా వుంది. అయితే ఈ ఆంక్షలతో ఆర్థిక ప్రగతి సాధించడం చాలా క్లిష్టంగా ఉందన్నది వాస్తవమని సియోల్‌లోని కూక్‌మిన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఆండ్రి లంకోవ్ వ్యాఖ్యానించారు. దేశంలో సుస్థిరత కొనసాగాలన్నా, అధికారంలో ఉండాలన్నా తమ ఆర్థిక వ్యవస్థకు, పొరుగు దేశాల ఆర్థిక వ్యవస్థలకు మధ్య గల అంతరాలను తుడిచిపెట్టడం కనీసం తగ్గించడం తప్పనిసరి అవుతోంది. ట్రంప్‌తో మొదటిసారి సమావేశమయ్యేటప్పుడు ఒక ఒప్పందం లేదా కనీసం కొరియా యుద్ధం పరిసమాప్తి అయిందని ప్రకటిస్తూ ఒక ప్రకటన వెలువడుతుందని కిమ్ ఆశించారు. కానీ అవేమీ జరగకుండా యుద్ధ విరమణతో సరిపుచ్చారు. శాంతి డిక్లరేషన్‌పై సంతకాలు జరిగితేనే అదొక సంకేతంగా భావించడానికి ఉంటుందని జార్జిటౌన్ యూనివర్శిటీలో ఆసియా అధ్యయనాల డైరెక్టర్ విక్టర్ చా వ్యాఖ్యానించారు.

గాయపడ్డ మహిళకు బ్రిటన్ ప్రిన్స్ క్షమాపణలు

లండన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళకు బ్రిటన్ ప్రిన్స్ ఫిలిప్ క్షమాపణలు చెప్పారు.

కొద్ది రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిలిప్ క్షేమంగా బయటపడిన సంగతి తెలిసిందే. అయితే, ఆ సమయంలో ఎదురుగా వస్తున్న కారులో గాయపడిన మహిళను క్షమాపణలు కోరుతూ ప్రిన్స్ లేఖ రాసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. సండే మిర్రర్ అనే పత్రికలో ప్రిన్స్ ఫిలిప్ ప్రమాదంలో గాయపడిన ఎమ్మా ఫెయిర్‌వెదర్ అనే మహిళకు క్షమాపణలు చెప్పిన లేఖను ప్రచురించింది. ప్రిన్స్ ప్రయాణిస్తున్న కారు ఢీకొనడంతో ఆ మహిళ మణికట్టుకు గాయమైనట్లు తెలిసి లేఖలో ఆయన విచారాన్ని ప్రకటిస్తూ ' ఆ రోజు నా కారణంగా జరిగిన ప్రమాదానికి మీకు క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న కారును గమనించడంలో నేను విఫలమయ్యానని అనుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

ఈనెల17న నార్‌ఫోక్‌లోని రాయల్ కంట్రీ రెసిడెన్సీకి సమీపంలో రద్దీగా ఉండే రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఫిలిప్ ప్రయాణిస్తున్న కారు ఒక వైపు పూర్తిగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. అయితే ఎదురుగా ఉన్న కారు డ్రైవరు మోకాలికి గాయమైంది. ఆ సమయంలో కారులో ప్రయాణిస్తున్న ఫెయిర్‌వెదర్ అనే మహిళ.. ప్రమాదం అనంతరం ఫిలిఫ్ తమకు ఎలాంటి క్షమాపణలు చెప్పలేదని ఆరోపించారు.

దీనిపై తాజాగా ఫిలిప్ స్పందిస్తూ ప్రమాదం జరిగినప్పుడు తాను కొంత గందరగోళానికి గురయ్యానని, ఎవరూ తీవ్రంగా గాయపడలేదని తెలుసుకున్న తర్వాత కుదుటపడ్డానని లేఖలో పేర్కొన్నారు. 'మీ చేతికి గాయమై బాధపడుతున్నారని తెలిసింది, అందుకు క్షమించండి' అని ఫిలిప్ కోరారు.

చదువులు సాగేదెలా?

వరుస ఎన్నికలతో ఉపాధ్యాయులు బిజీబిజీ

ఏ ఎన్నికలైనా విధుల్లో ఎక్కువ మంది టీచర్లే

- బోధన, సిలబస్ పూర్తిపై తీవ్ర ప్రభావం
- పరీక్షల సమయంలో విద్యా మంత్రిని నియమించని వైనం
- అసెంబ్లీ ముగిసిన వెంటనే పంచాయతీ పోరు
- ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ, మార్చిలో పార్లమెంటుకు నోటిఫికేషన్
- సర్కారు బడుల్లోని విద్యార్థులే నష్టపోతున్న వైనం


ఫైల్

రాష్ట్రంలో వరుస ఎన్నికలతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతున్నది. అనాలోచిత నిర్ణయాల మూలంగా పాఠశాల విద్యారంగం కుదేలవుతున్నది. ఎన్నికల విధుల నేపథ్యంలో ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయలేకపోతున్నారు. చివరకు పదో తరగతి విద్యార్థుల పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యి అన్న చందంగా మారింది. పరీక్షలు దగ్గరపడుతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నా కీలకమైన విద్యా శాఖకు మంత్రి లేకపోవడం గమనార్హం. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సైతం విద్యారంగంపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణ వస్తున్నది.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాఠశాల విద్యారంగం అస్తవ్యస్తంగా మారింది. వరుస ఎన్నికల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు బిజీబిజీగా ఉన్నారు. ఏ ఎన్నికల్లోనైనా ఉపాధ్యాయులే ఎక్కువ మంది విధుల్లో ఉంటున్నారు. దీంతో టీచర్లు బోధనపై దృష్టి సారించలేకపోవడంతో సిలబస్ పూర్తి కావడంపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నష్టపోవాల్సి వస్తున్నది. ఈ విద్యాసంవత్సరంలోనే వరుసగా ఎన్నికలు రావడం గమనార్హం. రాష్ట్రంలో ముందస్తు అసెంబ్లీ ఎన్నికల నుంచి విద్యారంగంపై ప్రభావం పడుతూనే ఉన్నది. నవంబర్ 12న ముందస్తు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. డిసెంబర్ 7న పోలింగ్, 11న ఫలితాలు విడుదలయ్యాయి. ఆ తర్వాత ఈనెల ఒకటిన గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. ఇప్పటికే రెండు విడతల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. మూడో విడత ఎన్నికలు ఈనెల 30న జరగాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి నుంచి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి ఇలా అన్ని రకాల విధులనూ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు నిర్వహిస్తున్నారు. రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఎనిమిది రోజులపాటు శిక్షణ, ఆ తర్వాత మూడు విడతల్లో పోలింగ్ నిర్వహణ, ఫలితాల విడుదల వంటి విధుల కారణంగా మూడు వారాల వరకు బోధనకు దూరంగా ఉండాల్సి వచ్చింది. దీంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తున్నది. ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల బోధనపై దృష్టి సారించక, పాఠ్యాంశాలు పూర్తి కావడం లేదు. సిలబస్ పూర్తికాకపోవడంతో పదో తరగతి విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఫలితాలనూ ప్రభావితం చేయనుంది. ఇలా వరుస ఎన్నికలతో అన్ని రకాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. వరుసగా ఎన్నికలు రావడం వల్ల విద్యార్థుల చదువులు సాగేదెలా?అన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.

పది విద్యార్థులకు జనవరి, ఫిబ్రవరి కీలకం

రాష్ట్రంలో అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికల పోరు ముగియగానే ఎమ్మెల్సీ, పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ ఎన్నికలకు, మార్చి మొదటివారంలో పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, ఏప్రిల్‌లో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరగనుంది. పదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి కావాలి. జనవరి, ఫిబ్రవరిలో పునశ్చరణ తరగతులు నిర్వహించాలి. ఫిబ్రవరిలోనే ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతాయి. ఇలా అన్ని రకాలుగా పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలి. వారికి కీలకమైన జనవరిలో పంచాయతీ ఎన్నికలు, ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు పంచాయతీ, ఎమ్మెల్సీ ఎన్నికలతో నష్టమే. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభావం 23 జిల్లాలపై పడనుంది. మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గంలో 13 జిల్లాలు, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 10 జిల్లాలున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు విధుల్లో పాల్గొనడంతోపాటు ప్రచారంలోనూ కీలక పాత్ర పోషించనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ఉపాధ్యాయ సంఘాల నేతలే పోటీ చేస్తున్నందున వారి గెలుపు కోసం అనుబంధంగా ఉండే వారంతా ప్రచారం చేయాల్సి వస్తుంది. మార్చి రెండు లేదా మూడోవారంలో పోలింగ్ ఉండే అవకాశమున్నందున ఫిబ్రవరి, మార్చిలో ప్రచారం ముమ్మరంగా ఉంటుంది. ఈ సమయంలోనే పదో తరగతి పరీక్షలుంటాయి. అన్ని తరగతుల విద్యార్థులతోపాటు వారు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నందున ఎక్కువ నష్టం జరగనుంది.

విద్యార్థులపై తీవ్ర ప్రభావం : చావరవి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

'రాష్ట్రంలో వరుస ఎన్నికల వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. పదో తరగతి విద్యార్థులకు ఎంతో కీలకమైన జనవరిలోనే పంచాయతీ ఎన్నికలు రావడం వల్ల మరింత ప్రభావం పడింది. ముఖ్యంగా పంచాయతీ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు విధుల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు నష్టం కలిగింది. ఇది పదో తరగతి ఫలితాలపై ప్రభావం చూపే అవకాశమున్నది. అందుకే విద్యార్థులు నష్టపోకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు తీసుకోవాలి. బోధనపై దృష్టి సారించాలి.'

ఫలితాలు రాకపోతే ప్రభుత్వానిదే బాధ్యత : భుజంగరావు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు

'ఏ ఎన్నికలైనా ఉపాధ్యాయులే విధులు నిర్వహించాలి. కానీ బోధనపై ప్రభావం పడే అవకాశమున్నందున ప్రత్యామ్నాయం ఏంటన్నది ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. టీఆర్టీ నిర్వహించినా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదు. ఉన్న వారు ఎన్నికల విధుల్లో నిమగ్నమవుతున్నారు. దీంతో సిలబస్‌పై ప్రభావం పడుతున్నది. ఇంకోవైపు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చదువు సరిగ్గా రావడం లేదని, ప్రమాణాల్లేవంటూ అసర్ వంటి నివేదికలు వస్తున్నాయి. పదో తరగతి ఫలితాలు రాలేదని ప్రభుత్వం అంటుంది. వరుస ఎన్నికల కారణంగా ఫలితాలు రాకపోయినా, ప్రమాణాలు దెబ్బతిన్నా దానికి ప్రభుత్వానిదే బాధ్యత.'

పది ఫలితాలపై ప్రభావం : మైస శ్రీనివాసులు, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

'వరుస ఎన్నికలతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడనుంది. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి కావాలి. కొన్ని పాఠశాలల్లో పూర్తయింది. అయినా పంచాయతీ ఎన్నికల వల్ల రివిజన్ చేసేందుకు అవకాశం లేక విద్యార్థులపై ప్రభావం చూపుతున్నది. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని డీఈవోలు ప్రయత్నం చేస్తున్నా ఎన్నికల వల్ల అది సాధ్యం కావడం లేదు. విద్యార్థులకు నష్టం రాకుండా ఉపాధ్యాయులు మరింత కష్టపడి పనిచేయాలి.'

గ్లోబల్ ఇండియన్ ఇన్స్పిరేషనల్ బ్రాండ్‌గా నారాయణ

- ఇండియన్ ఇన్స్పిరేషనల్ లీడర్స్‌గా కె. పునిత్, సింధూర





హైదరాబాద్: ప్రతిష్టాత్మక వరల్డ్ కన్సల్టింగ్ రీసెర్చ్ కార్పొరేషన్ 2019 అవార్డును నారాయణ విద్యాసంస్థ గెలుచుకున్నది. 2018 ఏడాదికి గానూ గ్లోబల్ ఇండియన్ ఇన్స్పిరేషనల్ బ్రాండ్‌గా నారాయణ ఎంపికైంది. దేశవ్యాప్తంగా దాదాపు 500 బ్రాండ్ల ప్రభావాలను విశ్లేషించిన సంస్థ.. విస్తృతంగా పరిశోధించి ఈ అవార్డులను ప్రకటించింది. అలాగే నారాయణ సంస్థను సమర్థవంతంగా నడిపిస్తున్నందుకు గానూ గ్లోబల్ లీడర్స్‌గా సంస్థ చైర్మెన్ కె. పునీత్‌ను, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సింధూరనారాయణను ఎంపిక చేసింది. లండన్‌లోని యూకే ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో రిచర్డ్ చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డులను వారు అందుకున్నారు. నారాయణ గ్రూప్ వ్యవస్థాపకులు నారాయణ మాకు స్ఫూర్తి అని, ఆయనిచ్చిన కాన్ఫిడెంట్‌తోనే 13 రాష్ట్రాల్లో తమ శాఖలను విస్తరించినట్టు కె. పునీత్ అన్నారు. గత 40 ఏండ్లుగా నారాయణ గ్రూప్ అందించిన విశిష్ట సేవలకు ఈ అవార్డు దక్కినట్టు సింధూర తెలిపారు.

సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్యాయత్నం

- పోటీ నుంచి తప్పుకోవాలని బెదిరించినందుకే..


చికిత్స పొందుతున్న రాధమ్మ

నవతెలంగాణ-వీణవంక

పోటీ నుంచి తప్పుకోవాలని ప్రత్యర్థి అభ్యర్థికి చెందిన కొందరు వ్యక్తులు బెదిరించడంతో మనస్తాపం చెంది ఓ సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్‌లో ఆదివారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా హిమ్మత్‌నగర్ గ్రామానికి ఎస్టీ రిజర్వేషన్ ఖరారు కాగా మూడో విడతలో ఎన్నిక 30వ తేదీన జరగనుంది. టీఆర్ఎస్ బలపర్చిన అంగడి రాధమ్మను ఏకగ్రీవంగా ఎన్నిక చేసేందుకు గ్రామస్తులు తీర్మానించారు. టీఆర్ఎస్‌కు చెందిన మరో గ్రూపు మాత్రం రాధమ్మకు పోటీగా అదే గ్రామానికి చెందిన శృతిని నిలిపారు. ఈ క్రమంలో కొందరు రాధమ్మకు ఫోన్ చేసి పోటీ నుంచి తప్పుకోవాలని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు.

సందీప్‌ది హత్యే..

- నిందితులపై 302, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి: కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు


మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

నవతెలంగాణ-భీమ్‌గల్

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్ గ్రామానికి చెందిన మొండి సందీప్‌ది హత్యేనని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. నిందితులపై సెక్షన్ 302 కింద హత్యానేరం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సికింద్రాపూర్‌లో కేవీపీఎస్, బహుజన ప్రతిఘటన వేదిక ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసుల నుంచి పలు వివరాలు ఆదివారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సందీప్ అదే గ్రామానికి చెందిన అగ్రకుల అమ్మాయిని ప్రేమించినందుకే 'మాట్లాడుకుందాం రా' అని చెప్పి అదే వర్గానికి చెందిన మృతుని స్నేహితుడు ఈ నెల 23న తీసుకెళ్లాడని చెప్పారు. సందీప్‌ను తీసుకెళ్తుండగా చూసిన అతని అక్క తన తమ్ముడిని ఎక్కడికి తీసుకెళ్తున్నారని అడిగితే ఇప్పుడే వస్తానని చెప్పారనీ, కానీ ఎంతకీ రాలేదని తెలిపారు. మరిసటిరోజు ఉదయం పొలం వద్ద మృతదేహం పడి ఉండడం ముమ్మాటికీ పథకం ప్రకారం చేసిన హత్యేనని అన్నారు. దీనికి కారణమైన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని బహుజన ప్రతిఘటన వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ సాంబశివరావ్ డిమాండ్ చేశారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వెంకటేష్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ప్రభాకర్, ఎంబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దండి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం బతికే ఉందా..?

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణలో ప్రజాస్వామ్యం బతికే ఉందా అనే అనుమానం కలుగుతోందని టీపీసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి రోజులు గడుస్తున్నా ఇంకా మంత్రి మండలి ఏర్పాటు చేయకపోవడం దారుణమని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గవర్నర్ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారనీ, ఆయన నిలయం రాజకీయాలకు అడ్డాగా మారిపోయిందనీ ఆరోపించారు. ఈవీఎంలపై చాలా అనుమానాలున్నాయనీ, దీనిపై చాలామంది కోర్టుకెళ్లారనీ గుర్తుచేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. దేశంలోని ప్రజలందరూ పునరాలోచించి రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. దేశంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేననీ, రాష్ట్రంలో 16 ఎంపీ స్థానాలు గెలిచేందుకు సమిష్టి కృషి చేస్తున్నామనీ తెలిపారు. ప్రియాంకలో మరో ఇందిరాగాంధీని చూసుకుంటున్నట్టు తెలిపారు. పార్టీ ఇన్‌చార్జీ డీసీసీ కేశ వేణు, మాజీ అధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, టీపీసీసీ కార్యదర్శి బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

మార్పులకు వేళాయే?

కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన

- కుంతియా.. ఇంటికి..?
- లోక్‌సభ ఎన్నికల వరకే ఉత్తమ్ కొనసాగింపు!
- ఫిబ్రవరిలో డీసీసీలు, అనుబంధ, బ్లాక్ కమిటీలు
- రెండు రోజుల్లో ఎన్నికల కమిటీల నియామకం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ఊహించని రీతిలో ఘోర పరాభవం ఎదురవడంతో టీపీసీసీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసే పనిలో అధిష్టానం నిమగ్నమైంది. నాలుగేండ్లు కావడంతో పాత కమిటీల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. వచ్చే పార్లమెంటు ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్నది. పాత కొత్త నాయకులతోపాటు వచ్చే ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సైతం సమాయత్తం చేస్తున్నది. పార్టీ బలోపేతానికి అన్నిస్థాయిల్లోని క్యాడర్‌ను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నది. పని చేయని వారిని తప్పించి, ఉత్సాహవంతులైన నాయకులకు అవకాశం ఇచ్చి వారి సేవలను ఉపయోగించుకోవాలని అధిష్టానం ఆదేశించినట్టు పార్టీ నేతలు అంటున్నారు. అందులో భాగంగా తొలివేటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియాపై పడనుంది. ఇప్పటికిప్పుడు పీసీసీ పదవి తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో లోక్‌సభ ఎన్నికలకు వరకు నామమాత్రంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కొనసాగించే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. లోక్‌సభ ఎన్నికల తర్వాత కొత్త పీసీసీ చీఫ్‌ను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ పదవి నుంచి తనను తప్పించాలని అధిష్టానానికి ఆయన లేఖ రాసినా దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మొదట గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కమిటీలను ఒక్కొక్కటిగా నియమించడానికి సిద్ధమవుతున్నది. ఇదెలా ఉన్నా ఫిబ్రవరి మొదటివారంలో పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో పార్టీని సంస్థాగతంగా ప్రక్షాళన చేసేందుకు అధిష్టానం సిద్ధమైంది.


రాష్ట్ర ప్రభుత్వం గతంలో 31 జిల్లాలను ఏర్పాటు చేసింది. మరో రెండు జిల్లాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ప్రకటించారు. మొత్తం 33 జిల్లాలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను నియమించే అవకాశం ఉన్నది. డీసీసీల జాబితాలను పార్టీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధిష్టానానికి సమర్పించారు. ఆ జాబితాను ఫిబ్రవరిలో ప్రకటించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. దీంతోపాటు గ్రామ, బ్లాక్ కమిటీ ప్రక్రియను ఆ లోపు పూర్తి చేయాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో పార్టీ పునాది చెదిరిపోవడంతో అధిష్టానం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. పార్టీకి దూరమైన వర్గాలను దరికి తెచ్చుకోవాలనే ఏఐసీసీ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు చేయడంలేదనే అసంతృప్తి ఉన్నది. దీంతో పార్టీ అధ్యక్షుడికి పూర్తి బాధ్యతలు ఇవ్వకుండా కొత్త ఇన్‌చార్జిని నియమించి...ఆ ఇద్దరికి లోక్‌సభ ఎన్నికలను టార్గెట్ ఇవ్వాలని భావిస్తున్నది.

శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ...పార్లమెంటు ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని అధిష్టానం ఆదేశించినట్టు తెలిసింది. ఫిబ్రవరిలో నోటిఫికేషన్ కంటే ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంలో భాగంగా రాష్ట్రస్థాయిలో ఐదు కమిటీలను నియమించనుంది. ఈ కమిటీలను రెండు,మూడు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. పార్లమెంటు ఎన్నికల నిర్వహణ కోసం టీపీసీసీ ఎన్నికల కమిటీ, ప్రచార కమిటీ, పబ్లిసిటి కమిటీ, ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ, సమన్వయ కమిటీలను నియమించనుంది. కమిటీలకు సంబంధించిన పేర్లను ఇప్పటికే అధిష్టానానికి సమర్పించింది.

పాతోళ్లు పార్లమెంట్‌కు..

మంత్రివర్గ కూర్పుపై సీఎం సమాలోచనలు

- తొలి విడతలో ఆరుగురికే చోటు?
- సార్వత్రికం తర్వాత మలి విస్తరణ
- 31 లేదా ఫిబ్రవరి 10న ముహూర్తం
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయిలో...



ఫైల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా? త్వరలోనే విస్తరణ ఉంటుందా.. అవుననే అంటున్నారు టీఆర్ఎస్ నేతలు.. విస్తరణపై కొత్త వారిలో ఆశలు చిగురిస్తుండగా.. పాతవారు నిరాశకు గురవుతున్నారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఈ నెల 31 లేదా ఫిబ్రవరి 10 ముహూర్తం ఖరారు చేసినట్టు సమాచారం. అయితే ఫిబ్రవరి 10వ తేదీనే ప్రమాణస్వీకారం ఉంటుందని పార్టీ సీనియర్ నేతలు తెలిపారు. శనివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ నిర్వహించిన "ఎట్ హోం" అనంతరం సీఎం కేసీఆర్ సుమారు గంటన్నర పాటు గవర్నర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంత్రివర్గ విస్తరణ, పంచాయతీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు, సహస్ర ఛండీయాగం అంశాలపై చర్చించడంతో పాటు ప్రధానంగా మంత్రివర్గ విస్తరణకు సంబంధించి తేదీలను ఖరారు చేసినట్టు సమాచారం. బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నందున మంత్రివర్గ రెండు మూడు రోజుల్లో మంత్రివర్గ కూర్పును పూర్తి చేయనున్నారు.

రాజ్‌భవన్‌లో ముహూర్తం ఖరారు

ముందుస్తు ఎన్నికలు ముగిసి 46 రోజులు దాటినా ఇంకా ఒక్కరితోనే క్యాబినెట్‌ను నెట్టుకొస్తున్నారు. దీంతో మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యేలంతా విస్తరణ ఎప్పుడుంటుందా?అన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. విస్తరణకు సంబంధించి అనేక తేదీలు ముందుకు వచ్చినా ఒక్కటీ వాస్తవరూపం దాల్చలేదు. ఈ నెల 31, ఫిబ్రవరి 10వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండటంతో ఈ రెండు తేదీలో ఏదో ఒక రోజు ఖరారు చేసే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

మాజీలకు "నో" ఛాన్స్ ?

మంత్రివర్గ విస్తరణలో మాజీ మంత్రులకు చోటు దక్కే అవకాశం లేదు. పాత వాళ్లందరినీ పార్లమెంట్‌కు పంపించాలన్న యోచనలో సీఎం కేసీఆర్ ఉన్నట్టు సమాచారం. మాజీ మంత్రుల్లో కొందరిని పార్లమెంట్‌కు పోటీ చేయించి అటు ఢిల్లీలోనూ తన ఆధిపత్యాన్ని చాటు కోవాలని సీఎం భావిస్తున్నారు. కొత్తవారికి అసెంబ్లీ టికెట్లు ఇవ్వలేదని కార్యకర్తలు నిరాశలో ఉన్న విషయం తెలిసిందే. మంత్రివర్గంలోనూ పాత వారికే తిరిగి స్థానం కల్పిస్తే కార్యకర్తలు మరింత అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉన్నందునే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా రెండు, మూడు సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన వారికి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఒకవేళ కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్ సర్కారు ఏర్పడితే కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని హామీ ఇచినట్టు సమాచారం. మంత్రివర్గంలో మాజీలకు చోటు లేదన్న విషయం స్పష్టం కావడంతో సీనియర్లు కొందరు ఆందోళనలో ఉన్నట్టు తెలిసింది.

'6' లక్కీనెంబర్

తొలి విడత విస్తరణలో ఆరుగురికి మాత్రమే మంత్రివర్గంలో చోటు కల్పించనున్నారు. ముఖ్యమంత్రికి "6" లక్కీనెంబర్ కావడంవల్లనే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒక వేళ ఫిబ్రవరి 10న ప్రమాణస్వీకారం చేపడితే మరో ఎనమిది మందిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలిసింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి విస్తరణ చేపట్టాలన్న ఆలోచనలో సీఎం ఉన్నారు. మార్చి మొదటి వారంలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉన్నందున ఫిబ్రవరి రెండు, లేదా మూడో వారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని సీఎం భావిస్తున్నారు. ఆ లోపే మంత్రివర్గ విస్తరణ పూర్తి చేసనున్నారు.

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు

రావి రంగారావు సాహిత్య పీఠం ప్రకటించిన 'జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు' పోటీ ఫలితాలను ప్రకటించారు. 1. సిరికి స్వామినాయుడు (మట్టి రంగు బొమ్మలు – వచన కవితలు), 2. చిత్తలూరి సత్యనారాయణ (నల్ల చామంతి – వచన కవితలు), 3. భైరి ఇందిర (సవ్వడి), 4. బెలగాం భీమేశ్వరరావు (మా ఇంటి దేవతలు) ఎంపికయ్యారు. ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం గుంటూరులో జరిగే సభలో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు.

– నర్రా ప్రభావతి, కన్వీనర్ – రావి రంగారావు సాహిత్య పీఠం

సాహిత్యవార్తలు

క్రీడా కథలకు ఆహ్వానం

సాహితీ ప్రచురణలు తమ రెండవ కథల సంకలనంకోసం క్రీడలు కేంద్ర బిందువుగా వున్నా కథలను ఆహ్వానిస్తున్నారు. గతంలో ప్రచురితమయినవైనా, అముద్రితాలయినా, కొత్తగా రాసినవైనా మార్చి 10వ తేదీలోపు ప్లాట్ నెం.32, హౌ.నెం.8–48, రఘురాం నగర్ కాలనీ, ఆదిత్య హాస్పిటల్ లైన్, దమ్మాయిగూడ, హైదరాబాద్ – 83 చిరునామాకు పంపాలి. వాట్సాప్ నెం : 9849617392, ఇ మెయిల్ : kmkp2025@gmail.com

– కోడీహళ్ళి మురళీమోహన్, కస్తూరి మురళీకృష్ణ

29న జగన్నాథశర్మకు జైని అవార్డు ప్రదానం

ప్రముఖ రచయిత, నవ్య వారపత్రిక సంపాదకులు ఏ.ఎన్. జగన్నాథశర్మ రచించిన 'మొదటిపేజీ' కథల సంపుటికి లక్ష్మీనారాయణ జైని జాతీయ లక్ష రూపాయల నగదు పురస్కారం ప్రకటించింది. ఈ పురస్కార ప్రదానోత్సవ సభ ఈ నెల 29వ తేదీ సాయంత్రం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుందని జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డా॥ ప్రభాకర్ జైని ఒక ప్రకటనలో తెలిపారు.

3న వరవరరావు కవిత్వంతో ఒకరోజు

విప్లవకవి వరవరరావు కవిత్వంతో ఒకరోజు సభ ఫిబ్రవరి 3వ తేదీ ఆదివారం మహబూబ్‌నగర్‌లో జరుగుతుంది. మూడు సెషన్లుగా జరిగే ఈ సభని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ప్రారంభిస్తారు. వరవరరావు కవిత్వం లోని విభిన్న కోణాలపై దాదాపు పదిహేను మంది ప్రసంగించే ఈసభని పాలమూరు అధ్యయన వేదిక నిర్వహిస్తుంది.

ఎస్వీ పుస్తకావిష్కరణ సభ


ఆచార్య ఎస్వీ సత్యనారాయణ రచించిన 'జీవితం ఒక ఉద్యమం' కవితా సంపుటి ఆంగ్లానువాదం LIFE IS A MOVEMENT పుస్తకావిష్కరణ సభ 29వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3.00 గంటలకు జరుగుతుందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ భాషాభివృద్ధి పీఠం ఒక ప్రకటనలో తెలియజేసింది. స్వాతి శ్రీపాద ఆంగ్లానువాదానికి చింతపట్ల సుదర్శన్ సంపాదకత్వం వహించారు. ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించే ఈ సభలో నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, అలేఖ్య పుంజాల, పత్తిపాక మోహన్ వంటి ప్రముఖులు పాల్గొంటారు.


కాలుష్యంపై కవిత్వ సమరం

ఫిబ్రవరి మూడో తేదీన హైదరాబాద్–మెదక్ వయా నర్సాపూర్ రోడ్డున ఉన్న 'బొంతపల్లి' జిల్లా పరిషత్ స్కూల్ ఆవరణలో 'కాలుష్యంపై కవిత్వ సమరం' సభ జరుగుతుంది. పర్యావరణ కాలుష్యంపై కవి సమ్మేళనం, ఎల్లన్న పుస్తకం 'నాపల్లె తీరు' పరిచయ సభ, డాక్టర్ చెమన్‌కు సత్కారం ఉంటుందని, తెలంగాణ సాహిత్య సమాఖ్య కన్వీనర్ బుద్దిరాజు ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నా భాష - నా శ్వాస

నా భాష తెలుగు భాష
నా శ్వాస – తెలంగాణ యాస
మనిషికి భాషే ప్రాణం
భాషకు యాసే ప్రాణం
గాధాసప్తసతికి తెలగాణ మాటే మూలం
బాధాతప్తహృదికి తెలగాణ పాటే ఉపశమనం
కాకతీయుల కాలంలో కాకలు తీరిన భాష
విద్యారణ్యుల వైవిధ్య భావసంపన్నం
ఓరుగల్లున తిక్కన కభయ మిచ్చిన భాష
పాల్కురికి సోమన్న హృదిలో మొల్చిన భాష
సోమన్న ద్విపదలు శంభుని మకుట భూషణాలు
బమ్మెర గ్రామాన పోతన్న రాసిన భాష
రామప్ప గుడిలోని బొమ్మ చెప్పిన భాష
చరిగొండ ధర్మన్న చిత్రికపట్టిన భాష
కొమరం భీమయ్య గుండెనిండిన భాష
చాకలి ఐలమ్మ పౌరుషాగ్ని రగిలించిన భాష
కాళోజి కలమందు కదనుతొక్కిన భాష
గోరటెంకన్న గళానపదునెక్కిన భాష
ఏలలు, రగడలు, యక్షగానాల
పరిఢవిల్లిన భాష
రేలపాటలలోన మేళవించిన భాష
ఆదిలాబాదు నుండి బాదలాపురం దాక
విస్తరించి ఓలలాడించిన నా భాష
కొండకోనల నుండి వాగు వంకల వరకు
మెండైన భావాల పూలతోటయ్యె నా భాష
నా భాష తెలుగు భాష
నా శ్వాస తెలంగాణ యాస.





– తాటికొండాల నరసింహారావు, 9885787250

కలాలు మాట్లాడుతాయి !

పోరాటాలు..
ఎప్పటికీ కుట్రలో భాగం కానేకావు.
ఉద్యమాలు..
చారిత్రక అత్యవసరమే కానీ
అనవసరమెప్పటికీ కానే కాబోవు.

దోపిడీదారులకు..
ప్రాంతఅస్తిత్వ సమరమూ పెద్దకుట్రే.
భగత్ సింగ్ ..
'డూ ఆర్ డై' నినాదమూ దేశద్రోహమే.

మౌలిక సమస్యల్ని
గుర్తించక మౌనం దాల్చినప్పుడు
చరిత్ర స్పృహ లేకుండా
ఉద్యమకారుల్ని అణగదొక్కినప్పుడు..

బుద్ధి జీవులు కలాలుగానో..
మేధావులు గళాలుగానో..
నిరసన స్వరమై ప్రతిఘటిస్తుంటారు.

రాజ్యంపై సంఘవిద్రోహుల్లా
కవులెప్పుడు కుట్రలు చేయరు.
ఫాసిజం రాక్షసుల్లా
జనాలపై విరుచుకు పడ్డప్పుడు
కలాలు గట్టిగా మాట్లాడుతాయంతే !

– అశోక్ అవారి



లేనిచోటు

నాయినమ్మా
అప్పుడు నువ్వు సచ్చిపోయిందే మంచిదైందే.

నాలుగుపోగులుగ జేసి
నెలకొక్కరి సొప్పున
నిన్ను నీ కొడుకులు పంచుకోకముందే
నీ తొవ్వను నువ్వు జూసుకొని
కట్టుబట్టలతో వెళ్ళిపోవడమే మంచిదైంది.

మురికిగుడ్డల్లో పడి నవిశినప్పుడు
ఎవ్వరూ ఎత్తిపోయలేక
కంపుగొట్టే మాటలు అనకముందే
పండుకున్నదానివి పండుకున్నట్టే
తెల్లారకముందే వెళ్ళిపోవడమే మంచిదైంది.

సీరియళ్ళ సోకులో పడి
పొయ్యిమీద పొంగుతున్న పాలలాగే
నిన్ను కూడా నేలపాలు చేయకముందే
సూర్యచంద్రులకు పాలియ్యడానికి
సర్రసర్ర నడిచి పోవడమే మంచిదైంది.

పైసలచెట్టు నీడన బతికే కొడుకుల చేతుల్లో
చెల్లనినోటువై
గుడిముందల పగిలిన మెట్టుగా మారకముందే
వాకిండ్లు ఊడ్వడానికి వెళ్ళినట్లు
కోడికూయక ముందే వెళ్ళిపోవడమే మంచిదైంది
ఆసుపత్రులన్ని
నీ నెత్తురును తాగకముందే
అక్కడి గాలి సోకకముందే
సుక్కల్ని కలిపి ముగ్గేయడానికి
కానరాని రాజ్యానికి వెళ్ళడమే మంచిదైంది

మనుమడిని సంకనెత్తుకొని
ఊరంతా తిరుగుదామనుకున్న నీ ఆశను
సంపుకోవడమే మంచిదైందిలే.
చెవుల్లో ఏయిర్ ఫోన్లు మొలిచిన
ఇప్పటి పిల్లలకు
నీ దగ్గర ఆడుకునేంత తీరికెక్కడుందని
బొడ్లోసంచిని చేసుకొని
కడుపున దాసుకునే నా ప్రేమ ఎవరిగ్గావాలని
అలిగిపోవడమే మంచిదైంది నాయినమ్మా!


నాకు నౌకరివచ్చిందాక బతికుంటే
రైకగుడ్డనో, చీరబట్టనో పెట్టేవాడినని
పానమంతా కొట్టుకుంటుంది గానీ
మమతలు కరువైన ఈ కరువుకాలంల,
అట్లా ఎగవడి
కూలీకోయినట్లు పోవడమే నయమైంది

– తగుళ్ళగోపాల్

ప్రయోగాత్మక కవిత్వం - విమర్శ

మనుమార్గ కవిత లోకంబున వెలయగ దేశికవితను పుట్టించినట్లు నన్నెచోడుడు చెప్పాడు. అప్పటికి 'దేశి' ఒక ప్రయోగం. గేయం ఒకనాడు ప్రయోగం. వచన కవిత కూడా ఒకనాటి ప్రయోగం. ప్రస్తుతం తెలుగులో వచన కవిత మహోన్నతంగా విరాజిల్లుతున్నది. అయితే రూపపరమైన స్థిరత్వంలో కాని వస్తుపరమైన స్థిరత్వంలో కాని వచన కవిత్వం వయసు చాలా తక్కువ. కాబట్టి ఇది జటిలమైన జడత్వానికి ఇంకా రాలేదు. కాబట్టి ప్రయోగాల ఆవశ్యకత కూడా తక్కువేనని చెప్పవచ్చు. సరళమైన వచనాన్ని కుందుర్తి ప్రారంభించి అర్ధశతాబ్ది దాటిపోయింది కాబట్టి దానిమీద సంప్రదాయపు ఛాయలు కనపడుతున్నాయి. ఎప్పుడయితే సంప్రదాయపు ఛాయలు స్థిరపడతాయో అందులో ఇమడలేని వాళ్ళు కొత్త గాలికోసం ప్రయోగం మొదలు పెడతారు. దీన్నే డా॥సి.నా.రె. "ఒక సంప్రదాయము కొంతకాలము రంగమున సుప్రతిష్ఠమైన తర్వాత దాని యందు రక్త ప్రసారము మందగించును. అప్పుడు దానిలో సంచలనము కలిగించుట ఆవశ్యకమగును. అందుకు సంప్రదాయదాసులు ఆమోదించరు. అప్పుడు దానిని బొత్తిగా కాదని ప్రయోగము బయలు దేరును" అంటారు.

అలా తెలుగులో పూర్ణమ ముత్యాల సర రూపంలో వచ్చింది. అక్కడ వస్తువులోనూ, రూపంలోనూ ప్రయోగాన్ని గమనించవచ్చు. తర్వాత ముత్యాల సర బంధనం కూడా ఒక అడ్డంకేనని భావించబడ్డది. మరింతగా స్వేచ్ఛగా ఉండేందుకు గేయాన్ని ఆశ్రయించారు కవులు. గేయంలో మాత్రానియమం ఐచ్ఛికమైపోయింది. నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు ఈ దిశగా జరిగిన ప్రయోగాలే. కర్పూర వసంతరాయలు కావ్యవస్తువులో సంప్రదాయకత ఉన్నప్పటికీ, నాగార్జునసాగరం వస్తురూపాలు రెండింటిలోనూ ప్రయోగమే. ఇక్కడ జాషువాను విభిన్న ప్రయోగ వాదిగా చెప్పక తప్పదు. ఆయన వస్తు స్వీకరణలో విప్లవాత్మకమైన ప్రయోగాలు చేసి ఎందరికో ఆదర్శప్రాయుడైనాడు. అనుదాత్త వస్తువులు కూడా కావ్యార్హాలే అని నిరూపించాడు. గబ్బిలం, సాలీడు, స్మశానాలపై విజయవంతమైన కావ్యాలు నిర్మించిన జాషువా పద్యాన్ని మాత్రం దాటలేదు. కాని పద్యాన్ని సామాన్యుల హృదయాల దగ్గరికి తెచ్చాడు. వచనాన్ని, గేయాన్ని గౌరవ ప్రదమైన ప్రక్రియలుగా కూడా చూడలేదు. ఆయన వచనాన్ని 'గాసట బీసట' కవిత్వంగా నిరసించాడు కూడా.



జాషువాను విభిన్న ప్రయోగ వాదిగా చెప్పక తప్పదు. ఆయన వస్తు స్వీకరణలో విప్లవాత్మకమైన ప్రయోగాలు చేసి ఎందరికో ఆదర్శప్రాయుడైనాడు. అనుదాత్త వస్తువులు కూడా కావ్యార్హాలే అని నిరూపించాడు. గబ్బిలం, సాలీడు, స్మశానాలపై విజయవంతమైన కావ్యాలు నిర్మించిన జాషువా పద్యాన్ని మాత్రం దాటలేదు.

ఫ్రీవర్స్ ఫ్రంట్ ఏర్పాటు, 'తెలంగాణ' కావ్యరచన ద్వారా కుందుర్తి వచన కవిత్వానికి తిరుగులేని దారులు పరిచాడు. ఈ ప్రయోగం విజయవంతమై విస్తరించి, వేళ్ళూనుకొని శాఖోపశాఖలైంది. అలా నడుస్తున్న వచన కవిత్వంలో వస్తువులో వైవిధ్యమే తప్ప రూపంలో మార్పులేకుండా కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నది. కొనసాగుతున్న వచన కవిత్వాన్ని నిర్వచించడం చాలా కష్టం కాని గుర్తించడం చాలా సులభం. పాద నిడివి, పాద సంఖ్యా నియతి, యతి, ప్రాస, మాత్ర లాంటి నియమాలేవీ లేని లయాత్మక భావ వ్యక్తీకరణ ప్రక్రియ వచన కవిత్వం. లయాత్మక భావ వ్యక్తీకరణపై కూడా అనేక అభిప్రాయ భేదాలున్నాయి. 'నువ్వు లేవు నీ నవ్వు ఉంది' అనే ఖండికలో తిలక్

'పైపైనా చూస్తే నేను
పది మంది లాంటి వాణ్నే
నా లోతుల్లోపల మాత్రం
నక్కి వుంటాడో కవి' అంటాడు. మరొకచోట పారాగ్రాపు రాస్తాడు. అది కూడా కర్త, కర్మ, క్రియలున్న వాక్యం లాంటి కవిత్వం. 'స్వరరాగతాళ కరచాలనం' శీర్షికలో ఏ హాసధ్వనితో ప్రారంభమై నా సంగీతావగాహన పర్వపు పడవ ప్రయాణం అలభ్య సంతృప్త జీవన యానానికి ప్రత్యామ్నాయ ఫల చిహ్నమై సంక్రమించిన వరాళి' అంటాడు.

మొదలే అనుకున్నట్లు ఆధునిక వచన కవిత్వాన్ని అసలే నిర్వచించిలేం. కాని ఎలా ఉంటుందో చెప్పవచ్చు. ఎలా ఉండాలో కూడా ఆశించవచ్చు. లయాత్మకతా, అంతర్లయాత్మకతా జరిగి పోయాక కవిత ఒక వ్యక్తి మరొక వ్యక్తితో చేసే ఆత్మీయ సంభాషణలా ఉండాలనిపిస్తుంది.

'ఆకలేస్తే వీధుల్లో అడుక్కో, అదీకుదరకపోతే కొట్టి లాక్కో ఏం తప్పు కాదు, నేరం అంగీకరించడం జైలు కెళ్ళడం ఏదీ తప్పు కాదు
ఉత్తినే చనిపోతావేమిట్రా, యుద్ధం చేయకుండానే?
యుద్ధం చేయకపోవడం తప్ప మరేదీ తప్పుకాదు'
అని ఉత్త వాక్యాల్లా చెప్పి అపారమైన దైన్యాన్ని ఆవిష్కరిస్తాడు హెచ్చార్కే.



డా॥సి.నా.రె. "ఒక సంప్రదాయము కొంత కాలము రంగమున సుప్రతిష్ఠమైన తర్వాత దాని యందు రక్త ప్రసారము మందగించును. అప్పుడు దానిలో సంచలనము కలిగించుట ఆవశ్యకమగును. అందుకు సంప్రదాయదాసులు ఆమోదించరు. అప్పుడు దానిని బొత్తిగా కాదని ప్రయోగము బయలు దేరును" అంటారు.

Painting is silent poetry and poetry is painting that speaks అంటాడు పుటార్చ్.

కోడూరి విజయకుమార్ 'పూలు మరణిస్తున్న వేళలో ఒక యువకుడి మరణాన్ని ఇలా చిత్రిస్తాడు.

'తనదే అయిన నేల కోసం స్వప్నించిన
మరొక పూవు వికసించకనే నేల రాలింది
తన మరణంతో అయినా
దశాబ్దాల స్వప్నం సాకారమవుతుందని'

ఆధునికానంతర కవిత్వం తన రూపానికి అదనపు పొబగులను సమకూర్చుకున్న విషయం చేరా పసిగట్టాడు. పదచిత్రాలు, భావచిత్రాలు సంకేతాలుగా కవిత్వాన్ని ఉద్దీపింపచేసాయి. తెలుగు రాష్ట్రాలలో విభజన ఉద్యమాలకు ముందు కవిత్వమంతా ఇమేజరీతోనే నడిచిందని చెప్పవచ్చు.

'ముఖానికి నల్లని మబ్బులని
కప్పుకున్న ఓ చంద్రబింబం
ఓ మూల మునిపళ్ళను
ఆలోచనలను చేసి
కొరుకుతున్న పెదాలతో
రెండు కాళ్ళ పెట్రోలు గుర్రం
మోసుకొచ్చే కలల రాకుమారునికై
ఎదురు చూస్తూంటుంది.
(సాయంత్రం పార్కులు, డా॥ కాంచనపల్లి)

తెలంగాణ విభజన ఉద్యమం తీవ్రమయ్యాక భాషపట్ల జాగరూకులైన తెలంగాణ కవులు అపారమైన స్థానిక పదాలను, పదబంధాలను కవిత్వంలోకి తీసుకొని వచ్చారు. ఎన, వర్జి, లంద లాంటి నామ వాచకాలనే కాకుండా తెలంగాణ క్రియారూపాలను కవిత్వంలోకి తెచ్చిన వాళ్ళు మునాస వెంకట్, అన్నవరం దేవేందర్, వేముగంటి మురళీకృష్ణ, పొన్నాల బాలయ్య, వనపట్ల సుబ్బయ్య. ఉద్యమానికి చాలా ముందు నుండి రాస్తూ, ఉద్యమంలో, ఉద్యమానంతరం రాస్తున్న డా॥ నందిని సిధారెడ్డి, వఝల శివకుమార్, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, దాసరాజు రామారావు, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్‌లలో పరిణామాన్ని గమించవచ్చు. వస్తువు ఏదైనా తమదైన స్థిరీకరించబడ్డ శైలిలో రాసిన డా॥ అమ్మంగి, ఆశారాజు, పరమాత్మ, కంశ్రీ, దాసోజు కృష్ణమాచార్య, ఎస్. హరగోపాల్, డా॥రూప్ కుమార్ డబ్బీకార్, నాళేశ్వరం శంకరం వర్తమాన కవిత్వ ప్రయోగాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

విభిన్నంగా రాయగలిగిన సిద్ధార్థ, దెంచనాల శ్రీనివాస్, మోహన్ రుషి, ఎం.ఎస్.నాయుడుల నుండి ప్రయోగానికి స్థిరీకరణ హామీ లభించవలసిఉంది. మో, నరేష్ నున్నాలకు వీరి కొనసాగింపు బలపడవలసి ఉంది. గాదె వెంకటేష్, జి.రామకృష్ణ, పగడాల నాగేందర్‌ల నుండి బలమైన వ్యక్తీకరణలున్న కవిత్వం వస్తుంది. మండల స్వామి, దాసోజు లలిత వస్తుస్పృహ ప్రతీకలుగా కనిపిస్తున్నారు.

వచన కవిత్వంలో ప్రయోగాల గురించి మాట్లాడినప్పుడు ఇటీవల ప్రచారంలోకి వచ్చిన ఉప ప్రక్రియల గురించి కూడా స్పృశించవలసి ఉంది. ఆచార్య ఎన్. గోపి ఆరంభించిన నానీలు, ఎం.కె. సుగంబాబు సృష్టించిన రెక్కలు వాటి సౌలభ్యం దృష్ట్యా చాలా మంది యువకవుల్ని ఆకర్షిస్తున్నాయి. నానోలు, మినీలు వస్తున్నాయి. ఏ ఉపప్రక్రియానియమాన్ని కూడా ఆ పేరువాడుకుంటున్న వాళ్ళు పాటించడం లేదు. వాటి సౌలభ్యంలోనే వాటి వైఫల్యం కూడా దాగి ఉన్నట్లు వాటి నడక చూస్తే అర్థమవుతుంది. తెలుగులో సాహిత్య విమర్శ విస్తారంగా ఉన్నట్లు అనిపిస్తున్నా సాధికారిక విమర్శ కొరత కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది.

– ఏనుగు నరసింహారెడ్డి, 89788 69183

అమ్మకోసం రాసిన కవిత్వం

ఇది సరళక్క కొడుకు కవిత్వం. కాసుల రవి గురించి కొద్దిసేపు పక్కనపెడతాను. ఆ ముసలవ్వెవరో పోల్చినట్టు, పక్కనున్న విజయత్తమ్మ, పక్కింటి శారద పిన్ని గుర్తుపట్టినట్టు ఆ వాక్యం కాలర్ పట్టుకుని ఒక మాట చెబుతాను. ఇదంతా బతకడమనే గొప్ప విషయాన్ని, విజయం చేసిన అమ్మ చేతుల్తో రాసిన కవిత్వం. కాదనే ధైర్యమే లేదు. ఇది రవి మొదటి కవిత్వ సంపుటి. 48 వచన కవితలున్న ఈ పుస్తకంలో మనల్ని ఈ సరళక్క కొడుకుతనంతో రాసిన కవిత్వమే ఆకర్షిస్తుంది. ఏమిటా వైయిక్తికత? అది మనుషులమీద అతనికున్న నమ్మకమూ సెంటిమెంటేనేమో! అభివ్యక్తిలో మహా సరళత, భావానుభూతి కలిగించడంలో అతను వాడిన నిరలంకార భాష ప్రధానమైన పనిముట్లుగా ఉంటాయి.





స్థూలంగా వస్తుగత కావ్య పరిమళమే కవితలనిండా కనిపిస్తుంది. ఆసిఫా లాంటి ఆడపిల్లల గురించి, అంబేద్కరిజం, వృద్ధాప్యం, మహిళా దినోత్సవం, పనిచేయని ఆసుపత్రి, ఆడకూతురుండాలనే కోరిక, చదవలేక పాట్లు పడుతున్న బాల్యం గురించి.. చాలా చాలా వైవిధ్యమైన వస్తువులున్నాయి. తారే జమీన్ పర్ అంటాడు, నీదీ నాదీ ఒకే కథ అని కూడా అంటాడు. సమకాలికత మెయిన్‌టెయిన్ చేస్తాడు. మరింకేంటి? అంతా బావున్నట్టే కదా? అలా అని అనాలనిపించదు. ఎందుకనంటే కవితా వాక్యాల్లో ఇందాకనుకున్న నిరలంకారత స్పష్టమైన కావ్య లక్షణంగా కనిపించినప్పటికీ ఉద్వేగ ప్రకటన తక్కువగా ఉంటుంది. ఆధునిక వచన కవిత్వంలో ఉపమాలంకారముందా, ఎక్కువగా రూపకముందా అనే అసందర్భ ప్రసంగమైతే చేయలేను కానీ, నిరలంకారతలో కూడా వ్యావహారిక భాషా సౌందర్యం ఒక వేగాన్ని కలిగి చటుక్కున మనల్ని ఆకర్షిస్తుంది. అలాంటి కవితలు నేటి యువ కవులు ఎక్కువగా రాస్తున్నారు కూడా. ఆ లక్షణం 'అమ్మో కవిసమ్మేళనం' అన్న కవితలో బాగా ధ్వనిస్తుంది. చదవడం పూర్తిచేశాక పాఠకుడు ఒక ఆలోచనాత్మక నిర్ణయం తీసుకోవల్సిన అగత్యముంటుంది. మంచిది కద. అలాగే ఏటీయం, పిల్లలంతా జై అన్నారు, అమ్మాయా అబ్బాయా లాంటి కథనాత్మక పద్ధతిలో ఉన్న కవితలు కూడా ఒప్పుకునేట్టుంటాయి. అక్కడే అతని శైలేమిటో మనకి దొరుకుతుంది. ఈ అలిగోరికల్ నిర్మాణ లక్షణం మెచ్చుకోతగ్గది. అలాగే కాన్వర్షేషనల్ టోన్ కలిగి ఉండటమూ మనం సులువుగా కనిపెట్టగలుగుతాం. అయితే ఈ రెండు ప్రధాన లక్షణాలతో నేటి కవిత్వ సృజనశీలుర మధ్య నిలబడే సాహసం కవి చేయగలడా?

ఈ కవి కవిసంగమం చెట్టు మీద కూత నేర్చిన పిట్ట. ఆ ప్రేమని "వెల కట్టలేని ప్రోత్సాహం, చక్కటి విమర్శలు, వాడీ వేడిగ చర్చలు, ఇదొక సాహితీ విశ్వ విద్యాలయం" అని రాసుకుంటాడు. కృతి స్వీకర్త యాకూబ్ కూడా "కవి అంతర్బాహి ప్రపంచాల మధ్య కళ్ళు తెరిచే లోపలి మనిషి" గురించి చాలా బాగా ఉదహరిస్తాడు. సైకిల్ శవ యాత్ర, ఆ కళ్ళు ప్రశ్నిస్తున్నాయి లాంటి కవితలు అతనిలోని సామాజికుణ్ణి చూపిస్తాయి. 'ఫారెస్ట్ ప్రూవుడ్, నాలో సగం' కవితలు చాలా బాగుంటాయ్. సింపుల్‌గా ఉన్నప్పటికీ గంభీర విషయ ప్రస్తావన చేస్తాయి. కవిత్వ సాంద్రత, సౌకుమార్యం రెండూ చదివిస్తాయి. "రాజీ పడని సెన్సారు బోర్డు ఆమె, ఆమె విమర్శ సర్జికల్ బ్లేడుకన్నా పదునైనది, ఆమె పొగడ్త పది నోబెల్స్‌తో సమానం" లాంటి వాక్యాల్ని ఇష్టపడకుండా చదవలేం.

ఇదింకా కవి, కవిత్వం రాస్తున్న కొత్తదనాన్ని దాచలేకపోతున్న పుస్తకం. అతనే చెప్పుకున్నట్టు "పగలూ రాత్రి, చలిలో వానలో, పదాలతో కుస్తీ పడుతూ, ఆనందిస్తూ, ఆస్వాదిస్తూ, రాస్తూ, సరిచేస్తూ, మురిసిపోతూ" అంటాడు. అంతవరకూ ఇబ్బంది లేదు. కేవలం మురిసిపోవడం దగ్గర ఆగిపోతే ప్రమాదంలో పడతాడు. విప్లవకారుడు లాంటి కవితని రెండు సంవత్సరాలు ఎడిట్ చేశానని చెప్పినప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. ఎడిట్ చేయడమంటే లోతుగా ఇంకా తెలుసుకోవల్సిన అవసరం ఉంది కవికి. వస్తు ఎంపికలో, దాన్ని చూసే చూపులో, నిర్మాణ కుశలతలో నీదైన ముద్ర, పద ప్రయోగంలో తాజాదనం, అసలు మొత్తంగా నువ్వు చదువర్లని మెప్పించే ఓవరాల్ పెర్‌ఫార్మెన్స్ కోసం ఎడిటింగ్ చాలా చాలా సద్వినియోగ పరుచుకోవల్సిన ప్రక్రియ. అది ఎవ్వరి వాక్యంలోనైనా ప్రతిఫలించడం చాలా సులువు. కనుక రవి కవిత్వం పట్ల తనకున్న అపారమైన అనురక్తిని ఇలానే ఉంచుకోవాలి. ఇప్పటిదాకా వివిధ కవిత్వ లక్షణాలతో ప్రపంచాన్ని ఉర్రూతలూపిన కవిత్వాన్ని చదవాలి. జీర్ణించుకోవాలి. అప్పుడు కవిత్వపరమైన హేతువులు కొత్త పాఠాలు నేర్పుతాయి. అతనికిష్టమైన కవి మాటల్లో మననం చేసుకోవాలంటే "తమ్ముడూ బహుపరాక్, దేశాకాశంలో రాబందుల రెక్కల చప్పుడు. స్వర్ణ దేవళం కోనేటిలో నెత్తురు జలకాలాడిన రాబందు. జాప్ పూ పర్వత శ్రేణుల్లో కపాల నృత్యం చేస్తోన్న రాబందు. జాఫ్నా నెత్తురు దోసిళ్ళతో తాగే రాబందు" (జాగ్తే రహో) లాంటివి రాబందులపై యుద్ధం చేసే నమ్మకంతో చదవాలి. అప్పుడు కొత్తతరం గొంతు విని పుడమి పులకరిస్తుంది. కడలి కనులు తెరుస్తుంది. జీవితం ఒంటరిగా చిందించిన రక్త ధార, కొత్తతరం గొంతు విని ప్రభవించే కాలానికి కొత్త సూర్యోదయమవుతుంది. నిన్ను గూర్చి నన్ను గూర్చి నిఖిల సృష్టిలోని ఖిలం గూర్చి నీరవ సుందర హృదయపాత్ర నిండిన హలాహలం గూర్చి, కవిత్వం నిజం చెప్పమని నిలదీస్తుంది. నీ కవిత్వంలో నువ్ దొరికిపోతాప్రోయ్ తమ్ముడా!


– శ్రీరామ్, 9963482597

రాఖీ 'ఫెంటోలు'

నలుపు తెలుపు..!
రంగుల్ని దోచేదొకటి,పంచేదొకటి..!!

సౌందర్యం ఆనదు.!
వెలిగిపోయే వ్యక్తిత్వం ముందు..!!

గులాబి సొంతమౌతుంది..!
గుచ్చుకునే ముల్లునూ సహిస్తేనే..!!



తెలుపు మనసు ప్రధానం..!
రంగులదేం, ఉదయం
అరుణం, మరణం కృష్ణం..!!

గడ్డిపోచే దర్భ,గుండెలా.. !
తడిపితే మెత్తన,కెలికితే కత్తిలా..!!

సంలీనమైన ప్రతిక్షణం .,
దేహత్యాగం..ఆత్మ యోగం..!!

విజయం మీ వెంటే...!
పలుకులు నొవ్వకుంటే,
నవ్వులు రువ్వుతుంటే..!!

"మనిషి" ఆత్మహత్య దిశగా..!
పర్యావరణాన్ని పరిమారుస్తూ..!!

పదవే ప్రాథమ్యం,పరమార్థం..!
రాజకీయమే
హేయం.,గురివిందలా నిందలా..?!

బంధం గొప్పదే ఎప్పటికీ..!
అనురాగం పంచుతూ.,
నిత్య చైతన్యమై..!!

– గొల్లపల్లి రాంకిషన్(రాఖీ)



పెండ్లితోనే జీవితం ఆగిపోదనుకునేవాళ్లకు ఆమె ఓ ఉదాహరణ. చదువంటే ఆమెకు పిచ్చి. వచ్చిన ఉద్యోగం చాల్లే అనుకోలేదు. అందుకే టీచర్‌గా ప్రస్థానం మొదలుపెట్టి... ప్రధానోపాధ్యాయురాలిగా, గాళ్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, మండల విద్యాధికారిగా, ప్రస్తుతం విద్యాశాఖలో సెక్టోరియల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నది. తండ్రి స్ఫూర్తిగా, తల్లి ప్రేరణగా... ఇంటా, బయటా సక్సెస్‌ఫుల్ ఉమెన్‌గా నిలిచిన ఆ దళిత బిడ్డ **తగరం అరుణశ్రీ**. 'సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఆడపిల్లలకు బంగారు భవిష్యత్ ఇవ్వగలిగితే... నా జీవితం సార్థకమైనట్టే'నంటున్న ఆ నల్లగొండ ఆడబిడ్డ గురించి..

సమంగా చూడటానికి ఇష్టపడరు...

"వేషధారణ, రంగును బట్టి నేను ఎస్సీ అని ఎవ్వరూ అనుకోకపోయేవారు. కానీ.. తెలిసిన తరువాత భిన్నంగా చూసేవారు. అంతకు ముందు.. ఆ తరువాత చాలా తేడా ఉండేది. వాళ్లతో సమంగా చూడటానికి ఇష్టపడేవాళ్లు కాదు. ఓసారి ఒక ఎంపీటీసీ వచ్చి.. 'స్వీపర్ పోస్టు కావాలి ఒక ఎస్సీకి' అని తీసుకొచ్చాడు. 'అది నేను ఇవ్వడానికి కుదరదు. కలెక్టర్ చేతిలోనే ఉంటుంది' అని చెప్పాను. వెంటనే 'మేడం మనలాంటోల్లం చేయలేం కదా! అలాంటివి ఈ మాల మాదిగోళ్లే చేస్తరు' అన్నడు. అతడు బీసీ. నన్ను బీసీనో, ఓసీనో అనుకున్నడు. 'మనలాంటోళ్లంటే నన్నేమనుకుంటున్నవ్! కేవలం ఎస్సీలే ఆ పని చేయగలుగుతరని ఎట్లా అంటవ్! నేను ఎస్సీనే. కానీ ఈ పని చేయగలుగుతున్నా కదా! నువ్వు బీసీవి.. అయినా నా పని చేయలేవు! ఇప్పుడు నువ్వు ఎంపీటీసీవేమో.. టర్మ్‌అయిపోయిన తరువాత జీరో! కులాలను బట్టి పనులు ఉండవు' అని హెచ్చరించాను. దళితుల పట్ల ఇతరుల తీరు ఎలా ఉందనడానికి ఇదో ఉదాహరణ. ఇలాంటివి చాలా చూశాను"

బాలికల కోసం పనిచేయడంలోనే తృప్తి

అరుణశ్రీ సొంతూరు చింతపల్లి. తండ్రి తగరం ఉమామహేశ్వరరావు. అమ్మ లక్ష్మి. వీడీవోగా పనిచేసింది. తండ్రి నల్గొండలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నారు. వయోజన విద్యలో సూపర్‌వైజర్‌గా పనిచేశారు. తరువాత హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో చేశారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఆయన చాలా వివక్షను చూశారు. వైద్యశాఖలో పనిచేస్తున్నప్పుడు ఉన్నతాధికారి కరణం.. ఏదో మాటన్నందుకు కొట్టి మరీ రాజీనామా చేశారు. అలా రెండు ఉద్యోగాలు వదులుకుని రాజకీయాల్లోకి వచ్చారు. చింతపల్లి ఎంపీపీగా భారీ మెజారిటీతో గెలిచారు. చింతపల్లి మండలంలో తగరం ఉమామహేశ్వరరావు అంటే ఇప్పటికీ ఎంతో గౌరవం. ఆయన నిజాయితీ, నిబద్ధతే ఆ పేరును తెచ్చిపెట్టింది. చింతపల్లి మొత్తం వెలమల ఇలాకా. అక్కడ పట్టుబట్టి అంబేద్కర్ విగ్రహం పెట్టించారు. పుస్తకాలు బాగా చదివేవారు. పిల్లలు అరుణశ్రీ, కరుణశ్రీ, జయశ్రీ, శశిధర్.. నలుగురిలో పెద్దది అరుణశ్రీ. గాళ్స్ హైస్కూల్‌లో చదువుకుంటుండగా... రెసిడెన్షియల్ స్కూల్ నోటిఫికేషన్ వచ్చింది. నల్గొండ జిల్లాలో బాలికలకు ఒకే ఒక రెసిడెన్షియల్ మట్టంపల్లి. ప్రవేశపరీక్ష రాస్తే అందులో సీటొచ్చింది. తరువాత నల్గొండ గాళ్స్ జూనియర్‌కాలేజీలో ఇంటర్ బైపీసీ చదివింది. ఇంటర్ సెకండియర్‌లోనే పెండ్లి అయ్యింది. కానీ చదవాలన్న ఆకాంక్ష బలంగా ఉండేది. పేరు పక్కన, బీఎస్సీ, బీఏ అంటూ చదువును రాసుకోవడం ఓ కల. దానికోసమే డిగ్రీ చేంది.

పట్టుబట్టి చదివి...

పిల్లలు...కాలేజీకి వెళ్లడం కష్టమని చెప్పి... బీఏ తీసుకున్నది. పిల్లలను చూసుకోవడానికి తల్లిదండ్రులు నల్గొండకు వచ్చారు. తరువాత బీఈడీ రాసింది. హైదారాబాద్‌లోనే సీట్ వచ్చింది. కానీ పిల్లలను పట్టుకోవడానికి తల్లిదండ్రులు హైదరాబాద్‌కి రావడం కష్టమని చెప్పి... నల్గొండ జిల్లా కేంద్రంలోని డీవీఎమ్ కాలేజీలో బీఎడ్ సీటు తీసుకున్నది. ఎంత చదివినా.. ఉద్యోగం చేయకపోతే చదువు నిరర్థకం అనుకుంది. తప్పనిసరిగా ఉద్యోగం చేయాలన్న పట్టుదల. ఓ క్లర్క్‌పోస్టుకోసం ఇంటర్వ్యూ దాక వెళ్లింది. కానీ రాలేదు. తరువాత ఎంపీడీఓ పడితే రాసింది. గ్రూప్‌వన్ రిజల్ట్ రాకముందే రద్దు చేశారు. నాకే ఎందుకిలా జరుగుతోందని ఆందోళన. అప్పుడే డీఎస్సీ పడింది. షెడ్యూల్ క్యాస్ట్ కోచింగ్ సెంటర్‌లో చేరి... కష్టపడి చదివింది. అలా 2000 సంవత్సరంలో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ రెండూ వచ్చాయి.

నిత్య విద్యార్థి...

స్కూల్ అసిస్టెంట్‌గా చేరింది. గుర్రంపూడ్ మండల్ పోచంపల్లిలో ఆమె మొట్టమొదటి స్కూల్ అసిస్టెంట్ టీచర్. చాలామంది టీచర్‌గా మొదలుపెట్టి... టీచర్‌గానే పదవీవిరమణ పొందుతారు. కానీ ఆమె అలా కాదు. ఉన్నచోటే ఉంటే ఉనికిని కోల్పోతామని



తెలుసుకుంది. డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్స్ రాస్తూ పోయింది. ఎనిమిదేండ్లు పనిచేసిన తరువాత గెజిటెడ్ హెచ్‌ఎమ్ ప్రమోషన్ వచ్చింది. మూడున్న రేండ్లపాటు చేసింది. తరవాత... గాళ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా కస్తూర్బా స్కూల్స్ మానిటరింగ్ మూడేండ్ల పాటు చేసింది. ఆమె నిత్య విద్యార్థి. ఉద్యోగం చేస్తున్నా చదువుకోవాలన్న ఆకాంక్ష పోలేదు. ఎమ్మే పొలిటికల్ సైన్స్ చదివింది. డైట్ లెక్చరర్ కావాలన్న ఇష్టం ఉండేది. అందుకే ఇగ్నోలో ఎమ్ఎడ్ నోటిఫికేషన్ పడితే.. దరఖాస్తు చేసుకుని ఎమ్ఎడ్ కంప్లీట్ చేసింది. మండల విద్యాధికారిగా కొంతకాలం పనిచేసిన అరుణశ్రీ... ప్రస్తుతం విద్యాశాఖలో సెక్టోరియల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నది. మోడల్ స్కూల్స్, కస్తూర్బాగాంధీ విద్యాలయాల పర్యవేక్షణ చేస్తున్నది.

బాధ్యత సంతోషాన్నిస్తుంది...

ఉపాధ్యాయురాలు, ప్రధానోపాధ్యాయురాలు, గాళ్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, మండల విద్యాధికారి. ఇప్పుడు సెక్టోరియల్ ఆఫీసర్‌గా. ఇన్ని బాధ్యతల్లో... బాలికల కోసం పాటుపడే... గాళ్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అంటేనే ఇష్టమని చెబుతుంది. అందుకే సెక్టోరియల్ ఆఫీసర్‌గా కావాలనే కస్తూర్బా గాంధీ విద్యాలయాల నిర్వహణను తీసుకున్నది. ఎందుకలా అంటే... 'అందులో మధ్యలో చదువాపేసిన పిల్లలు, తల్లో, తండ్రో... ఎవరో ఒక్కరే ఉన్న పిల్లలు, అసలు తల్లిదండ్రులు లేని పిల్లలు, నిరుపేదల పిల్లలు ఉంటారు. వాళ్లకోసం, అందులోనూ అమ్మాయిలకోసం పనిచేయడం సంతోషాన్నిస్తుంది. నా తరువాతి తరానికి ఎంతో కొంత భవిష్యత్‌ను ఇవ్వగలుగుతన్నా అనేది సంతృప్తి ఉంటుంది. అందుకే మళ్లీ ఇప్పుడు కేజీవీబీల బాధ్యత తీసుకున్నాను. ప్రస్తుతం నల్గొండలో 27 కేజీబీవీలు ఉన్నయి. అన్ని ఫుల్ స్ట్రెంత్‌తో నడుస్తున్నయి. అందులో ఐదు స్కూళ్లు ఇంగ్లీష్ మీడియం. ఆరు స్కూళ్లలో కాలేజీలు కూడా ఏర్పాటు చేశాం. ఈ ఘనత ఒక్క నల్గొండకే దక్కుతుంది. ప్రస్తుతం రెసిడెన్షియల్‌కు ధీటుగా నడిపిస్తున్నాం. ఇంగ్లీష్ మీడియం అయిన తరువాత ఆర్థికంగా ఉన్న పిల్లలు కూడా వచ్చి చేరుతున్నరు. అది కొత్త పరిణామం" అని సంతోషంగా చెబుతున్నది.

మహిళగా వివక్ష...

తొలినాళ్లలో మహిళగా చాలా వివక్షను ఎదుర్కొన్నది. అలాంటి సమయంలో చాలా బాధపడేది. జిల్లాలో ఎడవెల్లి హైస్కూల్... చాలా పాత స్కూల్. ఆ స్కూల్‌కి మొట్టమొదటి మహిళా ప్రధానోపాధ్యాయురాలు ఆమె. బదిలీల్లో ఆ స్కూల్ బాధ్యతలు తీసుకుని బయటకు రాగానే... 'ఎడవెల్లి ఎవరు తీసుకున్నరు?' అని అడిగిండ్రు. 'నేనే' అని ఆమె చెప్పగానే... 'ఎందుకు తీసుకున్నవు? నువ్వేడ చేయగలుగుతవ్? ఏం తెలుసని ఆ స్కూల్ తీసుకున్నవ్. అంత పెద్ద స్కూల్‌ను ఏం చేద్దామని తీసుకున్నవ్? అసలే హెచ్‌ఎమ్‌గా కొత్త అపాయింట్ మెంట్ ఉన్నట్టున్నవ్..' అని ప్రశ్నల వర్షం కురిపించారు. అలాంటిది... మూడున్నరేండ్లపాటు అక్కడ పనిచేసి... స్కూల్‌ను మూడేండ్లు వరుసగా పర్సంటేజీలో, ర్యాంకుల్లో మండల్ టాపర్‌గా నిలిపింది. ఒక ఏడాది ఫస్ట్ సెకండ్, థర్డ్ ర్యాంకులు కూడా తన స్కూల్‌వే! చివరకు తనతో పోటీ పడటానికి భయపడ్డారు మిగిలిన ప్రధానోపాధ్యాయులు. 'అలాంటివాళ్లకు.. మన పనితీరే వాళ్లకు సమాధానం' అని చెబుతుంది. నిజమే... ఎన్నో రకాల ప్రశ్నలకు ఆమె పనితీరే సమాధానం. అందుకే తొమ్మిదేండ్లలో ఆరు అవార్డులు దక్కించుకున్న అధికారిగా పేరు తెచ్చుకున్నది. అవి కూడా తాను దరఖాస్తు చేసుకున్నవి కాదు. అన్ని వాళ్లు పిలిచి ఇచ్చినవే! "ముందల నాగలి మంచిగ నడిస్తే... మిగతాయన్ని సక్కగ పోతయి" అని పాత సామెత. కానీ ఆమె కుటుంబానికి సరిగ్గా సరిపోతుంది. తన తరువాతి చెల్లి కరుణశ్రీ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్‌గా ఉద్యోగం తెచ్చుకున్నది. చిన్న చెల్లి జయశ్రీ... గొల్లగూడ హాస్పిటల్‌లో జీఎన్‌ఎమ్‌గా పనిచేస్తున్నది. తమ్ముడు శశిధర్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసున్నారు. "నాన్న డబ్బు సంపాదించలేదు. పేరు సంపాదించాడు. డబ్బులు సంపాదిస్తే ఖర్చు పెట్టేటోళ్లం కానీ. ఉద్యోగాలు సంపాదించలేక పోయేవాళ్లం. జీవితంలో సెటిల్ కాకపోయేవాళ్లం" అని తండ్రిని తలుచు కుంటూ గర్వంగా చెబుతుందామె!

కట్ట కవిత

అమ్మానాన్నలు ఆదర్శం...



"నాన్న ఉమామహేశ్వరరావు అవినీతికి చాలా దూరం. ఆయనది చాలా క్రమశిక్షణ కలిగిన జీవితం. మద్యం జోలికి పోడు. మాంసాహారం కూడా ఎక్కువగా తినడరు. అప్పట్లో ఎంపీపీ అయినా బాగానే సంపాదించుకునేవాళ్లు. కానీ నాన్న మాత్రం చాలా నిజాయితీగా ఉండేవారు. 'నాన్న ఎందుకిలా ఉంటారు?' అని అప్పుడనేకునేవాళ్లం. కానీ నాన్న ఏం సంపాదించిండో... నేను ఇప్పుడు సంపాదిస్తుంటే అర్థమవుతున్నది. ఇప్పుడు విధి నిర్వహణలో నా నిబద్ధత అంతా నాన్న నేర్పించినదే. ఇక అమ్మ అప్పట్లోనే చదువుకుని ఉద్యోగం చేస్తూ మమ్మల్ని పోషించింది. అమ్మది ఫీల్డ్ జాబ్. మాకోసం తక్కువ సమయం కేటాయించేది. కానీ కుటుంబ నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణ అమ్మ నుంచే నేర్చుకున్నాం. వచ్చే నాలుగైదు వేల జీతంతో మమ్మల్నిందరినీ ఏ లోటు రాకుండా పెంచింది. అమ్మానాన్న గొడవ పడటం ఎప్పుడూ చూడలేదు. అంత ఆదర్శంగా ఉండేవాళ్లు. ఇప్పుడు నా భర్త తులసీదాస్ కూడా అంతే సపోర్టివ్‌గా ఉంటారు. నా ఉద్యోగపరమైన విషయాల్లో అస్సలు జోక్యం చేసుకోడు. నాకు ఇబ్బంది అయ్యే పరిస్థితి వస్తే మాత్రం ఊరుకోరు. పిల్లలు కూడా ఎంతో సహకరిస్తారు"

సహజత్వాన్ని పొందాలంటే...



ప్రత్యేక రోజుల్లో స్పెషల్‌గా రెడీ అయ్యేందుకు ఖరీదైన ఫేస్‌క్రీమ్స్ వాడుతుంటారు చాలా మంది. అయితే ఆ క్రీమ్స్ కేవలం ఆ క్షణానికి మాత్రమే మెరుపునిస్తాయి. ఆ తర్వాత మళ్లీ మామూలే. మచ్చలు, మొటిమలు కనిపించకుండా ఉండేందుకు పైపై పూతలు పూసుకునేకంటే... శాశ్వతంగా తొలగిపోయేందుకు సహజ సిద్ధమైన చిట్కాలను పాటించాల్సిందే. అప్పుడే అందం సహజత్వాన్ని పొందుతుంది. దాని కోసం కొన్ని సహజ సిద్ధమైన చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

క్లీనప్ కోసం : ఆరెంజ్ జ్యూస్ – మూడు చెంచాలు, తేనె –సగం చెంచా, గ్లిజరిన్ – మూడు చుక్కలు.

స్క్రబ్ కోసం : ఓట్స్ – ఒక చెంచా, యాపిల్ గుజ్జు – రెండు చెంచాలు, చిక్కటి పాలు – ఒక చెంచా.

ఫేస్ మాస్క్ కోసం : కొబ్బరి పాలు – రెండు చెంచాలు, శనగపిండి – ఒక చెంచా, జామపండు గుజ్జు – ఒక చెంచా. (గింజలు తొలగించి)

తయారీ విధానం : ముందుగా తేనె, గ్లిజరిన్, ఆరెంజ్ జ్యూస్ ఒక చిన్న పాత్రలో పోసుకుని బాగా కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు నిమిషాల తర్వాత మెత్తని క్లాత్‌తో క్లీన్ చేసుకోవాలి. ఇప్పుడు యాపిల్ గుజ్జు, చిక్కటి పాలు, ఓట్స్ ఒక బౌల్‌లోకి తీసుకుని బాగా కలుపుకొని ఇంచుమించు ఐదు నిమిషాల పాటు స్క్రబ్ చేసుకోవాలి. తర్వాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకుని ఆవిరి పట్టించుకోవాలి. ఇప్పుడు జామపండు గుజ్జు, కొబ్బరిపాలు, శనగపిండి ఒక బౌల్‌లోకి తీసుకుని బాగా కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకుని, ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖం కడుక్కోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చెయ్యడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ముఖానికి ఫేస్ ప్యాక్ వేసిన తర్వాత సబ్బు పెట్టకపోవడం మంచిది.

నిద్రమత్తును జయించండిలా..



మంచి ఆరోగ్యానికి రోజుకి కనీసం ఎనిమిది గంటలు నిద్రపోవాలని మనకు తెలిసిన విషయం. మంచి నిద్ర ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో.. అతి నిద్ర అంత హాని కూడా చేస్తుందని అమెరికాకు చెందిన న్యూయార్క్ 'యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్' పరిశోధనల్లో వెల్లడైంది. అతిగా నిద్రపోయేవారికి గుండెపోటు వచ్చే అవకాశాలు 146 శాతం అధికంగా వున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

- నిద్రపోయినప్పుడు పిలిస్తే లేచేవాళ్ళు కొందరు, ఒక్కసారి ముట్టుకుంటే చాలు ఉలిక్కిపడి లేచి కూర్చుంటారు మరికొందరు. కానీ అతి తక్కువ శాతం మంది మాత్రం ఎంత పిలిచినా ఉలకరు పలకరు. మెలకువ వచ్చినా లేవలేరు కూడా. నిద్రలేమివల్ల వచ్చే రోగాలతో పాటు నిద్రరోగాలు కూడా వేధిస్తున్నాయి.
- నిద్రలేమివల్ల డిప్రెషన్‌కు గురి అవుతారనేది సాధారణమైన విషయమే అయినప్పటికీ, అధిక నిద్రవల్లకూడా డిప్రెషన్‌కు లోనవుతారని రీసెర్చ్‌లలో తేలింది. రెగ్యులర్ సమయాల్లో నిద్రపోవడం చాలా అవసరం. ఎక్కువగా నిద్రపోవడం లేదా తక్కువగా నిద్రపోవడం లేదా చాలా ఆలస్యంగా పడుకోవడం వల్ల ఊబకాయానికి దారి తీస్తుంది. వారాంతంలో లేదా సెలవుల్లో నిద్రించే సమయం కంటే అధిక సమయం నిద్రపోవడంవల్ల మెదడులోని కొన్ని న్యూరోట్రాన్సి మీటర్ల వల్ల అధిక తలనొప్పికి దారితీసే ప్రమాదముంది.
- సమయపాలనతో కూడిన నిద్ర వల్ల రోజంతా ఉండే నిద్రమత్తు నుండి ఉపశమనం పొందవచ్చు. ప్రతిరోజు ఒకే సమయంలో నిద్రపోవటానికి ప్రయత్నించండి. రోజూ ఒకే సమయానికి మేల్కొనండి. ఇలా చేయడం వల్ల శరీరానికి నిద్ర సమయం అలవాటు పడుతుంది.
- ఎంచుకున్న నిద్ర సమయం సరిపోయేంతలా ఉండాలి. నిద్ర సమయం అనేది ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా వుంటుంది. కొంతమంది ఎనిమిది గంటల పాటు పడుకుంటే రోజంతా హుషారుగా వుంటే, మరొకరికి ఐదు గంటల నిద్రతో హుషారుగా వుంటారు. కావున ఎంత సమయం పాటూ నిద్ర సరిపోతుందో తెలుసుకొని, దానికి తగిన విధంగా నిద్ర సమయాన్ని కేటాయించుకోవాలి.
- జంక్‌ఫుడ్‌కు బదులుగా ఆరోగ్యకరమైన స్నాక్స్ తినటం వల్ల నిద్రమత్తు దరి చేరదు. కూరగాయలు, పండ్ల నుండి మన శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి. పోషకాలు ఎక్కువగా అందటం వల్ల శక్తి ఉత్పత్తి త్వరగా జరిగి నిద్రమత్తు నుండి ఉపశమనం పొందుతారు.

దద్దుర్లు దరిచేరవు...

చలికాలంపోయే ముందు చర్మంపై దద్దుర్లు బాగా వస్తాయి. ఒకవైపు పొడిగా ఉండే ఎండ, మరోవైపు చలి, చల్లటి గాలి వల్ల చర్మం మీద దద్దుర్లు తలెత్తుతుంటాయి. ఇవి రాకుండా నిరోధించేందుకు కొన్ని పాటిస్తే సరిపోతుంది.



- ❖ కలబంద గుజ్జు మంచి యాంటీ–ఇన్‌ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అందుకే దద్దుర్ల నివారణలో కలబంద ఎంతో శక్తివంతంగా పని చేస్తుంది. ఇందులో విటమిన్–ఇ కూడా పుష్కలంగా ఉంటుంది.
- ❖ అలాగే వేప పొడి, కొబ్బరి నూనె వేసి పేస్టులా చేసి చర్మంపై రాసుకుంటే దద్దుర్ల సమస్య ఉండదు. వీటిలో కూడా యాంటీ–ఇన్‌ఫ్లమేటరీ గుణాలు సమృద్ధిగా ఉంటాయి.
- ❖ వేప సహజ సిద్ధమైన క్లీనర్. ఇది రక్తాన్ని కూడా శుద్ధి చేస్తుంది. యాంటీ–ఫంగల్, యాంటీ–బ్యాక్టీరియల్ గుణాలు కలిగి ఉంటుంది. దీంట్లో క్వెర్‌సెటిన్ అనే రసాయనం పుష్కలంగా ఉంటుంది. ఇది దద్దుర్లు రాకుండా చర్మంపై మందులా పనిచేస్తాయి.
- ❖ చందనం పొడిలో కొద్దిగా గులాబీ నీళ్లను కలిపి పేస్టులా చేసి దాన్ని చర్మంపై రాసుకుని ఐదు నుంచి పది నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేస్తే చర్మంపై దద్దుర్లు రాకుండా ఉంటాయి.
- ❖ పసుపులో యాంటీ–ఎలర్జిక్, యాంటీ సెప్టిక్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. గంధపు పొడి లేదా ముల్తాని మట్టిలో చిటికెడు పసుపు వేసి పేస్టులా చేసి చర్మంపై రాసుకుంటే దద్దుర్లు రాకుండా నిరోధించవచ్చు.
- ❖ టీ ట్రీ ఆయిల్ యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందులో కొద్దిగా కొబ్బరి నూనె వేసి బాగా కలిపి తలస్నానం చేసిన తర్వాత చర్మానికి రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మీద దద్దుర్లు రాకుండా నివారించవచ్చు.
- – పుచ్చకాయ ముక్కలను గుజ్జులా చేసి దాన్ని చర్మంపై రాస్తే చర్మానికి కావాలసిన తేమ అందుతుంది. అంతేకాదు చర్మానికి కావాల్సిన చల్లదనాన్ని కూడా ఇది పంచుతుంది.

ఆ సమయంలో నొప్పి మాయం...

పీరియడ్స్ సమయంలో కడుపునొప్పి, విపరీతంగా నడుమునొప్పి, కాళ్లు లాగడం ఉంటాయి. మసాలా ఫుడ్స్ తగ్గించాలి. కారం కూడా తగ్గించి, నెయ్యి వాడాలి. సాత్వికాహారం తినాలి. ఎండుకొబ్బరి, ఖర్జూరం, నువ్వుల వంటివి తినాలి. పెరుగు, సల్లను వాడకుండా ఉండాలి. వాటితోపాటు భుజంగాసనం, శలభాసనం... చేస్తే మంచి ఫలితాలుంటాయి.





భుజంగాసనం...

నుదురు భాగం భూమికి అనుకునేలా నెలపై పడుకోండి. ఆ తరువాత మీ అర చేతులను నెలపై ఉంచి శరీర సగభాగాన్ని లేపండి, మీ కాళ్ళను అలానే చాపి, పైన పటంలో తెలిపిన విధంగా కాలి యొక్క బొటన వేలును నెలకు తాకి ఉంచండి. ఈ భంగిమను చేసిన తరువాత, గాలిని పీల్చండి, వదలండి. ఈ విధంగా చేయటం వలన మీ శరీర బరువు తగ్గుతుంది, ఈ భంగిమ చూడటానికి పాము వాలే ఉండటం వలన కోబ్రా భంగిమ అని కూడా అంటారు.

ప్రయోజనాలు

రోజంతా కంప్యూటర్ మీద పనిచేసే ఉద్యోగులకు వచ్చే వెన్ను, మెడ సమస్యలకు ఈ ఆసనం చక్కని విరుగుడు. రుతు సమస్యలున్న మహిళలు రోజూ ఈ ఆసనం సాధన చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. అండాశయం, మూత్రాశయ సమస్యలను ఇది నివారిస్తుంది.

గర్భసంచి, నడుము భాగాల్లోని నరాలను ఉత్తేజితం చేస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు సైతం ఈ ఆసనం వేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. రోజూ ఈ ఆసనం వేస్తే లోబీపీ సమస్య దూరమవుతుంది. మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది.

గమనిక : ఈ ఆసనం వేసేటప్పుడు శరీరబరువును వెన్నుపూస మీద పడకుండా కేవలం చేతుల మీద మాత్రమే మోపాలి.

శలభాసనం...

బోర్లా పడుకొని రెండు కాళ్ళను దగ్గరగా రెండు చేతులను తొడల క్రింద ఉంచాలి. గడ్డం నేలపై ఆనించి, కొద్దిగా శ్వాస పీల్చి మొదట కుడికాలును మోకాలు వంచకుండా పైకి ఎత్తాలి. ఈ స్థితిలో కొన్ని క్షణాలున్న తర్వాత మెల్లగా కాలు నేలపై ఆనించాలి.

ఇదే విధంగా ఎడమకాలితో చేయాలి. మూడేసి సార్లు ఒక్కొక్క కాలితో చేసిన తర్వాత, రెండు కాళ్ళను కలిపి ఒకేసారి పైకి ఎత్తి కొద్ది క్షణాలు ఆగాలి. తర్వాత మెల్లగా క్రిందికి దించాలి. ఈ రకంగా మూడుసార్లు చేయాలి. తర్వాత మకరాసనంలో కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలి.

ప్రయోజనాలు

ఈ ఆసనంతో గర్భసంచి, అండాశయాలలో ఏవైనా సమస్యలు వుంటే తొలగిపోతాయి. మధుమేహాన్ని నియంత్రించుకోవచ్చు. కాళ్ల, చీలమండ, వాపులకు ఉపశమనం లభిస్తుంది. అజీర్తి, మలబద్ధకాలు నయమవుతాయి. ఈ ఆసనం జీర్ణక్రియను పెంచుతుంది. నరాల వాపు, మొలలు నివారిస్తుంది. కాలేయం వేగంగా పనిచేయడానికి దోహదపడుతుంది. కడుపుబ్బరం తగ్గుతుంది. ఉదర కోశవ్యాధులు, గాస్ట్రిక్ సమస్యలు తొలగిపోతాయి.

వైసీపీలోకి దగ్గుబాటి హితేశ్

- జగన్‌తో భేటీ అయిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు

హైదరాబాద్ :మాజీ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ మనవడు, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావుల తనయుడు హితేశ్ చెంచురాం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డితో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు ఆదివారం భేటీ అయ్యారు. హితేశ్ రాజకీయ భవిష్యత్తుపై జగన్‌తో దగ్గుబాటి చర్చించారు. అనంతరం దగ్గుబాటి వెంకటేశ్వర రావు విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌తో కలసి పనిచేయాలని హితేశ్ నిర్ణయించు కున్నారని చెప్పారు.

ఎన్నికలకు, కౌటింగ్‌కు 1500 ఓట్లు తేడా..

- మాజీ ఎమ్మెల్సీ,
  మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల

అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనీ, వారిని అనర్హులుగా ప్రకటించాలనీ మాజీ ఎమ్మెల్సీ, మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు ఆరోపించారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంచిర్యాలలో పోలింగ్‌నాటికి కౌంటింగ్ నాటికి 1500ఓట్ల తేడా ఉందన్నారు. ఎన్నికల రోజు నాలుగు గంటల వరకు కేవలం 54శాతం, ఏడు గంటలకు 64.87శాతం పోలింగ్ జరిగినట్టు అధికారులు ధ్రువీకరించారని తెలిపారు. కాని మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు 72.74శాతం పోలింగ్ నమోదైందని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్టు తమ వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. దీనిపై పూర్తి విచారణ జరిపి ఆయనను అనర్హుడిగా ప్రటించాలని ఈ నెల 22న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామనీ, అది సోమవారం విచారణకు రానుందని తెలిపారు.

'పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాణిజ్య పంటలకు ఎకరానికి రూ. 20వేల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.వేరుశనగ పంటకు మొలకలు వచ్చే పరిస్థితి ఉందని, మామిడి పూత పూర్తిగా రాలిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెవెన్యూ, వ్యవసాయ అధికారులను పంపించి పంట నష్టం అంచనా వేయించాలని కోరారు.

రజకుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : హోం మంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రజకుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ ఆలీ అన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం 2019 క్యాలెండర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజకులను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు సంక్షేమ పథకాలు ప్రవేశపెడతామని చెప్పారు. ఇప్పటికే పలు పథకాలు అమల్లో ఉన్నాయని అన్నారు. వెనుకబడిన కులాలకు సైతం అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. మల్లేష్, జె. ఉపేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బి. కాశయ్య, సరిత, సత్యనారాయణ, నరేష్, స్వాతి, ప్రేమ తదితరులున్నారు.

'మీడియాకు స్వేచ్ఛాస్వాతంత్రం ఉండాలి'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మీడియా ఏ ఒక్కరి చేతిలోనూ బందీ కాకూడదని, గుత్తాధిపత్యం ఉండరాదని, ప్రజాస్వామ్యంలో మీడియాకు స్వేచ్ఛాస్వాతంత్రం ఉండాలని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ అన్నారు.ప్రతి జర్నలిస్టుకూ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని దోమలగూడలో గల ఏవీ కళాశాలలో ఆదివారం జరిగిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిజెఎ) రెండో వార్షిక సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీడియా రంగం సమాజంలో అత్యంత ప్రాముఖ్యతగలదని, అది ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం లాంటిదని అన్నారు. ప్రభుత్వాలయొక్క లోపాలను, అవినీతిని బయటపెడుతూ, ప్రభుత్వ పథకాలలో, పాలసీలలో ఏవైనా లోపా లుంటే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని సూచించారు. జర్న లిస్టుల మీద దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. తాను కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు జర్నలిస్టులకు న్యాయంగా వేతనాలు అందేలా 'మజీజియా వేజ్ బోర్డు' రిపోర్ట్‌ను వెంటనే అమలు పర్చాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులకు తాను లేఖలు రాసానని గుర్తుచేశారు. సీనియర్ జర్నలిస్టుల సంక్షేమంకోసం సీఎం కేసీఆర్ వెంటనే వంద కోట్ల రూపాయలతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెఎస్ ఆశాలత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, కైసర్‌నగర్‌కు చెందిన రెండేండ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెఎస్ ఆశాలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఐద్వా నేతలు పరామర్శించారు. నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి వెంటనే శిక్షించాలని కోరారు. శిక్షలు కఠినంగా ఉంటేనే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు. నిరుపేద కుటుంబమైనందున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. చిన్నారిని పరామర్శించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు వినోద, సృజన, లక్ష్మి,లావణ్య, సుశీల తదితరులున్నారు.

విద్యుద్ఘాతంతో రైతు మృతి


నవతెలంగాణ-వేములవాడ రూరల్


మృతి చెందిన సుధాకర్

పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లి విద్యుద్ఘాతంతో రైతు మృతిచెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలోని అనుపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివకేశవ్ తెలిపిన వివరాల ప్రకారం.. నీలం సుధాకర్(47) తన నాలుగెకరాల భూమిని సాగు చేస్తూజీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటరు ఆన్‌చేసే సమయంలో విద్యుత్ వైరు బయటికి ఉండడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నీరజ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో బాలుడి మృతి

నవతెలంగాణ-జమ్మికుంట


(ఫైల్)

పాము కాటుతో బాలుడు మృతిచెందిన ఘటన కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కొత్తపెల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పాల రజిత-సాగర్‌ల కొడుకు షణ్ముక (7) పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. శనివారం జెండా వందనం పూర్తి అయిన తర్వాత ఇంటికి వచ్చి ఇంటిముందు ఆడుకుంటుండగా బాలుడి దగ్గరకు నాగుపాము వచ్చింది. పాము తోకను షణ్ముక అనుకోకుండా తొక్కడంతో అది కాటు వేసింది. స్థానికులు గమనించి దగ్గర్లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స చేసిన అక్కడి వైద్యులు నేరుగా నరంపైనే పాటు కాటేసిందనీ, హన్మకొండకు తీసుకెళ్లాలనీ సూచించారు. హన్మకొండలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు.

'ఆ' పార్టీలు మోసం చేశాయి

టీడీపీ, వైసీపీ, బీజేపీలపై రాఘవులు విమర్శ

- వామపక్షాలు,జనసేనతోనే రాష్ట్ర ప్రయోజనాలు


మాట్లాడుతున్న రాఘవులు

విజయవాడ: ప్రత్యేకహోదాతో పాటు విభజన హామీల అమలు విషయంలో బీజేపీతో పాటు తెలుగుదేశం, వైసీపీలు కూడా రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవి రాఘవులు అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్యారడైజ్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలను పురస్కరించుకుని స్థానిక పిన్నమనేని కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం సీపీఐ(ఎం) తూర్పుకృష్ణా కమిటీ ఆధ్వర్యంలో 'వర్తమాన రాజకీయ పరిస్థితులు - కర్తవ్యాలు' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో బీవి రాఘవులు మాట్లాడుతూ నాలుగన్నర్నేళ్ళపాటు బీజేపీతో కలిసి తెలుగుదేశం పార్టీ అధికారంలో భాగం పంచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కూటమి నుండి బయటకు వచ్చిన టీడీపీ నేతలు హోదా గురించి రంకెలు వేస్తున్నారని, ఇది వృథా ప్రయాసగానే మిగులుతుందని అన్నారు. వైసీపీ కూడా ప్రత్యేకహోదా కోసం ఉన్నానని చెబుతూ, హోదాకు ద్రోహం చేసిన బీజేపీతో లోపాయకారిగా అంటకాగుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీకి అండగా నిలిచి ఏపీలో ప్రజలకు సామాజిక న్యాయం కల్పిస్తామని వైసీపీ చెప్పటం బూటకమేనన్నారు. ప్రత్యేకహోదా సాధనతో పాటు, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ వామపక్షాలు, జనసేనతోనే సాధ్యమవుతుందని అన్నారు. హోదా తిరస్కరించడంతో పాటు, దేశ సమగ్రతకు తీవ్ర నష్టం కలిగిస్తున్న బీజేపీని, దాని మిత్రులను రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. హోదాతో పాటు, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా మూడో శక్తి కావాలని సీపీఐ(ఎం) భావిస్తోందని, ఇప్పటికే జనసేన వంటి శక్తులు కలిసి వస్తున్నాయని, ఇంకా కలిసి ముందుకు వచ్చే పార్టీలను కలుపుకుపోనున్నట్టు తెలిపారు. అంతర్జాతీయంగా అమెరికా ఇతర పెట్టుబడిదారీ దేశాల్లో నెలకొన్న ఆర్థిక మాంద్యం దేశంపైనా తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ నిర్ణయాలు దేశానికి తీవ్ర నష్టం కలిగించాయన్నారు. దేశంలో వ్యవసాయ రంగం, పారిశ్రామిక ఉత్పత్తులు సక్రమంగా లేవని, ప్రజల్లో కొనుగోలు శక్తి క్షీణించిందని, నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగిందని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన పరిస్థితుల్లో దేశ అభివృద్ధికి వచ్చిన అవకాశాన్ని బీజేపీ, ఎన్‌డీఏ ఉపయోగించుకోలేదని, కార్పొరేట్లు బ్యాంకు రుణాలను మాఫీ చేసేందుకు, రాయితీలు ఇచ్చేందుకు మాత్రమే ఉపయోగించారన్నారు. దీంతో కార్పొరేట్లు మినహా, దేశంలోని రైతులు, కార్మికులు నిరుద్యోగులందరూ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, 5 రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓటమి, ఆ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేసిందన్నారు.

వామపక్షాలతో కలిసే...విజయపతాకం!

టీడీపీ, వైసీపీలను దీటుగా ఎదుర్కుంటాం

- గుంటూరు, తెనాలి అభ్యర్థులుగా తోట, నాదెండ్ల :
  ఎన్నికల శంఖారావం పూరించిన పవన్ కళ్యాణ్



గుంటూరు: రానున్న ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి జనసేన విజయపతాకాన్ని ఎగురవేయడం ఖాయమని పవన్‌కళ్యాణ్ అన్నారు. గుంటూరులోని ఎల్ఈఎం పాఠశాలలో ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికల శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ వామపక్షాలతో కలిసి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందని పునరుద్ఘాటించారు. ఇదే విషయాన్ని తాను పదేపదే చెబుతున్నా వేరే పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని అన్నారు. 'నాకు భయం లేదు. ప్రజలను మోసం చేయను. పొత్తులతో పాటు అన్ని విషయాలు చెప్పే చేస్తా' అని ఆయన అన్నారు. టీడీపీ, వైసీపీలు తనను తొక్కేయడానికి ప్రయత్నిస్తున్నాయని, ఆ రెండు పార్టీలనూ దీటుగా ఎదుర్కుంటామని చెప్పారు. ఈ సందర్భంగా గుంటూరు, తెనాలి అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి తోట చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ లను అభ్యర్థులుగా ఎన్నికల బరిలోకి దింపుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ప్రధాన మంత్రిని అడిగితే తనకు రాజ్యసభ ఇచ్చి కేంద్రంలో మంత్రి పదవి కూడా ఇస్తారని కానీ తాను బీజేపీతో రాజీపడకుండా పోరాటం చేస్తుంటే తనకు ఏవేవో ఆపాదిస్తున్నారని అన్నారు. ప్రత్యేక హోదా గురించి చంద్రబాబు తరచూ మాటలు మారుస్తున్నారన్నారు. జగన్ ఈ విషయాన్ని ఇప్పుడు పట్టించుకోవడం లేదని పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలు ఈ అంశంపై ఒక తాటిపైకి వచ్చి కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధించాలన్నారు. తాను కేవలం ఉభయ గోదావరి జిల్లాలకే పరిమితం అయినట్టు కొందరు ప్రచారం చేస్తున్నారని ఇది వాస్తవం కాదన్నారు. 30 ఏండ్ల పాటు అధికారం ఉండాలని కోరుకుంటున్న వైఎస్ జగన్, తనకు మళ్లీ అవకాశం ఇస్తే తన కుమారుడు లోకేశ్‌ను సీఎం చేయాలనుకుంటున్న చంద్రబాబు నాయుడు సామాన్య ప్రజల కష్టాలను, యువత, నిరుద్యోగుల అభివృద్ధి గురించి ఆలోచించడం లేదన్నారు. ఐదేండ్లలో అద్భుతమైన రాజధానిని నిర్మిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పటి వరకూ తాత్కాలిక భవనాలకే పరిమితం అయ్యారని తెలిపారు. విద్య, వైద్య ఉచితంగా ఇస్తే పేద కుటుంబాలు సంతోషంగా జీవించగలవని ఈదిశగా చంద్రబాబు, జగన్ ఆలోచించాలని కోరారు.

బీసీలకు 14 కార్పొరేషన్లు

- సబ్ ప్లాన్‌ను చట్టబద్ధం చేస్తాం: ఏపీ సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం: బీసీల్లోని వివిధ ఉప కులాలకు 14 కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. టీడీపీ ప్రభుత్వంలో తొలి ప్రాధాన్యత బీసీలకే ఉంటుందని పేర్కొన్నారు. బీసీలకు సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి జరిగిన జయహో బీసీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలపై వరాలు కురిపించారు. తనకు అండగా ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో 150 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాలు గెలుపొందేలా బీసీలు కృషి చేయాలన్నారు. సభలో బీసీలకు ఇచ్చిన హామీల ఖర్చు రూ.3వేల కోట్లు అని ప్రకటించారు. ఈ నిధులన్నీ రానున్న బడ్జెట్‌లో కేటాయిస్తామని స్పష్టం చేశారు. బీసీల విదేశీ విద్యకు రూ.15 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. చేనేతకు 150 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. పట్టు కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తున్న వెయ్యి రూపాయలను రూ.2 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. బీజేపీ, వైసీపీలు బీసీల్లో విభజన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. స్వర్ణకారులకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. సగర, ఉప్పర కులాల కోరిక మేరకు భగీరథ జయంతిని రాష్ట్ర పండుగగా చేస్తామన్నారు. దొమ్మెర, ఉప్పర, పాముల కులాలను కించపర్చే విధంగా ఎవరైనా మాట్లాడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. బీసీలకు 69 రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్వయం ఉపాధి పథకం కింద కార్లు, ఇతర వాహనాల కొనుగోలు చేసుకునే వారికి 25 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు.

వారణాసి సాక్షిగా...

హిందువులు పవిత్రస్థలంగా భావించే వారణాసిని సుందరీకరించాలన్నది తన కలగా ప్రధాని మోడీ చెబుతారు. కానీ, అక్కడి మురుగునీటి పైప్‌లైన్లను శుద్ధి చేసే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు కార్మికుల కుటుంబాల గురించి మాత్రం అక్కడ ఏలుబడిలో ఉన్న యోగీ (బీజేపీ) సర్కార్‌గానీ, అక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్రాన్ని ఏలుతున్న మోడీ సర్కార్‌గానీ పట్టించుకోని తీరుపై ప్రత్యేక కథనం...

- పారిశుధ్య పనుల్లో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు పరిహారమందివ్వని యోగి(బీజేపీ) సర్కార్
- సుప్రీంకోర్టు ఆదేశాలనూ లెక్కచేయనితీరు







భాబువా(బీహార్): ప్రధాని నరేంద్రమోడీ గతేడాది నవంబర్ 12న ఉత్తర్‌ప్రదేశ్‌లోని తన పార్లమెంట్ స్థానం వారణాసిలో పర్యటించారు. ఆ సందర్భంగా దినాపూర్ మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. రోజుకు 14 కోట్ల లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే లక్ష్యంతో ఆ ప్లాంట్‌ను నిర్మించారు. గంగా యాక్షన్ ప్లాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా 2012లో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఈఎంఎస్ ఇన్‌ఫ్రాకాన్ ఈ ప్లాంట్‌ను నిర్మించే కాంట్రాక్ట్‌ను పొందింది. కాగా, ప్లాంట్‌ను ప్రధాని ప్రారంభించడానికి రెండు రోజులమముందు ఈ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన పనుల్లో ఇద్దరు పారిశుధ్య కార్మికులు మృతి చెందారు. పారిశుధ్య పనుల్లో ఎవరైనా కార్మికులు చనిపోతే వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ప్రభుత్వం తరఫున పరిహారం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. అయినా ఆ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఏ సహాయమూ అందలేదని ది వైర్ పరిశోధనలో వెల్లడైంది. ప్రధాని మోడీ ఈ దేశంలోని శ్రామికుల పట్ల ఎంత శ్రద్ధ వహిస్తున్నారో చెప్పేందుకు ఈ ఉదంతమే ఓ నిదర్శనం. నవంబర్ 10న ఆ ఇద్దరు కార్మికులు మృతి చెందిన తీరును వారితోపాటు పారిశుధ్య పనుల్లో పాల్గొని తీవ్రంగా గాయపడిన తోటి కార్మికుడు సత్యేంద్ర పాశ్వాన్ చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.సత్యేంద్రతోపాటు పారిశుధ్య పనుల్లో పాల్గొన్న దినేశ్(27), వికాస్ పాశ్వాన్(22) బీహార్‌లోని భాబువా జిల్లా మదుర్నా గ్రామానికి చెందినవారు. వారి గ్రామం వారణాసికి 70 కి.మీ. దూరంలో ఉన్నది. కూలీ పనుల కోసం ఓ అడ్డా దగ్గర వేచి చూస్తున్న వీరు ముగ్గురినీ ఈఎంఎస్ మేనేజర్ పంకజ్ శ్రీవాస్తవ్ తీసుకెళ్లారు. మొదట ఓ ఇంటిని కూల గొట్టేందుకు రూ.5000 ఇస్తానని శ్రీవాస్తవ్ చెప్పారు. ఆ తర్వాత మాటమార్చి వారణాసిలోని చౌకాఘాట్ ప్రాంతంలో ఓ మురుగనీటి పైప్‌లైన్‌ను శుద్ధి చేసే పని అప్పగించారు. ఆ పైపులైన్ ఏడాది కాలంగా పడావుపడ్డది కావడంతో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. చెత్తను తొలగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా మురుగునీటి ప్రవాహం ఉధృతమై వారిని తోసుకుపోయింది. దినేశ్, వికాస్ మురుగునీటిలో కొట్టుకుపోయి చనిపోగా, సత్యేంద్ర తీవ్ర గాయాలతో బతికి బయటపడ్డారు. సంఘటన జరిగిన తర్వాత కొందరు కార్మికులతో కలిసి శ్రీవాస్తవ్ అక్కడికి చేరుకున్నారు. సాక్ష్యాలు లేకుండా చేయడానికి తనను కూడా పైప్‌లైన్‌లోకి తోసేయాలని అతనితో ఉన్న కార్మికులను ఆదేశించిన శ్రీవాస్తవ్ ఆ తర్వాత ఎందుకోగాని మనసు మార్చుకున్నారని సత్యేంద్ర చెబుతున్నారు. సంఘటన జరిగిన సాయంత్రం అక్కడికి చేరుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు పైప్‌లైన్‌ను పగులగొట్టి ఆ ఇద్దరి శవాల్నీ బయటకు తీశాయి. విషాదం గురించి తెలుసుకున్న మృతుల కుటుంబసభ్యులు కొన్ని గంటల తర్వాత తమ గ్రామ పెద్ద ప్రభు నారాయణ్‌సింగ్‌తో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఘటన గురించి తెలుసుకున్న ఎస్సీ కులాల జాతీయ కమిషన్ దీనిపై దర్యాప్తు జరిపి తమకు నివేదిక అందించాలని వారణాసి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీనిపై జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించగా సమాధానమిచ్చేందుకు నిరాకరించారు.

మృతుల కుటుంబాలకు కంపెనీ తరఫున రూ.12 లక్షల చొప్పున చెక్కులిచ్చారు. అయితే, బాధిత కుటుంబ సభ్యులకు బ్యాంక్ ఖాతాలు లేవని సాకులు చెబుతున్న గ్రామ పెద్ద ప్రభునారాయణ్ ఆ చెక్కుల్ని తన దగ్గరే పెట్టుకున్నారు. బాధితులకు చెక్కులు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించిన ది వైర్ రిపోర్టర్‌ను ప్రభునారాయణ్ తీవ్రస్థాయిలో బెదిరించాడు. 'మీరు బీహార్‌కు సురక్షితంగా రాగలిగారు. కానీ, వెళ్లేటపుడు ఓ ప్రమాదంలో మీ ప్రాణాలు పోతాయి' అంటూ ప్రభునారయణ్ పరోక్షంగా హెచ్చరించాడు. మరోవైపు తనకు ప్రభుత్వం నుంచిగానీ, కంపెనీ నుంచిగానీ ఎలాంటి సాయం అందలేదని ఈ సంఘటనలో కాలు కోల్పోయిన సత్యేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం గురించి యూపీ జల్ నిగమ్-గంగా యాక్షన్ ప్లాన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌కె బర్మన్‌ను ప్రశ్నించగా ఆ దుర్ఘటనతో తమకేమీ సంబంధంలేదన్నారు. ఈఎంఎస్ ఇన్‌ఫ్రాకాన్ కంపెనీదే బాధ్యత అంటూ తప్పించుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల గురించి గుర్తు చేయగా.. రూ.12 లక్షల చొప్పున కంపెనీ ఇచ్చింది కదా, ఇంకా మేమెందుకివ్వాలంటూ ప్రశ్నించారు. మృతుడు దినేశ్ భార్య కల్లూదేవి(24)కి నలుగురు పిల్లలు. ఇప్పుడు తామెలా బతకాలని ఆమె వాపోతున్నారు. వికాస్ భార్య అంజూదేవి(20) 7 నెలల గర్భవతి. వీరంతా పేద దళిత కుటుంబాలకు చెందినవారు. ఈ సంఘటనకు ముందు వీరంతా కొన్ని నెలలపాటు గుజరాత్‌లో కూలీలుగా పని చేశారు. నవంబర్ 6న దీపావళి సందర్భంగా తమ సొంత గ్రామానికి వచ్చామని తెలిపారు. డబ్బులకు ఇబ్బంది ఉండటంతో తిరిగి పనులు వెతుక్కుంటూ వారణాసి వెళ్లగా ఈ దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న దినేశ్ తల్లి తేతరాదేవి(68) తన కుమారుడి మరణంతో కలత చెంది రెండు రోజులకే చనిపోయారని కల్లూదేవి తెలిపారు.

ఎగిరిపోతే ఎంత బాగుంటుంది!

ఎగిరే కారును విజయవంతంగా పరీక్షించిన బోయింగ్

- నిట్టనిలువుగా గాల్లోకి టేకాఫ్..
  నేలపై సులువుగా ల్యాండింగ్
- ట్రాఫిక్ సమస్యలకు చెక్.. ప్రయాణ సమయం ఆదా
- సవాళ్ళుగా మారనున్న హ్యాకింగ్ భయం, కరెంట్ తీగలు,
  ఎయిర్ ట్రాఫిక్, వాతావరణ పరిస్థితులు
- ల్యారీ పేజ్ మద్దతుతో రూపుదిద్దుకుంటున్న
  పైలట్ రహిత ఎగిరే ట్యాక్సీ ప్రాజెక్ట్

నగరాల్లో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ట్రాఫిక్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మీటర్ దూరం కదలాలన్నా సరే.. గంటల పాటు ట్రాఫిక్‌లో ఉండాల్సిన పరిస్థితి. ఇక, వర్షాకాలం గతుకుల రోడ్ల గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. కాగా, భవిష్యత్ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపుటకు తెరపైకి వచ్చినవే ఎగిరే కార్లు (ఫ్లయింగ్ కార్స్) అని అంటున్నారు నిపుణులు. ఆ విశేషాలపై 'నవతెలంగాణ' స్పెషల్ స్టోరీ..

జై



ప్రముఖ విమానాల తయారీ సంస్థ బోయింగ్ తొలిసారిగా ప్రయోగించిన ఫ్లయింగ్ కారు ప్రొటోటైప్ సక్సెస్ అవడం ట్రాన్స్ పోర్ట్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు నాందిగా నిలువనుందని వాహనరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాజా ఫ్లయింగ్ కారుతో అర్బన్ ట్రాన్స్ పోర్టేషన్, డెలివరీ సేవలు మరింత సులభమవుతాయని బోయింగ్ సంస్థ ఈ సందర్భంగా తెలిపింది. 30 అడుగుల పొడవుతో ఉన్న ఈ కారు నేలపై నుంచి నిట్టనిలువుగా గాల్లోకి టేకాఫ్ అవడం, రన్ వే లేకుండానే సులువుగా నేలపై ల్యాండ్ అవడంతో పాటు రోడ్డుపై కారులా, ఆపై గాల్లో విమానంలో రెండు విధాలుగా ఉపయోగపడటం విశేషం. ప్రాథమికంగా ఇద్దరు నుంచి నలుగురు ప్రయాణికులు ఈ కారులో ప్రయాణించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, భారత్‌లో ఎగిరే ట్యాక్సీలను ప్రవేశపెట్టడంపై ఊబర్ సంస్థ ప్రతినిధులు ప్రధాని నరేంద్రమోడీతో గత ఏడాది భేటీ కావడం తెలిసిందే! ఎగిరే ట్యాక్సీల కోసం అమెరికాలో డల్లాస్, లాస్ ఏంజెలిస్ నగరాలను ఎంపిక చేసిన ఊబర్.. భారతదేశంలో రద్దీ నగరాలైన ముంబై, ఢిల్లీ, బెంగళూరులలో 2023 నాటికి ఈ సేవలను ప్రారంభించాలని భావిస్తున్నట్టు ప్రకటించింది.

సమస్యలూ ఉన్నాయి

ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూనే, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం, అత్యవసర సేవల్లో వినియోగించడం, వేగవంతమైన ప్రయాణం వగైరాలు ఎగిరే కార్ల మూలంగా లభిస్తున్నప్పటికీ, కొన్ని సమస్యలు లేకపోలేదు. కారు సాంకేతికత - హ్యాకింగ్ భయాలు, సుశిక్షితుడైన డ్రైవర్ అవసరం, రోడ్లపై కరెంట్ తీగలు, ఓవర్ బ్రిడ్జ్ లు, ఎయిర్ ట్రాఫిక్, వాతావరణ పరిస్థితులు తదితరాలు ప్రస్తుతానికి ఎగిరే కార్ల ప్రయాణానికి అడ్డంకిగా మారాయి.


రానున్న కాలంలో ఆయా సమస్యలను అధిగమించి త్వరలోనే ఫ్లయింగ్ కార్లను ప్రవేశపెడుతామని సదరు రంగ నిపుణులు చెబుతున్నారు. కాగా, గంటకు గరిష్ఠంగా 200 మైళ్ల వేగంతో దూసుకెళ్తూ.. దాదాపు 500 మైళ్ల (805 కిలోమీటర్లు) దూరాలకు ఒకేసారి ఐదుగురు ప్రయాణికులను తీసుకెళ్లగల ఫ్లయింగ్ కారు ప్రోటో టైప్ ను రోల్స్ రాయిస్ సంస్థ ఆరు నెలల క్రితం పరీక్షించగా.. స్లోవేకియాకు చెందిన ఏరోమొబిల్ సంస్థ ఇప్పటికే ఎగిరే కారునొకదాన్ని సిద్ధం చేసినట్టు సమాచారం. ఇక, ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 11,000 అడుగుల ఎత్తువరకు ఎగరగలిగి, గంటకు 100 మైళ్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించగల ఫ్లయింగ్ కారును ఈ ఏడాది అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెరాపుజియా కంపెనీ పేర్కొంది. రెండు సీట్లు ఉండే ఈ ఫ్లయింగ్ కారు ఖరీదు 4కోట్ల 28లక్షల రూపాయల వరకు ఉండొచ్చని పారిశ్రామిక నిపుణులు పేర్కొంటున్నారు.

ఎగిరే కారు.. డ్రైవర్ లేడు

గూగుల్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ పేజ్ మద్దతుతో నడుస్తోన్న ఓ ప్రాజెక్టు ఇప్పుడు పరిశ్రమలో హాట్ టాపిక్ గా మారింది. ఒకవైపు ఎగిరే కార్లపై ప్రయోగాలు జరుగుతుంటే, మరో వైపు ఏకంగా పైలట్ రహిత ఎగిరే ట్యాక్సీలను కొన్ని కంపెనీలు రూపకల్పన చేస్తుండటం విశేషం. న్యూజిలాండ్‌లోని పేజ్ కంపెనీ కిట్టీ హాక్ అనుబంధ సంస్థ అయిన జిఫిర్ ఎయిర్‌వర్క్స్ ఈ ఎయిర్ ట్యాక్సీలను(కోరా) అభివ ద్ధిపరిచి, పరీక్షించే ప్రణాళికను సిద్ధం చేసింది.

ఈ ప్రణాళికకు న్యూజిలాండ్ అధికారులు ఆమోద ముద్ర కూడా వేశారు. పట్టణప్రాంతాల్లో ట్రాఫిక్ అధికంగా ఉండే వీధులు, రహదారుల్లో సులువుగా టేకాఫ్ అయ్యే ఈ ఎయిర్ ట్యాక్సీలకు డ్రైవర్ అవసరం లేదు. వాహనంలో ఉన్న అత్యాధునిక ఏఐతో పని చేసే మూడు కంప్యూటర్లు ప్రయాణ మార్గాన్ని నిర్దేశిస్తాయి. ఇండ్ల పైకప్పులు, కార్ పార్కింగ్ ప్రాంతాల్లో సైతం ఈ ట్యాక్సీలు ల్యాండ్ అవగలవని రూపకర్తలు చెబుతున్నారు.

మనిషి కాదు మహాయోధుడు డీవీ




భూపతి వెంకటేశ్వర్లు

సూర్యుడు సర్వాంతర్యామి-ఆగడు.
వీరుడు జలాంతర్గామి-జంకడు.
నిర్బంధం కాయి తప్పాలి-నిలవదు
పోరాటం మృత్యుంజయి-చావదు

ఉప్పొంగిన ఉత్తేజంతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మొదటి నుంచి చివరి వరకు గన్ను, పెన్నుతో క్రియాశీలక పాత్ర నిర్వహించిన వారు తొలితరం కమ్యూనిస్టు నేత, కమ్యూనిస్టు విప్లవోద్యమ నిర్మాతలలో ఒకరు, జనం నుంచి వచ్చిన జన నేత దేవులపల్లి వెంకటేశ్వర రావు. డీవీగా అందరికీ సుపరిచితుడు. వారిది 40 ఏండ్లకుపైగా కమ్యూనిస్టు ఉద్యమాల్లో పని చేసిన అనుభవం. అందులో 17 ఏండ్లపాటు అజ్ఞాత జీవితం, 7 ఏండ్లు జైలు జీవితం ఆయన సొంతం. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి విప్లవోద్యమం వరకు ఆయన రాసినవి ఏడువేల పేజీలు, గ్రంథాలుగా వెలువరించాడు. భారత విప్లవం "భారత ప్రజల జన్మహక్కు" ఈ విప్లవం కోసం పని చేయడం మన జన్మ హక్కు, ఈ హక్కును యే రాజ్యాంగమూ, ఏ చట్టమూ అణచివేయజాలదు. భారత విప్లవం జయించి తీరుతుంది అన్న అశావహ దృక్పథం ఆయనది. తెలంగాణ నుండి కమ్యూనిస్టు పార్టీ తొలి కేంద్రకమిటీ సభ్యుడాయన. పోరాటంలో అగ్రభాగాన నిలిచిన వ్యక్తి డీవీ. నల్లగొండ జిల్లా సూర్యాపేట పట్టణానికి సమీపంలో ఉన్న బండమీద చందుపట్లలో దేవులపల్లి వరదరావు, గోషమ్మలకు 1917 జూన్ 1న జన్మించాడు. డీవీ చిన్నదేశ్‌ముఖ్, సనాతన సంప్రదాయ కుటుంబంలో నుండి వచ్చినా, చిన్ననాటి నుండి అంతస్తుల్లో ఉన్నా అట్టడుగు పొరల్లోకి చూసేవాడు. వేమన, సుమతి శతకాలను, కావ్యాలను తెలుగు సాహిత్యాన్ని చదవడం, ప్రపంచ సాహిత్యాన్ని అవగాహన చేసుకోవడంతోపాటు చదవడం ఒక అలవాటుగా మారింది. కమ్యూనిస్టు పార్టీలో చేరిన తర్వాత సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించేవారు. సాహిత్యం, సంస్కృతి, భాష, మాండలికాల పట్ల ఆయనకు లోతైన పట్టు అవగాహన ఉండేవి.

విద్యార్థిగా ఉన్నప్పుడే 'వందేమాతరం' ఉద్యమంలో పాల్గొన్నాడు. ఆనాటి నిజాం ప్రభుత్వం కాలేజీ నుంచి బహిష్కరించింది. క్షమాపణ పత్రాన్ని రాసివ్వడానికి నిరాకరించాడు. ఆ తర్వాత మహారాష్ట్రలోని జబల్‌పుర్‌లో డిగ్రీ పూర్తి చేసుకొని వచ్చాడు. 1937లో డీవీకి బ్రాహ్మణ కటుంబంతో పుట్టిన రంగమ్మగారితో వివాహం జరిగింది. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో పూర్తి కాలం కార్యకర్తగా మా రాడు. నిత్య అధ్యయనం అనునిత్యం అధ్యాప కత్వంతో కార్యకర్తల తయారీ వీరి దినచర్య. ఆంధ్ర మహాసభలో చేరి చురుకైన పాత్ర నిర్వహించాడు. అభ్యుదయ వాదులైన యువ సభ్యులను గుర్తించి వారందరికీ సామ్యవాద సిద్ధాంతాలను బోధిం చేవాడు. పోరాటాలకు అగ్రనాయకత్వం వహించి న, వహించబోయే ఒక శ్రేణిని తయారుచేశాడు. అప్పటి వరకు ఆంధ్ర మహా సభ మితవాదుల చేతుల్లో ఒక సంస్కరణాతత్పర సంస్థగానే ఉండేది. అప్పుడు డీవీ తన సహా వామ వాదులతో పదకొండవ ఆంధ్ర మహాసభలో "ఈ మహా సభలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు" అనే డాక్యుమెంట్ పెట్టి మిత వాదులను మైనారిటీకి నెట్టివేసి మెజారిటీ మద్దతు కూడగట్టడంలో ముఖ్య పాత్ర పోషించారు. అదే సభలో సభ్యత్వ రుసుం గణనీయంగా తగ్గించడంతో సామాన్య జనులందరూ చేరి ఆంధ్ర మహాసభ నిజమైన ప్రజా సంస్థగా 'సంఘం'గా ఆ పై గుత్పల సంఘం గా మారింది.





అటు పార్టీలోనూ ఇటు ఆంధ్ర మహాసభలోనూ డీవీ ఎక్కువగా రాజకీయ శిక్షణా శిబిరాలు నిర్వహించేవాడు. కార్యకర్తలను విప్లవకారులుగా తయారు చేయాలంటే అధ్య యనం, సమిష్టితత్వం, సమన్వ యంతో ఉండాలని నిత్య అధ్యయ నకారుడు నిత్య అధ్యాపకుడిగా ఉండేవాడు. విషయ సేకరణలో గణాంకాలతో అంకెలు ప్రతి చిన్న విషయాన్ని నోట్ చేసుకునే లక్షణం. అందుకే పార్టీ పట్వారీ" అని అనే వారు. ఎప్పుడు, ఎక్కడ, ఎవరు, ఏది చెప్పినా నోట్ పుస్తకంలో పెన్సిల్‌తో రాసుకునేవాడు. నిత్య పరిశీలకుడిగా సూక్ష్మ స్థూల దృష్టితో ఉండేవాడు. ఉద్యమాలు, పోరాటాలు కష్టాలు ఎదురైనప్పుడు సిద్ధాంతపరంగా వెన్నుదన్నుగా నిలిచేవాడు. కమ్యూనిస్టు విప్లవకార్యకర్తల జీవితం ఎలా ఉండాలో చెప్పేవాడు.

1940-41 ప్రాంతంలో సూర్యాపేట ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని నిర్మించడానికి కార్యకలాపాలు ప్రారంభించాడు. కొద్ది కాలంలోనే ఉద్యమం జిల్లా వ్యాప్తంగా విస్తరించింది. ఆయన నల్లగొండ జిల్లా కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. జనగాం ప్రాంత 40 గ్రామాల్లోని పరిస్థితులను ఆయన అధ్యయనం చేశారు. 1942-50 దశాబ్దంలో తెలంగాణ సమాజంలో అట్టుడుకుతున్న వెట్టి వ్యతిరేకత, భూస్వామ్య దోపిడీ వ్యతిరేక భావ జాలాన్నంత ఒడిసి పట్టి, రైతుల భూదాహాన్ని పసిగట్టి సాయుధ పోరాట సన్నా హక కృషిని చేశాడు. 46-51 మధ్య కాలంలో రైతాంగ ఉద్యమం సాయుధమై విస్తరించినప్పుడు నల్లగొండ జిల్లా కార్యదర్శిగా ప్రజల నుంచి నేర్చుకుంటూ, ప్రజలకు నేర్పుతూ తన క్షేత్రస్థాయి అనుభవాలతో నిశితమైన రాజకీయ జ్ఞానంతో ఉద్యమించాడు. భారత విప్లవానికి భూమి పంపిణీ కార్యక్రమం జోడించడం, దున్నేవాడికి భూమిని కేంద్రం నినాదంగా చేయడం, వలంటీరు దళాలను నిర్మించడానికి, అవి గుతుపల సంఘాలు నిలబడటానికి గ్రామ రక్షక దళాల ఏర్పాటు, గ్రామ పంచాయతీలు గ్రామ రాజ్యాల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు ఆలోచనలు చేయడం, దేవరుప్పుల గ్రామంలో వాలంటీరు దళం ఏర్పాటు చేయడంలో ముఖ్యులు.


సెప్టెంబర్ 1947 నిజాం సైన్యం, పోలీసులకు తోడుగా రజాకారు కూడా గ్రామాలపైనా పెద్ద ఎత్తున దాడులు జరుపుతూ హింసించడం, కమ్యూనిస్టు పార్టీ నాయకుల ఇండ్లను కొన్ని సందర్భాలలో ప్రజల ఇండ్లను కూడా తగులబెట్టేవారు. డీవీ నివసించిన తన చేలోని గుడిసెను కూడా ఆ విధంగా తగులబెట్టారు. ఆ సందర్భంగా రజాకార్లు కక్షతో "ఇందులోనే కమ్యూనిజం పుట్టిందిరా" అంటూ కిరోసిన్ పోసి నిప్పటించారు. దీనిని ఇప్పటికీ అక్కడి గ్రామస్తులు చెప్పుకుంటారు. దున్నేవాడికి భూమి అన్న నినాదం తోపాటు గీచేవాడికి చెట్టు అన్న నినాదంతో గీత కార్మికులు పెద్దగా కదిలారు. "1948 సెప్టెంబర్‌లో సైనిక చర్య నాటికి కమ్యూనిస్టులు, పంచిన భూముల్లో రెండు పంటలు పండించుకున్నారు. కొన్ని వేల సంవత్సరాల తర్వాత పేద ప్రజలు మొదటి సారి రెండు పూటలా కడుపునిండా తిండి తినగలిగారు. అన్నింటికంటే ముఖ్యంగా ఆత్మగౌరవంతో తలెత్తుకొని జీవించడం ప్రారంభించారు" అని డీవీ రాసిన సాయుధ పోరాట పుస్తకంలో రాశారు.

సాయుధ పోరాట విరమణ తర్వాత 1951 నుండి 1968 వరకు నల్లగొండ పార్లమెంట్ సభ్యునిగా ఉన్నారు. తన భార్య ఇద్దరు పిల్లలు ఢిల్లీ చూడాలన్నా తీసుకు వెళ్లలేని నిక్కచ్చితనం. ఒకసారి డీవీ గారిని అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులు ఎంపీ గారేమిటి? ఈ గుడిసెలో ఉండటం ఏమిటి? అని ఆశ్చర్యపోయారు. అంత నిరాడంబరత. పార్లమెంటరీ పంథాలో ఆయన రాజీ పడలేదు. జిల్లా కార్యదర్శిగానూ, రాష్ట్ర కమిటీ సభ్యునిగానూ, ఆ తర్వాత కేంద్ర కమిటీ సభ్యునిగానూ అనేక అంతర్గత పార్టీ పోరాటాలు చేస్తూ వచ్చారు. తరిమేల నాగిరెడ్డి గారితో కలిసి 1975లో కమ్యూనిస్టు విప్లవ కారుల సమైక్యతా కేంద్రం స్థాపించారు. ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధే ప్రాంత అభివృద్ధికి సంకేతమనీ, కొద్దిమంది అభివృద్ధి నిజమైన వృద్ధి కాదని నిక్కచ్చిగా వక్కాణించారు. తన విప్లవకర, ఉత్తేజకర జీవితంలో అనేక సార్లు నిర్బంధానికి గురయ్యాడు. ఆనాటి నిజాం ప్రభుత్వం మొండ్రాయి లంబాడీ రైతాంగపు పోరాట సందర్భంగా ఆయనపై తొలికేసు నమోదు చేసింది. 1946-52 వరకు రహస్య జీవితం గడిపాడు. ఎంతటి అజ్ఞాతమంటే అనేక నెలల పాటు భార్యా పిల్లలను చూడలేనంత, పిల్లలు తండ్రిని గుర్తు పట్టలేనంత, తల్లి అత్తా మరణించినా అక్కడకు వెళ్లలేనంత, కొడుకు వివాహం కూడా చూడలేనంత అజ్ఞాతం.

మాజీ పార్లమెంట్ సభ్యుడిగా అందే పెన్షన్ ఫ్రీడమ్ ఫైటర్ పింఛన్‌గానీ, తీసుకోవడానికి కూడా నిరాకరించిన ఉదాత్త ప్రజా నేత ఆయన. తనకున్న భూమిని కౌలుదార్లకిచ్చాడు. తమ కేసును తామే వాదించుకున్నాడు. 400 పేజీల ప్రకటనను జడ్జీ ముందు చదివాడు. జీవితాంతం బస్సులోనే తిరిగాడు. పార్టీ ఆఫీసులోనే పడుకునేవాడు. నిరంతరం కదిలే కలం ఆయనది. పిల్లల పెండ్లీలు సైతం అభ్యుదయకరంగా రిజిస్ట్రేషన్ చేయించాడు. పార్లమెంట్ సభ్యుడిగా ఉండి తన పొలంలో వేసుకున్న తాటి కమ్మల గుడిసెలోనే 1984 జులై 12న గుండెపోటుతో మరణించాడు. అతడి జననం ఒక పేద తల్లి ఆనంద భాష్పం. అతడి మరణం లక్షలాది హృదయాల విషాదగీతం.

సెల్ : 9490098343

అమరవీరుల త్యాగం - మన గణతంత్రం



కాళంరాజు వేణుగోపాల్

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకునే ప్రభుత్వ విధానమే ప్రజాస్వామ్యం అని అబ్రహం లింకన్ అన్నాడు. ప్రజాస్వామ్యానికి మూల గ్రంథం లాంటిది రాజ్యాంగం. అందుకని రాజ్యాంగాన్ని రూపొందించేందుకు 1947 ఆగస్టు 28న రాజ్యాంగ నిర్మాణ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ అధ్యక్షుడిగా డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ బాధ్యతలు చేపట్టారు. ప్రతీ స్వతంత్ర దేశానికి ఒక రాజ్యాంగం ఉండాలి. రాజ్యాంగం అంటే దేశానికీ, ప్రజలకూ, ప్రభుత్వానికీ మార్గదర్శి వంటిది. ఆ

> **రిపబ్లిక్‌డేను ప్రైవేటు మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు నేడొక ఆటవిడుపులా మారింది. సెలవు కాబట్టి పిల్లలు స్కూళ్లకు రానవసరం లేదని ముందు జాగ్రత్తగా హోండైరీల్లో హెచ్చరించే పాఠశాలలు కొన్నైతే, ఏ శనివారమో, ఆదివారమో రిపబ్లిక్‌డే వస్తే ఎక్కడ ఆ రోజు మళ్లీ పనిచేయాల్సి వస్తుందోనని ముందు రోజే తూతూ మంత్రంగా జెండావందనం జరిపించేసి మ.మ అనుకునే స్కూలు యాజమాన్యాలు ఇంకొన్ని.**

జ్ఞానకాంతి వెలుగుల్లో సర్వసత్తాక సౌర్వభౌమాధికార దేశంగా ప్రగతి వైపు మనం అడుగులు వేయాలి. అందుకనే రాజ్యాంగానికి ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో అంతటి విశిష్టమైన స్థానముంది. ముఖ్యంగా ప్రపంచంలో ఏ దేశంలో లేనన్ని భాషలు, మతాలు, విభిన్న జాతులు, రకరకాల తెగలు, ఆదివాసీలు, దళితులు, అణగారిన, పీడనకు గురైన వర్గాలు, విభిన్న సంస్కృతులు రకరకాల కట్టుబొట్టు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, మన దేశంలో ఉన్నాయి. వీటికితోడు ఇక్కడ వేల కులాలు, లింగ వివక్ష, మూఢనమ్మకాలు, అంటరానితనం వంటి వికృత అంశాలు చాలా సంవత్సరాలనుండి తిష్ట వేసి ఉన్నాయి. కోట్లాదిమంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారందరినీ తృప్తి పరుస్తూ రాజ్యాంగాన్ని రచించడమంటే ఎంతో సంక్లిష్టతతో కూడుకున్నది. అందువలన భిన్నత్వ సమ్మిళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఎంతగానో శ్రమించారు అంబేద్కర్.

రాజ్యాంగాన్ని రూపొందించడానికి దేశంలోని సుప్రసిద్ధ నాయకులు, అనుభవజ్ఞులు, విద్యావేత్తలు, న్యాయ కోవిదులు, వివిధ రంగాల ప్రముఖులతో కూడిన 284 మందిని ఎంపిక చేసి రాజ్యాంగ నిర్మాణ సభను ఏర్పాటు చేశారు. అందులో 15 మంది మహిళలు కూడా ఉన్నారు. వీరంతా పరోక్ష ఎన్నిక ద్వారా రాష్ట్ర శాసనసభలు, భారత్ సంస్థానాల నుండి ఎన్నికయ్యారు. 1947 ఆగస్టు 29న రాజ్యాంగ ముసాయిదా రూపకల్పనకు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ నేతత్వంలో ఆరుగురు సభ్యులతో ముసాయిదా కమిటీ ఏర్పాటు చేశారు. రాజ్యాంగం తయారు చేయడానికి వారు ఎన్నో దేశాల రాజ్యాంగాలను పరిశీలించి తీవ్ర మేధోమధనం నిర్వహించి కోటి రూపాయల ఖర్చుతో సంఘటిత భారతావనికి ప్రపంచంలోనే అతి పెద్దదైన రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారు. అంబేద్కర్ చైర్మన్‌గా పండిత్ గోవింద్ వల్లబ్ పంత్, కె.ఎం.మున్షీ, అల్లాడి కష్ణ, స్వామి అయ్యర్, ఎన్.గోపాలస్వామి, అయ్యంగార్, బిఎల్. మిట్టల్, ఎండి.సాదుల్లా, డి.పి.ఖైతావ్, ఖైతావ్ మరణానంతరం టిటి.కష్ణమాచారిల పర్యవేక్షణలో రాజ్యాంగం ఏర్పాటైనది. స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణానికి రాజ్యాంగ సభకు పట్టిన కాలం 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు. రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజులపాటు సమావేశమైంది. ఇందులో 114 రోజులు రాజ్యాంగం రాతప్రతిపై చర్చకు వెచ్చించింది. రాజ్యాంగ సభ ముందుకు 7,635 సవరణ ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది. ఆరున్నర దశాబ్దాల కిందట 26 నవంబర్ 1949 నాడు డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సర్దార్ వల్లభాయి పటేల్ ప్రతిపాదించి ప్రవేశపెట్టారు. 24 జనవరి 1950న 284 మంది సభ్యుల సంతకాలతో ఆమోదించారు. రెండు రోజుల తర్వాత 1950 జనవరి 26 నుంచి అమలు పర్చడంతో భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా రూపొందడంతో పరిణామ దశ పూర్తయింది. దీంతో ప్రపంచంలోనే కొత్తదైన రాజ్యాంగం రూపుదిద్దుకుంది. ఆ రోజున రాజ్యాంగ సభ రద్దయి, భారత్ తాత్కాలిక పార్లమెంటుగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగ బాధ్యతలను అప్పగించింది.

రిపబ్లిక్‌డే ప్రైవేటు మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు నేడొక ఆటవిడుపులా మారింది. సెలవు కాబట్టి పిల్లలు స్కూళ్లకు రానవసరం లేదని ముందు జాగ్రత్తగా హోండైరీల్లో హెచ్చరించే పాఠశాలలు కొన్నైతే, ఏ శనివారమో ఆదివారమో రిపబ్లిక్‌డే వస్తే ఎక్కడ ఆ రోజు మళ్లీ పనిచేయాల్సి వస్తుందోనని ముందు రోజే తూతూ మంత్రంగా జెండావందనం జరిపించేసి మ.మ అనుకునే స్కూలు యాజమాన్యాలు ఇంకొన్ని. కలర్స్ డే, పేరెంట్స్ డే, ఆన్యువల్ డే అని రకరకాల భాష్యాలు చెప్పి పిల్లల చేత సెలబ్రేట్ చేయించి ఆనందించే స్కూల్స్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మాత్రం ఆగస్టు 12నే జరుపుకున్న సంఘటనలు కోకొల్లలు. మిషనరీ స్కూలు, గురూజీ పూజ, సత్సంగం లాంటి కార్యక్రమాలను సెలవు రోజుల్లో అట్టహాసంగా నిర్వహించి రిపబ్లిక్‌డేని విస్మరించే పాఠశాలలను మనం చూస్తుంటాం. భావిభారత పౌరుల్ని తయారుచెయ్యాల్సిన పాఠశాలలు ఇంత బాధ్యతారాహిత్యంతో ప్రవర్తించబట్టే బాలబాలికల్లో దేశభక్తి నానాటికి తీసికట్టుగా తయారవుతోంది. ఈ కాలపు విద్యార్థులలో సినిమా హీరోలు, క్రికెట్టు వీరులు తప్ప స్వాతంత్ర్య సమరయోధులు తెలియని పిల్లలున్నారంటే అది అంతా మన చలవే.

భారతదేశ ప్రతిజ్ఞ ఎవరు రాశారో తెలియకపోయినా, బూతులతో నిండిన తెలుగు సినిమా డైలాగులు, వాటి కలెక్షన్లు కంఠతా పట్టేసి, నటీనటులను గుడ్డిగా అరాధించే యువతరం తయారవుతుంటే అంతకంటే దరిద్రం ఈ దేశానికి మరొకటి లేదు. జనగణమన పాడడం రాని పరిపాలకుల చేతుల్లో మనం పరిపాలించబడడం నిజంగా మన దౌర్భాగ్యం. ఇక టీవీలలో అయితే సెలవు దినం కాబట్టి అత్యధిక రేటింగ్ వచ్చే స్టార్ హీరోల సినిమాలు వేస్తే వాటిని చూసి వీళ్లే మన దేశ స్వాతంత్ర్య సమర యోధులు అనుకునే పిల్లలు తయారు అవుతున్నారు. నిజంగా ఇది మనందరం సిగ్గు పడాల్సిన విషయం. తల్లిదండ్రులు కనీసం జాతీయ పర్వదినాల్లోనైనా స్వాతంత్ర్య సమర యోధులు, ప్రముఖుల ఆదర్శ జీవితాల్లోంచి ముఖ్యమైన ఘట్టాలని, వారు దేశం కోసం చేసిన త్యాగాలు, అమరుల ప్రాణ త్యాగాల గురించి, వారి పోరాట స్ఫూర్తిని, నిజాయితీని కండ్లకు కట్టేలా పిల్లలకు విడమరిచి చెప్పి దేశభక్తిని పెంపొందింపజెయ్యాలి. ఈనాడు కాన్వెంట్‌లలో చదివే పిల్లలకు భగత్‌సింగ్ అంటే ఎవరో తెలియదంటారు కానీ, గబ్బర్‌సింగ్ అంటే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అని దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తారు. కాబట్టి ఇప్పటికైనా తమ బాధ్యత గుర్తించి గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం లాంటి సందర్భాలను విధిగా, పద్ధతిగా నిర్వహించాలి. ప్రభుత్వం కండ్లు తెరిచి జాతీయ పర్వదినాలను సెలబ్రేట్ చేసుకోని పాఠశాలల గుర్తింపును రద్దు చెయ్యాలి. వారి మీద క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. మరి చిన్నప్పటి నుంచి వారిలో దేశభక్తిని పెంపొదించకపోతే భవిష్యత్తు తరాలు అగమ్యగోచరంలో పడతాయి. తస్మాత్ జాగ్రత్త.

సెల్ : 8106204412

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



శ్రీనివాస్ చిరిపోతుల

మన పొరుగునున్న దేశాల రాజ్యాంగాలు ఆటుపోట్లను ఎదుర్కొనగా, మన రాజ్యాంగం పటిష్టంగానే ఉందంటే అది ఆ మహనీయుల కషి ఫలితమేనని చెప్పుకోవచ్చు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునిగా అంబేద్కర్ వ్యవహరించారు. సర్వసత్తాక ప్రతిపత్తి కలిగిన గణతంత్ర వ్యవస్థలో మనం ఉన్నాం. కొత్తగా ఏర్పడిన తెలంగాణతో కలిపి దేశంలో 29 రాష్ట్రాలున్నాయి. మనది ఫెడరల్ రిపబ్లిక్. అంటే రాష్ట్రాల సమాఖ్య. రాజ్యాంగం అమలులోకి రావడంతో దేశంలో ప్రతి పౌరునికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతోపాటు ప్రాథమిక హక్కులు కూడా లభించాయి. స్వాతంత్ర్యానికి పూర్వం ప్రాథమిక హక్కులుండేవి కావు. మన రాజ్యాంగాన్ని ఇప్పటి వరకు 123సార్లు సవరించారు. మన రాజ్యాంగంలో సామ్యవాదం అనే పదాన్ని తరువాత చేర్చారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు భద్రత కల్పించడం, ఆస్తులను కాపాడటం, వాక్ స్వేచ్ఛనూ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛనూ కాపాడటానికి మన రాజ్యాంగం కట్టుబడి ఉంది. మహిళలపై దాడులను అరికట్టేందుకు ఆరేండ్ల క్రితం నిర్భయ చట్టాన్ని తెచ్చారు. ప్రతి పౌరునికి విద్యా హక్కు, జీవించే హక్కుతో సహా ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో చేర్చారు. దానిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత. భావ స్వేచ్ఛను అరికట్టేందుకు ఈ చట్టాలను ప్రభుత్వాలు అడ్డుపెట్టుకుంటున్నాయి. ప్రతి మనిషికి కూడు, గూడు, గుడ్డ కల్పించడమే తమ లక్ష్యమని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి అధికారంలోకి వచ్చిన పార్టీలూ, అధికారం కోసం ప్రయత్నిస్తున్న పార్టీలూ.. అరిగిపోయిన రికార్డులా వాగ్దానాలు చేస్తూనే ఉన్నాయి. మరోవైపు రాజ్యాంగబద్ధమైన సంస్థల్లో అధికారంలో ఉన్న నాయకులూ, ప్రభుత్వాలూ జోక్యం చేసుకుంటున్నాయి. సమ్మిళిత అభివద్ధి జరగడం లేదని యూపీఏ హయాంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ తరచూ అనేవారు. మన రాజ్యాంగంలో సోషలిస్టు రిపబ్లిక్ అనే పదాన్ని చేర్చుకొని నాలుగున్నర దశాబ్దాలు దాటింది. రాజ్యాంగానికి మూల స్తంభాలైన చట్టసభలూ, న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, మీడియా పరస్పరం జోక్యం చేసుకోకుండా, స్వయం నియంత్రణతో పని చేయాలన్న ప్రసంగాలు ఒకవైపు, రాజ్యాంగబద్ధ సమస్యలో అనుచిత జోక్యం పెరుగుతోందన్న విమర్శలు మరోవైపు నిత్యం మనం వింటూనే ఉన్నాం. ఇందుకు ఎవరు బాధ్యులు. లోపాలుంటే దిద్దుబాటు చేసుకుంటూ మన రాజ్యాంగ మౌలిక పునాదులను కాపాడుకోవటమే మనందరి ప్రథమ కర్తవ్యం. ఇదే మనందరికి గణతంత్ర దినోత్సవ ప్రధాన సందేశం.

సెల్ :9603471199

ఈవీఎంల గోస తీరేదెప్పుడు?



సంతోష్ తోట

అభివృద్ధి చెందిన దేశమైనా, చెందుతున్న దేశమైనా అమెరికాతో పోల్చుకోవడం చాలా సహజం. ప్రజాస్వామ్య దేశంగా అమెరికా సాధించిన ప్రగతిని మిగిలిన దేశాలన్నీ అనుసరిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. మిగిలిన దేశాలకంటే కొన్ని దశాబ్దాల ముందుంది అమెరికా. అందుకే ఆ దేశంతో పోల్చుకుంటూ ముందుకెళ్తుంటాయి. అయితే భారత్ మాత్రం అమెరికాను మించి దూసుకెళ్లాలనుకుంది. అమెరికాలో ఇప్పటికీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లనే వాడుతారు. కానీ భారత్ మాత్రం ఈవీఎంలను తీసుకొచ్చింది. ఇప్పుడదే చిక్కులు తెచ్చిపెడుతోంది. ప్రపంచంలోనే రెండో అత్యధిక జనాభా కలిగిన దేశం భారత్. ప్రపంచంలోని మిగిలిన అన్ని దేశాలకంటే ఎక్కువమంది ఓటర్లున్న దేశం కూడా మనదే. భారత్‌లో ఎన్నికల ప్రక్రియ అంటే చాలు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అయితే ఇంత పెద్ద దేశంలో ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించడం కొంత క్లిష్టమైన పని అనడంలో సందేహం లేదు. అందుకోసమే ఎన్నికల సంఘం బ్యాలెట్ పేపర్ల బదులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను తీసుకొచ్చింది. మన దేశంలో 2004 నుంచి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఈవీఎంల ద్వారానే జరుగుతున్నాయి. అప్పటి నుంచి కౌంటింగ్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే ఫలితం వచ్చేస్తోంది. రోజుల తరబడీ బ్యాలెట్లను లెక్కపెట్టిన రోజులు పోవడంతో చాలా మంది సంతోషించారు. అయితే ఇప్పుడు ఆ ఈవీఎంలపైనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈవీఎంలపై మొదటి నుంచి అనుమానాలున్నాయి. ఈవీఎంలో ఫలితం తమకు అనుకూలంగా వస్తే స్వాగతించడం, లేకుంటే తిట్టడం రాజకీయ పార్టీలకు అలవాటైపోయింది. తమకు అనుకూలంగా ఉంటేనేమో ఈవీఎంలు సరిగా పనిచేస్తున్నట్టు.. లేకుంటే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసినట్టు అని ఆరోపిస్తున్నారు. అయితే ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఈవీఎంలపై ఆరోపణలు కామన్ అయిపోయాయి. తాజాగా ఓటమిని చవిచూసిన పార్టీలన్నీ ఈవీఎంలపై ధ్వజమెత్తుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లనే ఓటింగ్ కోసం వినియోగించాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నాయి. దేశంలో 15 ఏండ్లుగా ఈవీఎంల ద్వారానే ఎన్నికలు జరుగుతున్నాయి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం ద్వారా అధికార పార్టీలు అవకతవకలకు పాల్పడుతున్నాయని ప్రతిపక్షాలు ప్రతిసారీ ఆరోపిస్తున్నాయి. అయితే ఈవీఎం ట్యాంపరింగ్‌కు అవకాశమే లేదని, ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే తగిన బహుమతి ఇస్తామని ఎన్నికల కమిషన్ సవాల్ విసిరింది. ట్యాంపరింగ్ సాధ్యం కాకపోవచ్చేమో కానీ, ప్రోగ్రామింగ్ ద్వారా దాన్ని నియంత్రిచడానికి వీలు ఉంటుందని కొంతమంది సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. మొత్తంగా ఈవీఎంలపై అనేకమంది ప్రయోగాలు చేశారు. అయితే ఎన్నికల కమిషన్ మాత్రం ఈవీఎంలు తప్ప మరో మార్గం లేదని తేల్చేసింది. తాజాగా ఓటరు తాను వేసిన పార్టీకే ఓటు పడిందో లేదో కనిపించేలా వీవీప్యాట్‌లను తీసుకొచ్చింది. ఎప్పటికప్పుడు వస్తున్న సవాళ్లను ఎదుర్కొంటూ ఎన్నికల కమిషన్ ఈవీఎంలలో మార్పులు చేస్తూనే ఉంది. అయినా ఆరోపణలు మాత్రం ఆగడం లేదు. ప్రతిసారీ సరికొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. గత ఎన్నికల సమయంలో కూడా ఈవీఎంలపై పెద్ద చర్చే జరిగింది. ఎన్నికలు ముగిసిన తర్వాత తమకు వ్యతిరేకంగా ఫలితం వచ్చినవాళ్లు కొంతమంది ఈవీఎంలపై కోర్టుల్లో కేసులు వేశారు. వాటిపై పలువురు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా చేశారు. అయినా ఎన్నికల కమిషన్ మాత్రం ఆ ఫిర్యాదులను ఏమాత్రం పట్టించుకోలేదు. తాజాగా తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలపై మరిన్ని కొత్త అనుమానాలు రేకెత్తించాయి. అవే పోలైన ఓట్లకంటే ఫలితాల్లో ఎక్కువ ఓట్లు రావడం.! ఇన్ని ఓట్లు పోలయ్యాయని పోలింగ్ రోజున ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అయితే కౌంటింగ్ రోజు మాత్రం ఆ ఓట్లకంటే ఎక్కువ ఓట్లు తేలాయి. దీంతో పలువురు అభ్యర్థుల జాతకాలు తారుమారయ్యాయి. దీనికి బాధ్యులు ఎవరు..? దీనిపై ఇంతవరకూ ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మరి దీన్ని పరిష్కరించేదెవరు? ఎన్నికల సంఘమా లేక కోర్టులా?

సెల్ : 9063187252

ఫెలోషిప్ పెంపుపై ప్రభుత్వం స్పందించాలి



కందగట్ల శ్రవణ్ కుమార్

జాతీయ స్థాయిలో యూజీసీకి ఇస్తున్న వివిధ రకాల ఫెలోషిప్స్‌ను పెంచాలని దేశ స్థాయిలో న్యూఢిల్లీలో తలపెట్టిన నిరసనలను జనవరి 16న పోలీసులు అడ్డుకొని పరిశోధక విద్యార్థులను జైళ్లకు తరలించడం విచారకరం. ప్రతి నాలుగేండ్లకు ఒకసారి ఫెలోషిప్స్‌ను గత ప్రభుత్వాలు పెంచుతూ వస్తుంటే నాలుగేండ్లు దాటినా ఇంతవరకు ఫెలోషిప్స్ పెంచకపోవడం పరిశోధక విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తుంది. సెవెంత్ పే కమిషన్ ప్రకారం అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర శాఖల జీతభత్యాలు పెరిగాయి, నేటి ఆధునిక కాలంలో ఇప్పుడు లభిస్తున్న ఉపకార వేతనాలతో పరిశోధనలు చేయాలంటే కష్టమే, ముఖ్యంగా సైన్స్ పరిశోధకులకు చాలా ఇబ్బందిగా ఉంది. ఎందుకంటే చాలీచాలని ఉపకార వేతనాలు లభిస్తున్నాయి. ప్రస్తుత ఉపకార వేతనాలు పరిశోధనతోపాటు పరిశోధకుల వ్యక్తిగత, కుటుంబ అవసరాలను తీర్చుకోవడానికి కూడా కేటాయించాలి. ఢిల్లీ, బెంగుళూరు, హైదరాబాద్ వంటి మెట్రోపాలిటన్ నగరాల్లో జాతీయ సంస్థల్లో పరిశోధనలు చేస్తూ నివసిస్తున్న పరిశోధకులకు ప్రస్తుతం ఇస్తున్న ఫెలోషిప్ సరిపోవడం లేదు. ఇది కేవలం మెట్రోపాలిటన్ నగరాలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల పరిశోధకులు కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధకులకు కూడా తక్కువ వస్తున్న ఫెలోషిప్ సమస్యగా మారింది. ఎందుకంటే నేటి సమాజంలో నిత్యావసర వస్తువులు కాకుండా అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. కాబట్టి పరిశోధనలకు అంతరాయం కలగకుండా ఒక పరిశోధకుడు పూర్తిస్థాయిలో పరిశోధనలకు సమయం కేటాయించాలంటే వారికి సరిపడా ఉపకారవేతనాలు ఇవ్వాలి. కాబట్టి కేంద్ర ప్రభుత్వం వెంటనే అన్ని రకాల జాతీయ స్థాయి ఫెలోషిప్స్, ప్రాజెక్ట్ ఫెలోషిప్స్ పెంచాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ పెంపు గత సంవత్సరం ఏప్రిల్ నుంచి అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలి. 80 శాతం కంటే ఎక్కువ ఫెలోషిప్‌లను పెంచాలి, ప్రతి నెల ప్రతి పరిశోధకుడు ఫెలోషిప్స్ అందుకునేలా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. యువ పరిశోధకుల పరిశోధకులను ప్రోత్సహించాల్సిన అవసరం కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలకు ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాలంటే యువ పరిశోధకులను ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. పరిశోధనలకు దేశ జీడీపీలో ఎక్కువ మొత్తంలో నిధులను కేటాయించాల్సిన అవసరముంది. ప్రతీ ఏడాదికి ఫెలోషిప్స్‌ల పెంపు, సమీక్షించటం వల్ల పరిశోధనలో విద్యార్థులు పూర్తిస్థాయి సమయం కేటాయించి మంచి ఫలితాలు అందుకుంటారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పరిశోధన ఫెలోషిప్స్‌కు సంభవించిన పెంపు ప్రకటన వెంటనే చేయాలి. లేకపోతే పార్లమెంట్ ఎన్నికలపై వీటి ప్రభావం పడే ప్రమాదముంది.

సెల్ : 8639374879

రచయితలకు సూచనలు

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ప్రత్యేక సందర్భానికి సంబంధించిన వ్యాసమైతే దానిని గురించి కవరింగ్ లెటర్ రాయండి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయండి.

వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రెస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

సినిమా సావిత్రి, నిజం సావిత్రిగా కనపడదు!

రంగనాయకమ్మ

- 4 -

సావిత్రికి, తన మొగుడు తెచ్చుకున్న కొత్త యువతిని చూస్తే, తన కోపం, తన మొగుడి మీద వుండాలా, తనతో సంబంధమే లేని మనిషి మీద వుండాలా? ఆమె, కేవలం బతుకుదెరువు కోసం వచ్చిన వ్యబిచారిణియేమో! లేకపోతే, ఈ సినిమా ధనికుణ్ణి ఏదైనా సహాయం కోరడం కోసం వచ్చిన యాచకురాలేమో! ఆమెని ఇతడు ఇలా గదిలోకి తెచ్చాడేమో! ఆ కొత్త యువతి, గది లోపలే వున్నప్పటికీ, ఆమెని చూసినప్పుడు, సావిత్రి, ఆమెని, "ఎవరు నువ్వు? ఇతనితో ఏమిటి నీ అవసరం?" అని ఒక్క మాటైనా అడగకుండా, ఆమె వ్యబిచారిణి అని నిజం తెలిసినా, ఆమె మీద కలబడి కొట్టబోతే, అది సంస్కారం అవుతుందా? తన భర్తగారి మొదటి భార్య, తన మీద అలాగే చేస్తే, ఆ నాడు తను ఏమయ్యేది? అసలు తనతో ఏ సంబంధమూ లేని మనిషి మీదకి ఎగబడే హక్కు వుందా తనకి? ఏ విమర్శ అయినా తన మొగుడి మీదే చేసుకోవాలి గానీ, అతణ్ణి మాత్రం కొట్టి లొంగదియ్యడమా? సావిత్రికి, ఆ వ్యభిచారిణి మీద అంత కోపం ఎందుకు? – ఎందుకంటే, ఆమె ఒక మగవాడి దగ్గిరికి రావడం అంటే, ఆ మగవాడికి 'భార్య' వుంటుందనీ, తన వల్ల ఆ భార్యాభర్తల సంబంధాలు నాశనం అవుతాయనీ, తెలియదా ఆమెకి? – అనే కదా?

అది నిజమే. కానీ, మరి అదే ప్రశ్నా, అదే కోపమూ, సావిత్రికి తన మీద తనకి ఎందుకు రాలేదు? – భార్యలు వున్న ఒక మగవాడు, తన మీద 'ప్రేమల భాష' జల్లుతూ వుంటే, అతని పాత భార్యల గురించి తను వూహించిందా? తన వల్ల, ఆ భార్యలు రోదిస్తారని ఆలోచించిందా? – ఆ నాడు అవేవీ ఆలోచించలేదు. ఈ నాడు, తనకు జరిగిన అవమానమే తనకు ప్రధానం అయిందా? తన భర్త 'తిరుగుబోతు' అని గ్రహించగానే అతనితో సంబంధాలు పూర్తిగా తెంపుకుంది. అలా తెంపుకోవడం అద్భుతమే. చెయ్యవలిసింది అదే కాబట్టి. సినిమాలో, అతను ఒకసారి ఆమె దగ్గిరికి ఎలాగో సందు చేసుకుని చేరగలిగాడు. "నా వల్ల తప్పే జరిగింది. అది నా బలహీనత" అన్నాడు. "బలహీనత అయితే, నీ భార్యలు నీకు వున్నారుగా? ఎప్పుడూ కొత్త ఆడదాని కోసమేనా నీ బలహీనత?" అనలేదు సావిత్రి. "అది నా బలహీనత. కానీ అది 'ప్రేమ కాదు'. నా ప్రేమ మాత్రం నీ మీదే" అన్నాడు మళ్లీ. "నువ్వు 'ప్రేమ' గురించి మాట్లాడకు! నిన్ను నమ్ముతూ నేను తిరిగేటప్పుడు, నీ గురించి ఎవ్వరు చెప్పినా వినలేదు నేను. ఒక్క భార్యతో సరిపోని ప్రేమ, ఇద్దరి భార్యలతో సరిపోతుందనుకోవడం నాదే తప్పు!" అంది సావిత్రి. అంటే, సావిత్రి, గణేషన్‌కి వున్న ఇద్దరు భార్యల్నే లెక్కలోకి తీసుకుంది. 'తాళి' కట్టి పెళ్లి చేసుకున్న వాళ్లని మాత్రమే. మొదటి భార్యనీ, తర్వాత తననీ! మధ్యలో పుష్పవల్లితో సంబంధాన్ని కూడా అతను చెప్పినప్పటికీ, ఈ సినిమా సావిత్రి, పుష్పవల్లిని అతని భార్యగా భావించలేదు. ఆమెకి 'తాళి కట్టలేదని' చెప్పాడు కాబట్టి. సినిమా సావిత్రి, రెండు పెళ్లిళ్ల మాటే, ఇద్దరు భార్యల మాటే, ఎత్తింది.అలాగైతే, తన భర్తగారు తెచ్చుకున్న ఆ జుట్టు విరబోసుకున్న కొత్త యువతి అతనికి భార్య అవదుగా? ఆమెతో అతనికి 'పెళ్లి' అవలేదుగా? ఆమెని లెక్కలోకి తీసుకోకూడదుగా? అది, 'ప్రేమ' కాదుగా? కాబట్టి, కొత్త భార్యకి కోపం రాకూడదు. అయినా సావిత్రికి కోపం వచ్చింది. ఆమెకి కోపం వస్తే, అప్పుడు గణేషన్, తన ఎత్తుగడని ఇలా ఉపయోగించాడు: "నా గురించి నేను మొదటే చెప్పేశానుగా? నన్ను తెలిసే చేసుకున్నావుగా? కాబట్టి, నేనెలా చేసినా భరించి వూరుకో!" అని, అలా అనడం తన హక్కు అన్నట్టు వాదించాడు. భర్తగారి వాదనకి సినిమా సావిత్రి జవాబు చెప్పిందిగానీ, అది సినిమా డైలాగే. అది ఇదీ: "నీ సంగతి మొదట నాకు చెప్పినప్పుడు, నేను 'సావిత్రి'ని మాత్రమే. ఇప్పుడు నేను 'సావిత్రీ గణేషన్'ని!" అని ఆ జవాబు! తన జవాబుని 'గొప్ప జవాబు' అనుకుంటూ అలా చెప్పింది, సినిమా సావిత్రి! ఆ జవాబుకి అర్థం ఏమిటి? 'అప్పుడు నేను నీ భార్యని కాను. కాబట్టి, నీ సంబంధాల్ని నేను పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు నేను నీ భార్యని! కాబట్టి, నీ భార్యని నువ్వు మోసం చెయ్యకూడదు' అని చెప్పినట్టు దాని అర్థం. 'పెళ్లి కాని' యువతి, పెళ్లి చేసుకునే ముందు, తనకు భర్త కాబోయే వాడి ప్రవర్తన 'ఫలానా రకం' అని తెలిసినా, అప్పుడు కూడా ఆమె, అతని వ్యభిచార ప్రవర్తనని పట్టించుకోనక్కరలేదా? భార్యగా సంబంధం ఏర్పడిన తర్వాత మాత్రమే భర్తతో సంబంధాల గురించి ఆలోచిస్తుందా? – ఎలా వుంది సినిమా సావిత్రి జవాబు? "నేను నీ భార్యగా వున్నాను కాబట్టి, నన్ను ఇప్పుడు మోసం చెయ్యకూడదు" అంది.

మరి, తను అతనికి భార్యగా మారాలనుకున్నప్పుడు, అతనికి అప్పటికే తాళి కట్టించుకున్న భార్య వుందని ఈమెకి తెలుసు కదా? అతడికి తను కొత్త భార్యగా అవడం అంటే, అతడు మొదటి భార్యని మోసం చేస్తున్నాడనీ, ఆ మోసంలో తను కూడా భాగస్తురాలిని అవుతున్నాననీ, అర్థమే కదా? అది సావిత్రికి అప్పుడు తెలియదా? సావిత్రి చెప్పే సినిమా జవాబుకి అర్థం, "నీ పాత భార్యలకి మోసాలు చేసినా, అది వేరు. నేను చివరి భార్యగా వున్నాను కదా? నన్ను కూడా మోసం ఎలా చేస్తావు?" అని అడగడమే అవుతుంది. సావిత్రి ఇలా వాదించిందంటే, అది సావిత్రికి పరువు వుండడమా, పోవడమా? అసలు సావిత్రి, తన నిజ జీవితంలో, భర్తకి జవాబు ఎలా చెప్పిందో, ఏం మాట్లాడిందో, ఎవరికీ తెలీదు. కానీ, సినిమా వాళ్లు, సావిత్రికి, తమ తెలివిని బట్టి జవాబులు పెట్టారు. నిజం సావిత్రి, గణేషన్ భార్యల గురించి కూడా తెలిసే అతన్ని ఒప్పుకుంది. తనతో సంబంధం తర్వాత అతడు ఇక మారడని నమ్మింది. అతను మోసంగా నడవడనుకుంది – ఇంత వరకూ నిజం. ఇలా చెయ్యడం తప్పే అయినా, ఆ తప్పుని దిద్దుకోడానికే అతణ్ణి వదిలెయ్యడానికి చివర్లో నిర్ణయించుకుంది. కానీ, సినిమా సావిత్రి, నిజం సావిత్రిగా కనపడదు. ఎందుకంటే, సినిమా సావిత్రి సంభాషణలు, తర్క హీనంగా వున్నాయి. ఈ సావిత్రి, ఇద్దరు భార్యలనే దృష్టిలోకి తీసుకున్న సంగతి చూశాం. 'పెళ్లి' జరిగితేనే, అది సరైన సంబంధం – అని సినిమా సావిత్రి వాదించినట్టు అర్థం. నిజం సావిత్రి సంస్కారాన్ని ఇలా చూపించడం ఆమెకి న్యాయం కాదు. అన్యాయమే. నిజం సావిత్రి గురించి తెలిసినంత వరకూ, ఆమెని అమాయకురాలిగానే జమ కట్టాలి. ప్రారంభంలో, గణేషన్ తీసిన ఫొటోల వల్లనే, సావిత్రికి సినిమా ప్రపంచంలోకి దారి దొరకడం నిజం అయితే, ఆమె, అతని మీద కతజ్ఞతతో వుండడం సహజమే.


(చివరి భాగం గురువారం సంచికలో...)




'కెప్టెన్ మార్వెల్' చిత్రంలోని ఒక దృశ్యం

భారీ అంచనాలతో వస్తున్న క్రేజీ చిత్రాలు

ప్రేక్షకుల మనసులతోపాటు ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ కలెక్షన్లను కొల్లగొట్టిన సిరీస్ సినిమాలతోపాటు పలు డిఫరెంట్ జోనర్ చిత్రాలు భారీ అంచనాలతో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఆసక్తికర నేపథ్యాలతో, అబ్బుర పరచే విజువల్ ట్రీట్‌తో, పిల్లల్ని మాయ చేసే గ్రాఫిక్ మాయాజాలంతో, యూత్‌ని ఎంటర్‌టైన్ చేసే భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ ఏడాది సందడి చేయబోయే కొన్ని క్రేజీ చిత్రాల గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ షో...











అలిటా: బ్యాటిల్ ఏంజెల్

ప్రస్తుతం హాలీవుడ్‌లో అత్యంత క్రేజ్‌ను నెలకొన్న చిత్రం 'అలిటా: బ్యాటిల్ ఏంజెల్'. సైన్స్ ఫిక్షన్‌లోని సబ్ జోనరైన సైబర్‌పంక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు రాబర్ట్ రోడ్రిగ్విజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. జేమ్స్ కామెరాన్, జాన్ లాండౌ, రాబర్ట్ రోడ్రిగ్విజ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. తన చుట్టూ జరిగే వాస్తవాలని గ్రహించి, ప్రపంచాన్ని మార్చేందుకు చేపట్టిన జర్నీలో ఎదురైన సవాళ్లని ఓ శక్తివంతమైన మహిళ ఎలా ఎదుర్కొంది?, ఎలా పోరాడిందనే కథాంశంతో రూపొందించారు. శక్తివంతమైన అమ్మాయి అలిటా పాత్రలో రోసా సాలాజర్ నటించారు. 'టైటానిక్', 'అవతార్' వంటి చిత్రాలను నిర్మించిన సంస్థ నుంచి వస్తున్న సినిమా కావడం, ఇప్పటికే విడుదలైన ట్రైలర్ విశేషంగా ఆకట్టుకోవడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫిబ్రవరి 14న ప్రపంచ వాప్తంగా విడుదలవుతోంది.

కెప్టెన్ మార్వెల్

మార్వెల్ కంపెనీ నుంచి వస్తున్న మరో సూపర్ హీరో చిత్రమిది. ఈ సంస్థ నిర్మించిన 21వ చిత్రమిది. సూపర్ హీరోయిన్ ప్రధాన పాత్ర ధారిణిగా సినిమా సాగుతుంది. మార్వెల్ కామిక్స్‌లో భాగంగా వస్తున్న చిత్రం కావడంతో సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్నా బోడెన్, ర్యాన్ ఫ్లెక్ దర్శకత్వం వహించారు. గాలాక్సీలో రెండు ఏలియన్ ప్రపంచాల మధ్య జరిగే యుద్ధం ప్రధానంగా సాగే చిత్రమిది. భూమిపై ప్రత్యర్థుల దాడిని తిప్పికొట్టేందుకు సూపర్ హీరోయిన్ చేసే యుద్ధంలో గెలుపొంది, కెప్టెన్ మార్వెల్‌గా అవతరించడం కోసం డాన్‌వెర్స్ చేసే పోరాట నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. మార్వెల్ స్టూడియో రూపొందిన మొదటి ఫీమేల్ లీడ్ సూపర్ హీరో చిత్రం కావడం విశేషం. డాన్‌వెర్స్‌గా బ్రీ లార్సన్ నటించగా, సామ్యూల్ ఎల్ జాన్సన్, బెన్ మెండల్సన్, జిమన్ హౌన్సు, లీ పేస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మార్చి 8న సినిమా విడుదల కానుంది.

అవెంజర్స్-4 : ఎండ్ గేమ్

భూమిని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు షాడోస్ తానోస్ బృందం ప్రయత్నిస్తుంటుంది. దాన్ని ఎదుర్కొనేందుకు సూపర్ పవర్ కలిగిన అవెంజర్స్ టీమ్ చేసే పోరాట నేపథ్యంలో 'అవెంజర్స్' చిత్రాలు రూపొందాయి. ప్రపంచ వ్యాప్తంగా వీటికి భారీ క్రేజ్ నెలకొంది. పిల్లల నుంచి పెద్దల వరకు చూసేలా యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాలు రూపొందుతుండటంతో ప్రపంచ ప్రేక్షకులంతా ఈ చిత్రాలను చూసేందుకు ఇష్టపడుతున్నారు. మార్వెల్ కామిక్స్‌లో భాగంగా వస్తున్న 22వ చిత్రం. 'అవెంజర్స్' సిరీస్‌లో నాల్గవ చిత్రమిది. ఆంటోని రుస్సో, జోయి రుస్సో సంయుక్తంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇందులో ఎప్పటిలాగే రాబర్ట్ డౌనీ జూనియర్, క్రిస్ హెమ్స్‌వర్త్, మార్క్ రుఫ్ఫాలో, క్రిస్ ఎవాన్స్, స్కార్లెట్ జాన్సన్, బెనెడిక్ కంబర్‌బ్యాచ్, డాన్ చీడ్లే, టామ్ హోలాండ్, చాడ్విక్ బోస్మాన్, సెబాస్టియన్ స్టాన్, ఎలిజబెత్ ఒల్సెన్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. యాక్షన్ అడ్వెంచర్, ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్‌గా రూపొందిన ఈ సినిమా ఏప్రిల్ 26న సందడి చేయడానికి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

అడ్ ఆస్ట్రా

బ్రాడ్ పిట్ హీరోగా రూపొందిన భారీ చిత్రమిది. ఇరవై ఏండ్ల తర్వాత నెప్ట్యూన్ గ్రహంపైకి వెళ్లే మిషన్ నుంచి తండ్రి తప్పిపోవడంతో, రాయ్ మెక్‌బ్రిడ్జ్ తన ఆర్మీ ఇంజనీర్ బృందంతో కలిసి సోలార్ సిస్టమ్ ద్వారా తండ్రి మిషన్ ఎలా ఫెయిల్ అయ్యింది?, ఆయన ఆచూకి ఎక్కడా అని కనిపెట్టే ఇతివృత్తంతో తెరకెక్కిన చిత్రమిది. ఎపిక్ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా జేమ్స్ గ్రే దర్శకత్వం వహించిన ఈ సినిమా కూడా ఈ ఏడాది రాబోతున్న చిత్రాల్లో ప్రధానంగా ఉంది. బ్రాడ్ పిట్, డెడె గార్డెనర్, జెరెమీ క్లీనర్, జేమ్స్ గ్రే, ఆంటోని కాటేగాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో మెక్ రాబ్ బ్రిడ్జ్ పాత్రలో బ్రాడ్ పిట్ నటించారు. సమ్మర్ స్పెషల్‌గా మే 24న రిలీజ్ కాబోతోంది.

గాడ్జిల్లా: కింగ్ ఆఫ్ ది మాన్‌స్టర్స్

సినిమా ఫ్రాంచైజీలో అత్యధిక సినిమాలు వచ్చిన సిరీస్ 'గాడ్జిల్లా'. ఇందులో 'గాడ్జిల్లా: కింగ్ ఆఫ్ ది మాన్‌స్టర్స్' 35వ చిత్రం కావడం విశేషం. అంతేకాదు అత్యంత విజయవంతమైన ఫ్రాంఛైజీ కూడా. 2014లో వచ్చిన 'గాడ్జిల్లా'కిది సీక్వెల్. హాలీవుడ్ స్టూడియో పూర్తి స్థాయిలో ఈ సినిమాని నిర్మించింది. 32 సినిమాలు జపనీస్ సంస్థ నిర్మించగా, మూడు సినిమాలని అమెరికన్ ప్రొడక్షన్ కంపెనీ నిర్మించింది. ఈ చిత్రాలపై ప్రపంచ వ్యాప్తంగా భారీ క్రేజ్ నెలకొని ఉంది. గాడ్జిల్లాపై మానవ పోరాటం ప్రధానంగా సినిమాలు సాగుతుంటాయి. తాజా సినిమాలో మూడు తలల రాక్షస జంతువు భూమిపై దాడికి తెగబడుతుంది. ఒకానొక సమయంలో ఆ రాక్షస జంతువు, గాడ్జిల్లా మధ్య యుద్ధం జరుగుతుంది. ఈ క్రమంలో సైనికులు, మనుషులు ఎలాంటి ఇబ్బందులు పడ్డారు. వాటిని ఎలా ఎదుర్కొన్నారనే కథాంశంతో తాజా సినిమా రూపొందింది. మైఖేల్ డౌగెర్టీ దర్శకత్వం వహిస్తున్న ఈ మాన్‌స్టర్ చిత్రంలో కైలె ఛాండ్లర్, వెరా ఫార్మిగా, మిల్లీబాబీ బ్రౌన్,బ్రాడ్లీ వైట్‌ఫోర్డ్, సల్లీ హాకిన్స్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇది మే 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఎక్స్‌మెన్: డార్క్ ఫోనిక్స్..

ఈ ఏడాది రాబోతున్న మరో విజువల్ వండర్, సూపర్ హీరో చిత్రమిది. పాపులర్ ఫ్రాంఛైజీ 'ఎక్స్‌మెన్' సిరీస్‌లో భాగంగా వస్తున్న 12వ చిత్రమిది. మూడేండ్ల క్రితం విడుదలైన 'ఎక్స్‌మెన్:అపోకలిప్సే'కిది సీక్వెల్. జీన్ గ్రే ఓ మిషన్ చేపడతారు. ఈ క్రమంలో ఓ మిస్టీరియస్ ఫోర్స్ ఆమెపై దాడి చేస్తుంది. చావు అంచుల వరకు వెళ్ళిన ఆమె తిరిగి తన స్థావరానికి చేరుకుంటుంది. కానీ ఆ మిస్టీరియస్ ఫోర్స్ చాలా పెద్ద వినాశనానికి దారితీస్తుందని తెలుసుకుని అత్యంత శక్తివంతమైన ఫోనిక్స్‌గా తనని తాను తీర్చిదిద్దుకుంటుంది. ఈ క్రమంలో తమ ఎక్స్‌మెన్స్ బృందంతో కలిసి ఆమె చేసే పోరాటం నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. సిమన్ కింబెర్గ్ దర్శకత్వంలో మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా కోసం ఆడియెన్స్ సైతం ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఫోనిక్స్‌గా సోఫియా టర్నర్ నటించగా, జెన్నీఫర్ లారెన్స్, మైఖేల్ ఫాస్‌బెండర్, జేమ్స్ మెక్ అవోయ్, టై షెరిడన్, అలెగ్జాండ్రా షిప్ ప్రధాన పాత్రలు పోషించారు. జూన్ 7న సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

మెన్ ఇన్ బ్లాక్: ఇంటర్నేషనల్

సైన్స్ ఫిక్షన్ యాక్షన్ కామెడీగా వచ్చిన 'మెన్ ఇన్ బ్లాక్' సిరీస్ సైతం మంచి ఆదరణ పొందింది. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు సినిమాలు వచ్చి ఆడియెన్స్‌కి కావల్సిన వినోదాన్ని పంచాయి. మరోసారి ఆకట్టుకోవడానికి నాలుగో సినిమా వస్తోంది. మెన్‌ఇన్ బ్లాక్ సీక్రెట్ ఏజెంట్ టీమ్ ఓ మర్డర్ మిస్టరీని చేధించడానికి ప్రపంచ వ్యాప్తంగా తిరగాల్సి వస్తుంది. ఈ క్రమంలో చోటు చేసుకున్న యాక్షన్, హాస్యభరిత సన్నివేశాల సమాహారమే ఈ చిత్రం. ఎఫ్. గ్యారీ గ్యారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో క్రిస్ హెమ్స్‌వర్త్, టెస్సా థామ్సన్, లియామ్ నీసన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా జూన్ 14న విడుదల కాబోతుంది.

స్పైడర్ మ్యాన్: ఫార్ ఫ్రమ్ హోమ్

'స్పైడర్ మ్యాన్' చిత్రాలకు సైతం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉంది. ఈ సూపర్ హీరో చిత్రాలు ప్రపంచ బాక్సాఫీసు వద్ద భారీ కలెక్షన్లని కొల్లగొట్టాయి. దీంతో ఈ సీక్వెల్‌లో వచ్చే ప్రతి సినిమా కోసం అందరూ ఈగర్‌గా వెయిట్ చేస్తుంటారు. 'స్పైడర్‌మ్యాన్: హొమ్ కమింగ్'కి సీక్వెల్‌గా ప్రస్తుతం 'స్పైడర్ మ్యాన్: ఫార్ ఫ్రమ్ హోమ్' చిత్రం రూపొందింది. మార్వెల్ సంస్థలో వస్తున్న 23వ చిత్రమిది. జాన్ వాట్స్ దర్శకత్వం వహించారు. పార్కర్(స్పైడర్‌మ్యాన్) విద్యార్థి. తన స్కూల్ ఫ్రెండ్‌తో కలిసి యూరప్ ట్రిప్ వెళ్తాడు. అనంతరం చోటు చేసుకున్న ఆసక్తికర సన్నివేశాల సమాహారంగా ఈ చిత్రం రూపొందింది. గత చిత్రాల్లో నటించిన టామ్ హొలాండ్, సామ్యూల్ ఎల్ జాక్సన్, జెండయ, కోబీ స్మల్డర్స్, జాన్ ఫావ్‌రియు, జె.బి.స్మూవ్, జాకోబ్ బ్యాట్‌లాన్, మార్టిన్ స్టార్ నటించిన ఈ చిత్రం జులై 5న విడుదల కాబోతుంది.

వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్

హాలీవుడ్ స్టార్స్ లియోనార్డో డికాప్రియో, బ్రాడ్‌పిట్‌ల సినిమా అంటే ప్రపంచ వ్యాప్తంగా మంచి క్రేజ్ ఉంటుంది. వారి సినిమాల కోసం వేచి చూసే అభిమానులు చాలా మందే ఉంటారు. మరి ఈ ఇద్దరూ కలిసి నటిస్తే వారి అభిమానులకు పెద్ద పండగే. మార్గాట్ రాబీ మరో కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంపై భారీ క్రేజ్ నెలకొంది. ఓ ఫేడౌట్ అయిన టీవీ నటుడు, అతని స్టంట్ డూప్ జర్నీని తెలిపే కథాంశంతో రూపొందిన చిత్రమిది. సక్సెస్ సాధించేందుకు ఆ నటుడు పడే స్ట్రగుల్స్, ఈ క్రమంలో చోటు చేసుకున్న ఆసక్తికర సంఘటనల ప్రధానంగా రూపొందిన ఈ సినిమాకి క్వెంటిన్ టరంటినో దర్శకత్వం వహించారు. మొదట ఈ చిత్రాన్ని హాలీవుడ్ నిర్మాత హార్వీ వీన్‌స్టీన్ నిర్మాతగా వ్యవహరించారు. ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో ఆయన్ని ఈ ప్రాజెక్ట్ నుంచి తొలగించారు. ఆ స్థానంలో సోనీ పిక్చర్స్ విడుదల హక్కులని దక్కించుకుంది. కామెడీ డ్రామాగా కమర్షియల్ అంశాల ప్రధానంగా రూపొందిన ఈ సినిమా జులై 25న విశ్వ ప్రేక్షకులను అలరించేందుకు వస్తోంది.

ఫాస్ట్ అండ్ ఫ్యూయరిస్ ప్రజెంట్స్: హాబ్స్ అండ్ షాస్

రేసింగ్ ప్రధానంగా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'ఫాస్ట్ అండ్ ఫ్యూయరిస్' సిరీస్ చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా విశేషంగా ఆదరణ పొందాయి. భారీ విజయాలని సాధించాయి. బాక్సాఫీసు వద్ద కలెక్షన్ల వర్షం కురిపించాయి. అందులో భాగంగా రేస్ ప్రధాన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఇప్పుడు తొమ్మిదో చిత్రం రాబోతుంది. డేవిడ్ లించ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో డ్వానే జాన్సన్, జాసన్ స్టథమ్ ప్రధాన పాత్రలు పోషించారు. గతంలో వీన్ డీజిల్ ప్రధాన పాత్ర పోషించేవారు. కానీ ఈ చిత్రం నుంచి తప్పుకుంటున్నట్టు ఆయన గతంలోనే ప్రకటించారు. దీంతో ఆ స్థానంలోకి జాసన్ స్టథమ్ వచ్చారు. ఆగస్ట్ 12న విడుదల కానుంది.


జెమినీ మ్యాన్

దర్శకుడు ఆంగ్ లీ 'లైఫ్ ఆఫ్ పై' సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ అయిన విషయం విదితమే. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం అంటే తెలియకుండానే ఓ క్యూరియాసిటీ నెలకొని ఉంటుంది. హీరోలో విల్ స్మిత్‌కి ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'జెమినీ మ్యాన్' చిత్రం రూపొందింది. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఒక హంతకుడు తన వృతికి ఫుల్ స్టాప్ పెట్టాలనుకుంటాడు. అందుకోసం తన ముఖాన్ని మార్ఫింగ్ చేసుకుంటాడు. అనంతరం చోటు చేసుకున్న ఆసక్తికర పరిణామాల సమాహారమే ఈ చిత్రం. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 4న ఆడియెన్స్‌ని అలరించడానికి రాబోతోంది.


స్టార్ వార్స్: ఎపిసోడ్ 9


'స్టార్ వార్స్' సిరీస్‌లో 'ఎపిసోడ్9' తొమ్మిదో చిత్రమిది. 'స్టార్ వార్స్ సీక్వెల్ ట్రిలోజీ'లో మూడో చిత్రమిది. గతంలో వచ్చిన రెండు చిత్రాలు 'ది ఫోర్స్ అవేకెన్స్', 'ది లాస్ జెడీ' చిత్రాలు భారీ విజయాలను నమోదు చేసుకున్నాయి. దీంతో 'స్టార్ వార్స్: ఎపిసోడ్9'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'స్టార్‌వార్స్ : ది లాస్ట్ జెడీ'లో కథకి ఏడాది తర్వాత జరిగే కథ ఇది. జేజే ఆబ్రామ్స్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఇయర్ ఎండింగ్‌లో సందడి చేయడానికి డిసెంబర్ 20 ప్రేక్షకుల ముందుకు విడుదల కానుంది. వీటితోపాటు జాన్ విక్: చాప్టర్ 3- పారాబెల్లమ్ మార్చి 17న, 'హెల్ బాయ్ రీబూట్' ఏప్రిల్ 12న, 'ఇట్ ఛాప్టర్ టు' సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.


మార్గోట్ రాబీ











రైతును ముంచింది



నవతెలంగాణ-యంత్రాంగం

ఉపరితల ద్రోణి ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతను నిండా ముంచుతున్నాయి. ఆదివారం పలు జిల్లాల్లో కురిసిన వానల కారణాంగా చేతికొచ్చిన వరి, మిర్చి, కంది, పత్తి పంటలు పూర్తిగా తడిసి ముద్దవుతున్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన వరిధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోనూ వర్షం కురుస్తోంది. శనివారం రాత్రి పడ్డ వానలకు పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. ఆదివారం ఉదయం నుంచే ముసురు కొనసాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్‌లో మిర్చి, పొగాకు పంటలు దెబ్బతిన్నాయి. పొగాకు తోరణాలు కిందపడిపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కల్లాల్లో నిల్వ ఉంచిన మిర్చి తడిసిపోతోంది. శనివారం రాత్రి నుంచి హైదరాబాద్ జంట నగరాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ పరవళ్లు తొక్కుతోంది. యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పెద్ద రావుల, భట్టు గూడెం గ్రామాల మధ్య ఉన్న మూసీ వంతెనపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భువనగిరిలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 3 గంటల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండలాల్లో చిరు జల్లులు మొదలయ్యాయి. రోడ్లన్నీ ఒక్కసారిగా ఖాళీ అయ్యాయి. బూర్గంపాడు మండలంలో భారీ వర్షం పడడంతో వరి, పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. గుండాల, అశ్వాపురం మండలాల్లో చిరుజల్లులతోపాటు ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. కల్లాల్లో ధాన్యం ఉన్న రైతులు వాటిని కాపాడుకోడానికి పరుగులు తీశారు.

నల్లగొండ జిల్లావ్యాప్తంగా రెండ్రోజులుగా తేలికపాటి వర్షం కురుస్తున్నది. పెద్దవూర సబ్‌మార్కెట్ యార్డులో ఉన్న పెద్దవూర, పీఏపల్లి, గుర్రంపోడు మండలాల రైతుల ధాన్యం తడిసి ముద్దయ్యింది. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని కమలాపూర్, ఎల్కతుర్తి మండలాల్లో పంట నష్టం జరిగింది. రోడ్లు జలమయమయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లా పరిధిలోని నర్సంపేట, దుగ్గొండి, పరకాల మండలాల్లోనూ పత్తి, మిర్చి, పంటలు దెబ్బతిన్నాయి. జయశంకర్ జిల్లా పరిధిలోని మహదేవ్‌పూర్, మల్హర్‌రావు, ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో కల్లాల్లో నిల్వ ఉంచిన మిర్చి, పత్తి, వరి దెబ్బతిన్నది.

మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, గార్ల మండలాల్లో మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసింది. బయ్యారం మండలంతో పాటు గార్ల మండలం గోపాలపురం, పినిరెడ్డిగూడెం, ముల్కనూరు, పోచారం, మర్రిగూడెం, రాంపురం, మద్దివంచ, పెద్దకిష్టాపురం, సీతంపేట, శేరిపురం, బాలాజీతండా, బుద్దారం గ్రామాల్లో కురిసిన అకాల వర్షం కారణంగా రైతులు ఆరుగాలం కష్టపడి పండించి ఆరబెట్టుకున్న వరి ధాన్యం కొట్టుకుపోతున్నది. గార్ల పట్టణ కేంద్రంలో మార్కెట్ యార్డ్‌లో వరి ధాన్యం, సత్యనారాయణపురంలో కొనుగోలు చేసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. స్థానిక మార్కెట్ యార్డ్‌లో వరి ధాన్యం దాచుకునేందుకు గోనే సంచులు లేవని రైతులు వాపోతున్నారు.

హైదరాబాద్‌లో ముసురు...

హైదరాబాద్ నగరంలో రెండ్రోజులుగా వానలు పడుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ముసురు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హిమాయత్‌నగర్, ఆర్‌టీసీక్రాస్‌రోడ్డు, అంబర్‌పేట్, నల్లకుంట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి ప్రాంతాల్లో వర్షం కారణంగా రోడ్లపై నీరు చేరింది. ట్రాఫిక్ జాంకావడంతో వాహనాలు నిలిచిపోయాయి. కూకట్‌పల్లిలోని ధరణికాలనీలో నాలాల్లోంచి నురుగు రావడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 14 బ్రహ్మకుమారీస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. అధికారులంతా ఇప్పటికే పలు ప్రాంతాల్లో నీళ్లను తొలగించారు. శాస్త్రీపురంలో డివిజన్‌లోని బాబాకుంట, మలక్‌పేట్‌లోని అక్షయ్ జ్యూయలరీ, సైదాబాద్‌లోని సాయిగంగానగర్, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని ఐడీపీఎల్ ప్రధాన రహదారి, యాకత్‌పుర రైల్వే ఆర్‌యూబీ ప్రాంతాల్లో నీళ్లను క్లియర్ చేశారు.


చలిగాలులకు ఒకరుమృతి

చలిగాలులకు కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. అంజయ్య (58) రేకుల షెడ్‌లో నివాసం ఉంటున్నాడు. చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆదివారం ఇంట్లోనే నిద్రపోయాడు. మధ్యాహ్నం కుటుంబీకులు చూసేసరికి మృతిచెంది ఉన్నాడు. చలి గాలులు తాళలేక మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చలికి తట్టుకోలేక 40 గొర్రెలు మృతి

వర్ష ప్రభావంతో పెరిగిన చలికి తట్టుకోలేక పెద్దపల్లి జిల్లాలో దాదాపు 40 గొర్రెలు ఆదివారం మృతిచెందాయి. మండలంలోని రాఘవపూర్‌లో గ్రామానికి చెందిన కొమ్ము ఐలయ్య, పోలవేని శ్రీశైలం, బొడ్డు కొమురయ్య, కుంట ఎల్లయ్యకు చెందిన గొర్రెలను భీరన్న గుడి వద్దనున్న పత్తి చేన్లోకి ఆదివారం మేపడానికి గొర్రెల్ని తోలుకుపోయారు. వర్షంతో పెరిగిన చలికి తట్టుకోలేక వణుకుతూ 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయని బాధితులు తెలిపారు. దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లిందనీ, ప్రభుత్వం ఆదుకోవాలనీ కోరారు.

ఖాళీలు 60 లక్షలు



న్యూఢిల్లీ : ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యలో 10లక్షల పోస్టులు, కాలేజీల్లో, వర్సిటీల్లో, ఐఐటీ, ఐఐఎంలలో రెండు లక్షల అధ్యాపక పోస్టులు, వైద్యరంగంలో 2.2లక్షలకుపైగా డాక్టర్లు, ఆరోగ్యసంరక్షణ సిబ్బంది పోస్టులు, పోలీస్ శాఖలో 5.38లక్షలకుపైగా పోస్టులు, దేశవ్యాప్తంగా ఉన్న దిగువస్థాయి కోర్టుల్లో 5వేల మంది న్యాయమూర్తుల పోస్టులు...ఖాళీగా ఉన్నాయి.

ఎవరు చెప్పారు?

ఉద్యోగాల్ని భర్తీ చేయటంలేదన్న విషయం... అంతా కూడా మోడీ సర్కార్ పార్లమెంట్‌కు తెలియజేసిన సమాచారంలోనే ఉండటం గమనార్హం. పార్లమెంట్ సమావేశాల్లో వివిధ సందర్భాల్లో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు వెల్లడించిన సమాచారం ఆధారంగా పై విషయాలు బయటపడ్డాయి. గతేడాది కాలంగా రాజ్యసభలో 380, 310, 4614, 2335, 2672, 1870, 1344, 1397, 111, 1015, 387, 420, 575, లోక్‌సభలో 1693 ప్రశ్న నెంబర్లకు వెల్లడించిన సమాచారాన్నిబట్టి ఆయా ప్రభుత్వ కార్యక్రమాలకు, పథకాలకు నిధుల్లో కోతవిధించారనీ, ఆ శాఖల్లో ఉద్యోగాల భర్తీ నిలిపివేశారనీ నిర్ధారణ అయ్యింది.

నోరు మెదపటం లేదు...

దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర స్థాయిలో మొత్తం ఎన్ని ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి? ఎన్ని భర్తీ చేశాం? అన్నది చెప్పడానికి మోడీ సర్కార్ ఇష్టపడటం లేదు. రాష్ట్రాల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలు ప్రకటించటం తమ పని కాదనీ, అది రాష్ట్రాల పని అనీ తప్పించుకుంటోంది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా, "మార్చి, 2016నాటికి 4.12లక్షల కేంద్ర ఉద్యోగ ఖాళీలు ఉన్నా"యని తెలిపింది. పోస్టల్, టెలిగ్రాఫ్, రైల్వేలను మినహాయించి కేంద్రం ఈ సమాచారం ఇచ్చారనీ ఉద్యోగ సంఘాల నాయకుడు ఒకరు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ (పీ అండ టీ) శాఖలు, రైల్వేలు జాతీయ స్థాయిలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల్ని కల్పిస్తున్నాయి. పీ అండ్ టీలో 57వేల ఖాళీలున్నాయనీ, రైల్వేల్లో 2.45లక్షల ఖాళీలున్నాయనీ ఉద్యోగ సంఘాల నాయకుడు ఎం.కృష్ణన్ తెలియజేశారు. ముఖ్యంగా విద్యా, వైద్యరంగాల్లో ప్రభుత్వ వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. ఈ శాఖల్లో వివిధ ప్రభుత్వ పథకాలకు, కార్యక్రమాలకు కేంద్రం నిధుల్ని విడుదల చేయటం లేదు. మరికొన్ని చోట్ల అరకొరగా విదుల్చుతోంది.

సాధారణ పాఠశాల నుంచి ఐఐటీ, ఐఐఎం వంటి ప్రఖ్యాత కళాశాలల వరకు ఎక్కడా కూడా ఉద్యోగాల భర్తీ చేపట్టినట్టు కనబడటం లేదు. దీంతో నేడు ప్రభుత్వ రంగంలో ఉన్న ప్రఖ్యాత సంస్థల్లో సైతం విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. నిధుల కోత కారణంగా లక్షలాది సంఖ్యలో ఉపాధ్యాయులు విధుల నుంచి విరమించుకంటున్నారు. దీని ప్రభావం ఇప్పటికిప్పుడు కనపడకపోయినా, భవిష్యత్తులో దేశానికి పెద్ద నష్టానికి తీసుకొచ్చిపెడుతుందని 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్' రిపోర్టు వెల్లడించింది.

విద్యా, వైద్యరంగాలకు నిధుల కోత

- విద్యాశాఖలో ఉన్నట్టుగానే వైద్యశాఖలో పరిస్థితి కనపబడుతోంది. పెద్ద సంఖ్యలో ఉద్యోగ ఖాళీలు ఉంటే 'హెల్త్ మిషన్' ఎలా అమలవుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది.
- కేవలం గ్రామీణ ప్రాంతాల్లోనే 2.23లక్షల ఆరోగ్య సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని 'రూరల్ హెల్త్ సర్వే' తేల్చింది.
- 11వేల డాక్టర్ పోస్టులు, 18వేల స్పెషలిస్టు పోస్టులు, 13వేల నర్స్ పోస్టులు, 18వేల టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- దేశవ్యాప్తంగా 2.2లక్షల అంగన్‌వాడీ కార్యకర్తల, హెల్పర్ల నియామకాల్ని నిలిపేశారు.
- ఉద్యోగాల భర్తీకి సంబంధించి రాష్ట్రాల వారీగా ఉన్న ఖాళీల సంఖ్య 30లక్షలు దాటుతుందని ఉద్యోగ సంఘాలు అంటున్నాయి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో, స్వతంత్ర సంస్థల్లో, ఎయిడెడ్ సంస్థల్లో ఖాళీలు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ, వాటికి నిధులను అందజేయకుండా ఉద్యోగాల భర్తీని మోడీ సర్కార్ అడ్డుకుంటోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

దావత్‌లే దావతులు...ఆపై డబ్బులు

- ప్రచారం తర్వాత పెగ్గు, ముక్క ఉండాల్సిందే
- లేకుంటే ప్రచారానికి నై..నై
- ఎన్నడూ లేని విధంగా కిక్కులో పల్లెజనం
- డిమాండ్‌ను బట్టి ఓటుకు రూ. 2 వేల నుంచి 15 వేల వరకు పంపకం!
- కొన్ని గ్రామాల్లో ప్రచారానికి కూలీలు
- ఖర్చుకు తాళలేక తలలు పట్టుకుంటున్న సర్పంచ్ అభ్యర్థులు
- పంచాయతీ తుదిపోరు రసవత్తరం








నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నడూ లేని విధంగా రోజుకు రెండు పూటల దావత్‌లతో పల్లె ఊగుతున్నది. ఉదయం, రాత్రి ప్రచారాల తర్వాత పెగ్గు, ముక్క తప్పనిసరిగా ఉండాల్సిందే. లేకుంటే అభ్యర్థుల వెంట ప్రచారానికి వెళ్లేందుకు కార్యకర్తలు నై...నై అంటున్నారు. రాత్రికి రాత్రే ప్లేట్లు ఫిరాయించి డబ్బులు దండిగా ఖర్చుపెడుతున్న వారి వెంట తిరుగుతున్నారు. ఇప్పటిదాకా ఎమ్మెల్యేలు, ఎంపీల ఎన్నికల్లోనే కూలీలను పెట్టి ప్రచారాలు చేయించడాన్ని చూశాం...ఈ సంస్కృతి పంచాయతీ ఎన్నికలకూ పాకింది. ఇంకో ఓవైపు గ్రామంలోని ఓట్లను బేరీజు వేసుకుని మరీ ఓటరుకు రూ.2 వేల నుంచి 15 వేల వరకు పంచుతున్నారు. రెండు విడతల్లోనూ ఇదే పరిస్థితి ఉండగా...మూడో విడతగా ఎన్నికల గోదాలో నిలిచిన అభ్యర్థుల ఖర్చు తడిసి మోపెడు అవుతున్నది. లక్షలు లక్షలు మిత్తీలకు తేలేక 'ఈ పెంట నెత్తిల ఎందుకు పెట్టుకున్నరా?బాబూ' అని అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

చివరి విడత పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈ నెల 30న 3,529 పంచాయతీలకుగానూ 11,667 అభ్యర్థులు పోటీపడుతున్నారు. కొన్ని స్థానాల్లో బహుముఖం ఉన్నప్పటికీ ఎక్కువగా ద్విముఖ పోటీలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. గ్రామాల్లో కొన్ని పార్టీలు ఓ గ్రూపు...మరికొన్ని పార్టీలు మరో గ్రూపు కట్టి హోరాహోరిగా తలపడుతున్నాయి. కొన్నిచోట్ల బ్యాలెట్‌లో అభ్యర్థుల సంఖ్య నాలుగైదు కనిపిస్తున్నా ప్రతి గ్రామంలోనూ ప్రధానంగా ఇద్దరి మధ్యే ఎక్కువ పోటీ నెలకొంది. ఎలాగైనా గెలిచి గ్రామంలో పట్టుసాధించాలనే పట్టుదలతో డబ్బులు అప్పులు తేవడం కష్టమైనా ఖర్చుపెట్టడానికి మాత్రం అభ్యర్థులు వెనకాడట్లేదు. ప్రజలను తమవైపు తిప్పుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతిరోజూ దావత్‌లు ఇస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు ప్రచారం పూర్తి కాగానే చికెన్, మటన్‌తో భోజనం పెట్టించి మద్యం పోయిస్తున్నారు. మళ్లీ సాయంత్రం ఐదు గంటల నుంచి 9:30, 10 గంటల దాకా ఊర్లోని ఇంటింటికీ తిరుగుతున్నారు. ఆ తర్వాత ప్రచారానికి తమ వెంట తిరిగిన వాళ్లకూ, ఊర్ల అటూ ఇటూ ఊగిసలాడుతున్నవారిని పిలిచి మద్యం పోయించి, చికెన్, మటన్‌తో భోజనం పెట్టించి రాచమర్యాదలు చేస్తున్నారు. ఊరి జనాన్నంతా ఒక్క దగ్గర కూర్చోబెడితే తాగి తర్వాత ఒక్కరు రాద్ధాంతం చేసినా సర్దిచెప్పడం కష్టమవుతుందన్న భావనతో వార్డులవారీగా, లేకుంటే 50 నుంచి 60 మందిని ఒక్కచోట కూర్చోబెట్టి తాగినోళ్లకు తాగినంతా తాగిపిస్తున్నారు. తిన్నోళ్లకు తిన్నంత తినిపిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని ఓ గ్రామంలో 1500 లోపే ఓట్లు ఉన్నాయి. అక్కడ ఇప్పటి వరకూ బరిలో ఉన్న సర్పంచ్ అభ్యర్థుల్లో ఇద్దరు చెరో 50 లక్షలకుపైగా ఖర్చుపెట్టారని, ఎన్నికలకు మరో రెండు రోజులు సమయం ఉండటంతో ఇంకా చెరో 50 లక్షలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు గ్రామస్తులు బాహాటంగానే చెబుతున్నారు. ఇప్పటికే ఓ అభ్యర్థి వారం నుంచి వార్డు 30 వేలు కేటాయించి రెండు పూటలా ఓటర్లకు మద్యం, భోజనం ఏర్పాటు చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. మరో అభ్యర్థి ఇప్పటికే 800 ఓట్లకు రూ.5 వేల చొప్పున ఓ విడత రూ.40 లక్షలు పంచారని, పరిస్థితిని బట్టి మళ్లీ ఓటుకు రూ.5 నుంచి 10 వేలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తున్నది. హైదరాబాద్‌కు దగ్గర్లో ఉన్న గ్రామాల్లో అయితే ఒక్కో అభ్యర్థి రూ.2, 3 కోట్ల రూపాయలు పెడుతున్న పరిస్థితి. ఖర్చుపెట్టడానికి అభ్యర్థి వెనుకముందు ఆలోచిస్తే వెంటనే ఈ రోజు వచ్చిన మరుసటి రోజు ప్రచారానికి రావట్లేదు. మరో శిబిరంలోకి వెళ్లిపోతున్నారు. తమవైపు జనబలం ఎక్కువగా ఉందని చూపుకోవడానికి, ఓటర్లు చేజారకుండా అభ్యర్థులు ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెడుతున్నారు. గతంలో సర్పంచ్ అభ్యర్థి మహాఅయితే ఓ పదిమందిని వెంటేసుకుని ప్రచారం చేసేవారు. ఒక్కో కుటుంబాన్ని విడిగా వెళ్లి కలిసి ఓటేయాలని వేడుకునేవారు. ఈసారి ఎన్నికల్లో ప్రచార శైలి పూర్తిగా మారిపోయింది. గ్రామంలో కూలికెళ్లేవారికి రూ.500 నుంచి 1,000 రూపాయల వరకు ఇచ్చి మరీ ప్రతి రోజూ అభ్యర్థులు తమవెంట ప్రచారానికి తీసుకెళ్లి హడావిడి చేస్తున్నారు.

తెలంగాణలోని అన్ని జిల్లాల్లో(హైదరాబాద్ మినహా) ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామంలో సర్పంచ్‌గా గెలవటాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని మరీ అభ్యర్థులు ముందుకు వెళ్తున్నారు. చివరి విడతలోని వారు ఇప్పటిదాకా ఖర్చుపెట్టినది ఒక ఎత్తయితే చివరి రెండు రోజులు నెట్టుకురావడం తలకు మించిన భారం అయ్యే అవకాశముంది. ఇంత ఖర్చుపెట్టి చివర్లో వెనకడుగు వేయొద్దు అనే ఉద్దేశంతో ఉన్నారు. డబ్బులు సమకూర్చుకోవటం కొంత ఇబ్బంది అయినా తమ బంధువుల ద్వారా, పరిచయస్తుల ద్వారా అధిక వడ్డీకి తెచ్చి మరీ గెలవటానికి పడరానిపాట్లు పడుతున్నారు.

జైట్లీకి గుస్సా..!





న్యూఢిల్లీ: బ్యాంకుల్ని మోసం చేసిన కేసులో సీబీఐ అధికారుల తీరును తప్పు పడుతూ అరుణ్‌జైట్లీ తన ఫేస్ బుక్‌లో చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది. స్వతంత్ర దర్యాప్తు సంస్థగా పని చేయాల్సిన సీబీఐపై జైట్లీ వ్యాఖ్యల్ని రాజకీయ జోక్యంగా ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. కేంద్ర ఆర్థికమంత్రి అయిన అరుణ్ జైట్లీ క్యాన్సర్‌తో బాధ పడుతూ చికిత్స కోసం అమెరికాకు వెళ్లిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన నిర్వహిస్తున్న ఆర్థికశాఖ బాధ్యతలను రైల్వేశాఖ మంత్రి పీయూష్‌గోయల్‌కు ప్రధాని మోడీ బదలాయించారు. నెలరోజులుగా విధులకు దూరంగా ఉన్న జైట్లీ కీలక కేసులపై దర్యాప్తు జరిపే సంస్థకు సందేశాలివ్వడమేమిటని ప్రతిపక్షాలు ఘాటుగానే విమర్శిస్తున్నాయి. మరో 4 రోజుల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌కు కూడా జైట్లీ దూరంగా ఉండనున్నారు. వీడియోకాన్‌కు రుణం మంజూరు విషయంలో ఆరోపణలున్న ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందాకొచ్చర్‌పై సీబీఐ ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. చందా కొచ్చర్‌తోపాటు ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ అధినేత వేణుగోపాల్ ధూత్‌పై ఈ నెల 24న కేసు కూడా నమోదైంది. వీరు ముగ్గురూ ఐసీఐసీఐ బ్యాంక్‌ను కుట్రపూరితంగా మోసగించినట్టు సీబీఐ అభియోగాలు మోపింది. ఆ మరుసటి రోజే(ఈ నెల 25న) అరుణ్‌జైట్లీ.. సీబీఐ అతిగా వ్యవహరించిందన్న అర్థం వచ్చేలా కామెంట్స్ చేశారు. కేంద్రంలో ఉన్నవారే..రాజ్యాంగ నిబంధనలు గాలికొదిలేలా వ్యవహరించటంపై విమర్శలు వెల్లువెత్తాయి. జైట్లీ పోస్ట్ చేసిన వ్యాఖ్యలు నిష్పాక్షిక దర్యాప్తు జరగకుండా ఆటంకం కలిగించే ప్రమాదమున్నదని పలువురు మండిపడుతున్నారు.

జైట్లీకి ఎందుకంత దూల..

దర్యాప్తులో వృత్తి నైపుణ్యతకూ, సాహసికతకూ ప్రాథమికంగా తేడా ఉంటుందంటూ ప్రారంభించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సాక్ష్యాలు ఉన్నా, లేకున్నా బ్యాంకింగ్ రంగంలోని ప్రతి ఒక్కరినీ లాగడం తగదంటూ హితవు పలికారు. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ఐసీఐసీఐ కేసులోని జాబితా చదివినపుడు తన మనసు పడ్డ ఆవేదన అంటూ సందేశమిచ్చారు. సీబీఐ సాహసికత మీడియాకు లీకులిచ్చేందుకు దారి చూపుతుందని, తద్వారా సంబంధిత వ్యక్తుల గౌరవానికి భంగం కలుగుతుందని కూడా జైట్లీ వ్యాఖ్యానించారు. కేంద్రంలో కీలక పదవిలో ఉండి తాత్కాలికంగా విధులకు దూరంగా ఉన్న వ్యక్తి నుంచి ఈ రకమైన వ్యాఖ్యలు రావడం జోక్యం చేసుకోవడంగానే పలువురు విశ్లేషిస్తున్నారు.

చందాకొచ్చర్‌పై క్విడ్‌ప్రోకో ఆరోపణ..

చందాకొచ్చర్ దంపతులపై నమోదైన కేసు వివరాలు ఇలా ఉన్నాయి: ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉన్నతాధికారిగా ఉన్న చందా కొచ్చర్ నేతృత్వంలోని కమిటీ వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌కు రుణం మంజూరు చేయడంలో నిబంధనలు పాటించలేదని సీబీఐ పేర్కొంది. ఇచ్చిన రుణాల్లో చాలా వరకు తిరిగి రాకపోవడంతో బ్యాంకుకు 1730కోట్ల నష్టం వచ్చినట్టు ఆరోపణలున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి రుణం పొందినందుకు ప్రతిఫలంగా వీడియోకాన్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్.. దీపక్ కొచ్చర్‌కు చెందిన నూపవర్ రెనీవేబుల్స్ కంపెనీలో రూ.64 కోట్లు పెట్టుబడి పెట్టారని సీబీఐ తెలిపింది. ఈ పెట్టుబడిని అవినీ తిగా(లంచంగా) భావిస్తూ సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న చందా కొచ్చర్‌ను గతేడాది అక్టోబర్‌లో ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో, ఎండీ పదవుల నుంచి తొలగించారు. మరోవైపు చందా కొచ్చర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ అధికారి సుధాన్షుధార్ మిశ్రాను బదిలీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. చందా కొచ్చర్‌పై ఈనెల 22న ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఈ నెల 23న మిశ్రాను జార్ఖండ్‌లోని రాంచీ శాఖకు బదిలీ చేశారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలాంటి కీలక దర్యాప్తు సంస్థల పనితీరుపై గత నాలుగున్నరేండ్ల కాలంలో అతిగా జోక్యం చేసుకున్నదన్న విమర్శలకు ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్ సేఫ్టీపై అగ్నిమాపక శాఖ కన్ను

నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోని బహుళ అంతస్తుల భవనాలలో అగ్నిప్రమాదాలను నియంత్రించడానికి అవసరమైన కార్యాచరణను రాష్ట్ర అగ్నిమాపక శాఖ రూపొందిస్తున్నది. అధిక ఆదాయమే ప్రధానంగా నిర్మితమవుతున్న బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్ సేఫ్టీ విషయంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ దిశగా అగ్నిమాపక శాఖ అధికారులు నిశితంగా దృష్టిని సారించారు. నాలుగు రోజుల క్రితం నగరం నడిబొడ్డున ఉన్న కెఎల్‌కె బిల్డింగ్స్‌లోని మూడంతస్తులలో ఒక్క సారిగా అగ్నిప్రమాదం చోటు చేసుకోవడం కలకలం రేపింది. ఇందులో ఎగిసిపడ్డ మంటలను అదుపు చేయడానికి ఫైర్‌సర్వీసు అధికారులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దాదాపు 10కి పైగా అగ్నిమాపక శకటాలు సకాలంలో ఘటనా స్థలానికి చేరుకొని నిర్విరామంగా పనిచేయడంతో విశాలమైన ఆ బిల్డింగ్‌లో మంటలు పక్కనున్న ఇతర భవనాలకు విస్తరించకుండా నివారించగలిగారు. ఈ క్రమంలో ఇద్దరు ఫైర్ సర్వీసు అధికారులు స్పృహ కోల్పోయారు. అయితే ఈ భవనంలో ప్రమాదానికి ఇతర కారణాలున్నా వెంటనే మంటలను అదపు చేసేందుకు ఉండాల్సిన అగ్నిమాపక పరికరాలు లేవనే ఆరోపణలు ఫైర్ సర్వీస్ అధికారుల దృష్టికి వచ్చినట్టు తెలిసింది. ఈ ప్రమాదంలో పెద్ద ఎత్తున ఆస్థి నష్టం వాటిల్లినప్పటికీ ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు ఇతర ముఖ్యమైన పట్టణాలలో నిర్మించిన, నిర్మాణంలో ఉన్న భవనాలలో ఏ మేరకు యాజమాన్యాలు, బిల్డర్లు అగ్నిమాపకశాఖ నిబంధనలను పాటిస్తున్నారు, ఎంత మేరకు అగ్నిమాపక ఎమర్జెన్సీ పరికరాలను రూల్స్ ప్రకారం ఏర్పాటు చేస్తున్నారు, ఎంత మేరకు తమ సెల్లార్‌లలోని సంప్‌లలో నీటిని నిలువ చేస్తున్నారు మొదలైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు ఆస్థి, ప్రాణ నష్టం సంభవించినప్పుడే నిబంధనలకు తిలోదకాలిస్తున్న భవన యాజమాన్యాల గుట్టు రట్టు అవుతున్నది. ఇక వచ్చేది వేసవి కాలం కావడంతో బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్‌సేఫ్టీని ఏ మేరకు పాటిస్తున్నారనేది తేల్చాలని ఈ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారని తెలిసింది. ప్రధాన రోడ్డు మార్గాలలోనే కాదు ద్విచక్ర వాహనం మాత్రమే వెళ్లే సందులలో సైతం నాలుగు నుంచి ఐదారు అంతస్తుల భవనాలు పలు బస్తీలలో నిర్మాణమయ్యాయి. మరి కొన్ని చోట్ల జరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో వీటి నిర్మాణాలను కనిపెట్టి వాటికి ఫైర్ సేఫ్టీ ఏ మేరకు ఉన్నదనేది తేల్చడం అగ్నిమాపక శాఖ అధికారులకు సవాల్‌గా మారింది. కారణం ఇలాంటి నిర్మాణాలను ముందుగా కనిపెట్టి వాటికి తగిన అనుమతులు ఉన్నాయా లేదా అనేది తేల్చి తగిన చర్యలు తీసుకోవల్సిన బాధ్యత జీహెచ్ఎంసీతో పాటు జిల్లాల్లో ఆయా నగర పాలక సంస్థలదని, సంబంధిత విభాగాలకు చెందిన కొందరు అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా రాత్రికి రాత్రే బహుళ అంతస్తుల నిర్మాణాలు నిరాటంకంగా సాగిపోతున్నాయని కొందరు అగ్నిమాపక శాఖాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటే ఆ సమయంలో తాము కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కోవలసి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ తాజాగా కెఎల్‌కె బిల్డింగ్‌లో చోటుచేసుకున్న ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్‌ల పరిధులలోని బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్‌సేఫ్టీ మెజర్స్‌పై అగ్నిమాపక శాఖ అధికారులు సోదాలు నిర్వహించాలని ప్రణాళిక రూపొందిస్తున్నారని తెలిసింది.

31 నుంచి పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు రాజ్యసభ చైర్మెన్ వెంకయ్యనాయుడు తెలిపారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అనారోగ్యంతో అమెరికాలో చికిత్స పొందుతుండటంతో.. తాత్కాలికంగా ఆ శాఖ బాధ్యతలను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు అప్పగించారు. ఫిబ్రవరి 1న పీయూష్ గోయల్ లోక్‌సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

అంబేద్కర్, ఆజాద్ విగ్రహాలు ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని డిమాండ్ చేశారు. కీసర సీఐ ప్రకాశ్ ఘటనా స్థలానికి చేరకుని ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పడంతో నిరసనకారులు ఆందోళన విరమించారు. కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ శివకుమార్ హామీ ఇచ్చారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఆందోళనలో ఎంపీపీ ఆర్ సుజాత, ఎంపీటీసీ బాలరాజ్, ప్రజా సంఘాల నాయకులు మునుగంటి సురేష్, నర్సింహ, కౌకుంట్ల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

69 ఏండ్లలో.. 8 మంది జడ్జీలా !

(మొదటిపేజీ తరువాయి)

విధులను ప్రారంభించింది. ఇన్నేండ్లు గడిచినా సర్వోన్నత న్యాయస్థానంలో మహిళల ప్రాతినిధ్యం అంతగా లేకపోవడం కలవరపెట్టే అంశం. 1989లో సుప్రీంకోర్టు జడ్జిగా తొలిసారిగా ఒక మహిళ నియామకమయ్యారు. కాగా.. ఇప్పటివరకు ఎనిమిది మంది మహిళలు మాత్రమే సుప్రీంకోర్టు జడ్జిలుగా నియామకం కావడం గమనార్హం. సుప్రీంకోర్టుకు ఇప్పటివరకు 239 మంది న్యాయమూర్తులు నియామకం కాగా.. వీరిలో మహిళల ప్రాతినిధ్యం 3.34 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. మరోవైపు.. హైకోర్టుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దేశంలోని హైకోర్టుల్లో ప్రస్తుతమున్న జడ్జిల్లో దాదాపు 73 మంది మాత్రమే(10.89 శాతం) మహిళలు ఉన్నారు. కోర్టుల్లో మహిళల ప్రాతినిధ్యం అంతగా లేకపోవడంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే న్యాయమూర్తుల్లో మహిళలు 50 శాతం ఉండాల్సిందేనంటూ పార్లమెంటుకు స్టాండింగ్ కమిటీ నివేదికను సమర్పించింది. సమాజం యొక్క నిర్మాణం, దాని వైవిధ్యం ఉన్నత న్యాయవ్యవస్థలో ప్రతిబింబించాలని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 124, 217 ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జిల నియామకం జరుగుతున్నది. దీని ప్రకారం.. వీరి నియామకానికి ఎలాంటి రిజర్వేషన్లూ అమల్లో లేవు. కాగా.. ఉన్నత న్యాయస్థానాలతో పాటు కింది కోర్టుల్లోనూ మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్టాండింగ్ కమిటీ తన రిపోర్టులో కోరింది. అంతేకాక.. హైకోర్టుల్లో న్యాయమూర్తుల పోస్టులు భారీగా ఖాళీగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసింది.

మోడీకి తంబిల సెగ

చెన్నై : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాని మోడీకి తమిళనాడులో చేదు అనుభవం ఎదురైంది. మదురైలో ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేసేందుకు ఆదివారంనాడు రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోడీకి స్థానికుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. రాష్ట్ర ప్రయోజనాలను మోడీ ప్రభుత్వం విస్మరిస్తోందని వారు ఆందోళనకు దిగారు. మదురైలోని పెరియార్ బస్టాండ్ సహా పలుప్రాంతాల్లో నల్లరంగు బ్యాడ్జీలు ధరించి నల్లరంగు బెలూన్లను గాల్లోకి వదిలారు. మోడీకి వ్యతిరేకంగా నినాదాలిస్తూ పోస్టర్లను ప్రదర్శించారు. గతేడాది నవంబర్‌లో 'గజ' తుఫాను వల్ల అతలాకుతలమైన రాష్ట్రంలో పర్యటించలేదని, పరిహారం కోసం రాష్ట్రం అడిగిన మొత్తాన్ని విడుదల చేసేందుకు కేంద్ర సర్కారు నిరాకరించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు, స్టెరిలైట్ పరిశ్రమకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో ఆందోళనకారులపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటనపైనా మోడీ నోరుమెదపలేదని గుర్తు చేస్తూ నినాదాలిచ్చారు. నల్లజెండాలతో ఎండీఎంకే పార్టీ కార్యకర్తలూ రోడ్లనెక్కారు. అయితే వారు ఎయిమ్స్‌ను వ్యతిరేకించడం లేదని, కేంద్ర ప్రభుత్వ తీరుపైనే తమ నిరసన అని స్పష్టం చేశారు. దీనికి ముందు మోడీ పర్యటన నేపథ్యంలోనే సామాజిక మాధ్యమం ట్విట్టర్‌లో ఈ అంశంపై దుమారం రేగింది. కావేరీ సహా పలు అంశాలపై మోడీ ప్రభుత్వం తమిళనాడు ప్రయోజనాలకు విరుద్ధంగా నడుచుకుంటోందని నిరసిస్తూ 'గో బ్యాక్ మోడీ' హ్యాష్‌ట్యాగ్‌తో ఫొటోలు, ట్వీట్లను పోస్టు చేశారు. మోడీ అనుకూలురూ ట్విట్టర్‌లో ప్రధానికి స్వాగతం చెబుతూ పోస్టులు పెట్టారు. కాగా, మదురైలో ఎయిమ్స్‌కు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. అక్కడే ఓ ర్యాలీలో ప్రసంగించారు.


సెన్సెక్స్ ▼169	నిఫ్టీ ▼69	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు (వందకి)
36,025	10,780	71.17	రూ. 32,358	రూ. 39,708	హైదరాబాద్ 418, ఒక్కగుడ్డుకు 4.70, వరంగల్ 420, విజయవాడ 423, చెన్నై 455, ముంబయి 473

శుక్రవారం మార్కెట్లు ముగిసే సమయానికి






తగ్గిన పత్తి దిగుబడి



మునుపెన్నడూ లేనంతా దేశవ్యాప్తంగా పత్తి దిగుబడులు పడిపోయాయి. 2018-19లో 355 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి సాధించాలని కేంద్ర వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకోగా, 324.83 లక్షల బేళ్ల (ఒక పత్తి బేల్ 170 కిలోలకు సమానం) ఉత్పత్తి వచ్చిందని అంచనావేస్తోంది.

177 కోట్ల జీఎస్టీ ఫ్రాడ్ కేసులో...

- గుజరాత్ వ్యక్తి అరెస్టు



అహ్మదాబాద్: నకిలీ సమాచారంతో రూ.177 కోట్ల జీఎస్టీని ఎగ్గొట్టేందుకు యత్నించిన గుజరాత్ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని కేంద్ర జీఎస్టీ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. నిందితుడిని వడోదరకు చెందిన ఎహ్‌సాన్-అలీ-సయ్యద్(29)గా గుర్తించినట్టు గాంధీనగర్‌లోని కేంద్ర జీఎస్టీ, ఎక్సైజ్ కమిషనరేట్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను పొందేందుకు నకిలీ ఇన్‌వాయిసెస్‌కు సంబంధించిన స్కాంలో నిందితుడు ప్రధాన వ్యూహకర్త అని అధికారులు తెలిపారు. నిందితుడు.. డమ్మీ యజమానులతో 66 నకిలీ కంపెనీలను నడిపినట్టు జీఎస్టీ కార్యాలయం వివరించింది. డమ్మీ యజమానుల పేరుతో జీఎస్టీ రిజిస్ట్రేషన్, జీఎస్టీ ఐడీ కార్డులు, లాగిన్ పాస్‌వర్డ్, సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ పాస్‌వర్డ్‌లను నిందితుడు పొందాడని కమిషనరేట్ తెలిపింది. 'సదరు కంపెనీల పేరుతో నిందితుడు నకిలీ బిల్లు జారీ చేస్తాడు. రూ. 1,210 కోట్లకు సంబంధించి రూ. 177.64 కోట్ల ఐటీసీని పొందేందుకు తప్పుడు సమాచారం సృష్టించాడని నిందితుడు ప్రయత్నించాడు' అని చెప్పింది. దీనితో నిందితుడిని సీజీఎస్‌టీ చట్టం కింద అరెస్టు చేశారు. తదుపరి విచారణను కొనసాగిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

వినియోగదారుల ఫిర్యాదులపై నేటి నుంచి విచారణ


- సోమవారం నుంచి ఫిబ్రవరి 8 వరకు హైదరాబాద్‌లో సర్క్యూట్
- జాతీయ కమిషన్ ఛైర్మెన్ జస్టిస్ అగర్వాల్‌తో కార్యదర్శి అకున్ సబర్వాల్ భేటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి వినియోగదారుల కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల ఫిర్యాదుల అప్పీలు, రివిజన్ పిటిషన్లపై జాతీయ వినియోగదారుల వివాదాల, రిడ్రెసల్ కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) సర్క్యూట్ బెంచ్ రేపటి నుంచి హైదరాబాద్‌లో విచారణ ప్రారంభించనున్నది. ఈ కేసుల విచారణకుగాను ఆదివారం హైదరాబాద్ వచ్చిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ ఛైర్మెన్ జస్టిస్ ఆర్.కె.అగర్వాల్‌ను రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా వినియోగదారుల ఫోరాల బలోపేతంపై ఆయా జిల్లాల ఫోరం అధ్యక్షులు, సభ్యులతో ఈ సందర్భంగా సమావేశమయ్యారు. సమావేశంలో రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఛైర్మెన్ జస్టిస్ ఎంఎస్‌కె. జైస్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల్లో వినియోగదారుల ఫోరాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సర్క్యూట్ బెంచ్‌లో వినియోగదారుల భద్రతా చట్టం, 1986 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసులను విచారణకు చేపట్టనుంది. జాతీయ వినియోగదారుల కమిషన్ ఛైర్మెన్ జస్టిస్ ఆర్‌కె అగర్వాల్, సభ్యురాలు ఎం.శిరీష నేతృత్వంలో ఏర్పాటైన సర్క్యూట్ బెంచ్ సోమవారం ఉదయం 10.30 గంటలకు కేసుల విచారణను చేపట్టనున్నది. వినియోగదారుల ఫిర్యాదులకు సంబంధించి రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో దాదాపు 2,685 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సోమవారం నుండి ఫిబ్రవరి 8లోపు కోటీ రూపాయలు అంతకు పైబడిన ఫిర్యాదులను కూడా వినియోగదారులు ఈ సర్క్యూట్ బెంచ్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఈ రెండు రాష్ట్రాలకు సంబంధించి కొత్తగా అప్పీళ్లుగానీ, రివిజన్ పిటిషన్లు గానీ నేరుగా దాఖలు చేసుకోవచ్చు.

ట్రైన్ 18 ఇక 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'



న్యూఢిల్లీ :దేశంలో అత్యంత వేగంగా నడిచే, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ట్రైన్ 18కు 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' అని రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ నామకరణం చేశారు. గంటకు 160 కిలో మీటర్ల వేగంతో నడిచే ఈ రైలు ఢిల్లీ, వారణాసిల మధ్య నడవనుంది. దీనిని ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు. చెన్నైలోని ఇంటగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ 18 నెలలు శ్రమించి, 97 కోట్ల రూపాయలను వెచ్చించి, 16 కోచ్‌ల ఈ రైలును సిద్ధం చేసింది. దీనిని 30 ఏళ్లనాటి శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌కు వారసురాలిగా పరిగణిస్తున్నారు. 'ట్రైన్ 18ని ఇక వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌గా పిలవనున్నాం. అత్యాధునిక హంగులతో, స్వదేశీ పరిజ్ఞానంతో 18 నెలల పాటు ఇక్కడి ఇంజనీర్లు శ్రమించి ఈ రైలును తయారు చేశారు. ఇది ఢిల్లీ, వారణాసి మధ్య ప్రయాణం చేయనుంది. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రజలకు దీనిని బహుమతిగా అందిస్తున్నాం' అని గోయల్ తెలిపారు. పూర్తి ఎయిర్ కండిషన్ ఉన్న ఈ రైలు కాన్పూర్, అహ్మదాబాద్‌లలో మాత్రమే ఆగుతుందని తెలిపారు.

ముంచిన ఆ ముగ్గురి కోసం వేట

వెస్టిండీస్‌కు సీబీఐ, ఈడీ

- మేహుల్ చోక్సీ, జతిన్ మెహతా, నీరవ్ మోడీల అన్వేషణ
- సాగనంపిన మోడీ సర్కార్ పట్టుకుంటుందా!




న్యూఢిల్లీ : బ్యాంకుల్ని నిండాముంచి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారులు మేహుల్‌చోక్సీ, నీరవ్ మోడీ, జతిన్ మెహతాల కోసం సీబీఐ, ఈడీ రంగంలోకి దిగింది. వీరు కరీబియన్ దీవుల్లో (వెస్టిండీస్) ఎక్కడో ఒకచోట తలదాచుకున్నట్టు సమాచారముందనీ, దీంతో సీబీఐ, ఈడీ ఉన్నతాధికారులు వారిని స్వదేశానికి రప్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారనీ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. సీబీఐ, ఈడీ ఉన్నతాధికారులు చేపడుతున్న ఈ ప్రత్యేక ఆపరేషన్ కోసం 'ఎయిర్ ఇండియా' బోయింగ్ విమానాన్ని సైతం సిద్ధం చేసి ఉంచారని, అధికారులంతా ఇందులోనే వెస్టిండీస్‌కు వెళ్లి ఆర్థిక నేరగాళ్లను స్వదేశానికి తీసుకొచ్చే పనిని చేపడతారనీ ఆయన అన్నారు.

'పెయిడ్ సిటీజన్‌షిప్ ప్రోగ్రామ్' కింద కరీబియన్ దీవుల్లో మేహుల్ చోక్సీ, జతిన్ మెహతాలు అక్కడి పౌరసత్వాన్ని పొందినట్టు తెలుస్తోంది. మెహతా 'సెయింట్ కిట్స్, నెవీస్' దేశ పౌరసత్వాన్ని ఎన్నో ఏండ్ల క్రితమే పొందాడనీ, మేహుల్ చోక్సీ 'ఆంటిగ్వా, బార్బుడా' దేశ పౌరసత్వాన్ని ఇటీవలే పొందాడనీ భారత అధికారులు గుర్తించారు. ఈ దీవుల పౌరసత్వమున్న వారు 132దేశాల్లో వీసాల్లేకుండా రాకపోకలు సాగించవచ్చు.

వేల కోట్లు రుణాలు తీసుకొని బ్యాంకుల్ని ముంచిన నీరవ్ మోడీ ఆచూకీని మాత్రం భారత నిఘా వర్గాలు కనుక్కోలేకపోతున్నాయి. అతను కూడా ఇక్కడే కరీబియన్ దీవుల్లో తలదా చుకొని ఉండొచ్చు ననీ సీబీఐ, ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. వెస్టిండీస్-భారత్ మధ్య నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలు లేకపోవటంతో, మనదేశ ఆర్థిక నేరగాళ్లకు ఇక్కడ సులభంగా ఆశ్రయం దక్కుతోంది. కరీబియన్ దీవులైన గ్రెనెడా, సెయింట్ లూసియా, డోమినికా..దేశాలు కూడా 'పెయిడ్ సిటీజన్‌షిప్' ప్రోగ్రామ్‌ను ఆఫర్‌చే స్తున్నాయి. లక్ష నుంచి రెండు లక్షల డాలర్లు చెల్లి స్తేచాలు పాస్‌పోర్ట్ దక్కుతోంది. కాగా ఆ ముగ్గురు పరారవ్వటానికి పరోక్షం గా సహకరించిన మోడీ సర్కార్ వారిని పట్టుకుంటుందా! అనే అనుమానం వ్యాపరావర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

ఉల్లి ఉసురు తీస్తున్న బీజేపీ

అంతకంతకూ పడిపోతున్న ధరలు.. ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు

- మహారాష్ట్రలో ఇప్పటికే 18 మంది రైతుల ఆత్మహత్య
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



బీజేపీ సర్కారు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో ఉల్లి పంటను నమ్ముకుని సాగు చేస్తున్న మహారాష్ట్ర రైతులు పెట్టుబడులు సైతం రాక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ప్రారంభమైన ఇరవై ఐదు రోజుల వ్యవధిలోనే అక్కడ 18 మంది ఉల్లి పంట సాగు చేసిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డరంటేనే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మార్కెట్‌కు తీసుకొచ్చిన క్వింటాళ్ల కొద్ది ఉల్లి పంటను అమ్మితే వేయి రూపాయలు కూడా రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతేడాది నవంబర్‌లో నాసిక్‌కు చెందిన ఓ రైతు.. క్వింటాల్ ఉల్లి పంట అమ్మి తనకు వచ్చిన రూ. 700 లను ప్రధానమంత్రి కార్యాలయానికి మనీ ఆర్డర్ చేసినా ప్రధాని మోడీ, రాష్ట్రంలోని బీజేపీ సర్కారు ఈ విషయంపై దృష్టి సారించకపోవడం గమనార్హం.

ముంబయి: దేశంలో ఉల్లి పంటను ప్రధానంగా పండించే రాష్ట్రాలలో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉన్నది. కరువు ప్రాంతమైన నాసిక్ జిల్లా పరిధిలో ఉండే నాలుగు జిల్లాలలో రైతులు ఈ పంటను అధికంగా సాగుచేస్తారు. తీవ్ర నష్టాలకోర్చి రైతులు ఉల్లిని సాగు చేసి దానిని విపణికి తీసుకొస్తే వారికి పెట్టుబడి ఖర్చులు రాకపోగా.. కూలీల ఖర్చు కూడా గిట్టుబాటు కావడం లేదని వారు వాపోతున్నారు. దీంతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గతవారం నాసిక్ జిల్లా మాలేగావ్ తాలూకా కందేర్ గ్రామానికి చెందిన రైతు ధ్యనేశ్వర్ (35).. తాను పండించిన పంటకు పెట్టుబడి కూడా రాలేదని మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ధ్యనేశ్వర్ మాదిరిగానే గడిచిన ఇరవై ఐదు రోజులలో అక్కడ 18 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీస ధరలు కూడా రాకపోవడంతో రైతులు తమ పంటలను పశువులకు మేతగా వేస్తున్నారు. అహ్మద్‌నగర్ జిల్లా రహురి గ్రామానికి చెందిన ఉల్లి రైతు సురేశ్ కరాలే తాను సాగు చేసిన ఉల్లి పంటను గొర్లకు మేతగా వేశాడు. రూ. 60వేల పెట్టుబడితో పంట పండిస్తే దానిని అమ్మితే రూ. 10 వేలు కూడా వచ్చేలా లేవని సురేశ్ అన్నాడు. గతేడాది నవంబర్, డిసెంబర్‌లలో నాసిక్‌కు చెందిన ఇద్దరు రైతులు.. ఉల్లి పంట అమ్మగా వచ్చిన కొద్ది మొత్తాన్ని మోడీకి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు పంపారు. అయినా కూడా కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు స్పందించలేదు.

ప్రభుత్వం ఆదుకోవాల్సిందే..!


ఈ సమస్యను అరికట్టాలన్నా రైతుల ఆత్మహత్యలు ఆగాలన్నా ఉల్లి రైతులను కేంద్ర, రాష్ట్ర సర్కారులు ఆదుకోవాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. ఉల్లికి ఒకరేటును నిర్ణయించి దానికి తగిన విధంగా రైతుల దగ్గర పంటను కొనుగోలు చేయాలని నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్) డైరెక్టర్ నానాసాహెబ్ పాటిల్ అన్నారు. ఆయన చెప్పినదాని ప్రకారం.. ఒకవేళ కిలో ఉల్లికి రూ. 8 గా నిర్ణయిస్తే, మార్కెట్లో రైతుకు రూ. 4 వస్తే మిగతా నాలుగు రూపాయలను ప్రభుత్వమే రైతులకు చెల్లించాలని తెలిపారు. ఇలాంటి విధానాల ద్వారానే రైతుల ఆత్మహత్యలు ఆగుతాయని స్పష్టం చేశారు. ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) మహారాష్ట్ర జనరల్ సెక్రెటరీ డాక్టర్ అజిత్ నవలే మాట్లాడుతూ.. సర్కారు చెబుతున్నట్టుగా దిగుబడులు పెరగడంతో ఈ సమస్య రాలేదని అన్నారు. ప్రభుత్వ విధానాలే ధరల పతనానికి కారణమని తెలిపారు. అధిక దిగుబడి, ధరల పతనం వంటివి ఎన్నో ఏండ్లుగా ఉన్నాయని.. కానీ, దీనిపై సరైన విధానాన్ని రూపొందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన అన్నారు.

పడిపోతున్న ధరలు.. ఎగుమతులపై కేంద్రం నిర్లక్ష్యం

దేశంలో ఉల్లి ధరలు దారుణంగా పడిపోతున్నాయి. రైతులు క్వింటాల్ ఉల్లి అమ్మితే కనీసం రూ. 100 కూడా రాని పరిస్థితి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో ఉన్నది. గతేడాది దేశవ్యాప్తంగా 220 లక్షల టన్నుల ఉల్లి దిగుబడి వచ్చింది. ఇది దేశ అవసరాల (170 లక్షల టన్నులు)కు మించి 50 లక్షల టన్నులు అధికం. అధిక ఉత్పత్తి రావడంతో ఉల్లి ధరలు ఒక్కసారిగా దారుణంగా పడిపోయాయి. గడిచిన 18 నెలలలో ఉల్లి ధరలు పడిపోయినంతగా దేశంలో మరే వస్తువు ధరలు పతనమవలేదు. 2017 జూలైలో క్వింటాల్‌కు రూ. 2,500 ఉన్న ఉల్లి ధర.. ఈ ఏడాది జనవరి నాటికి పలు మార్కెట్‌లలో రూ. 150కి పడిపోయింది. ఇదిలాఉంటే ఉల్లి ఎగుమతుల మీద కూడా మోడీ సర్కారు నిర్లక్ష్యం వహిస్తోంది. అధిక ఉత్పత్తికి తగ్గట్టు ఎగుమతులను పెంచడం లేదు. 2016-17లో 34 లక్షల టన్నుల ఉల్లిని ఎగుమతి చేసిన కేంద్రం.. తర్వాతి ఏడాది దానిని 16.7 లక్షల టన్నులకు తగ్గించింది. ఇక 2018లో ఇది మరింత దిగువకు పడిపోయింది. కేవలం 12 లక్షల టన్నుల ఉల్లిని మాత్రమే కేంద్రం ఎగుమతి చేసింది. కాగా, ఈ ఎగుమతులపై పదిశాతం సబ్సిడి ఇవ్వాలని ఎగుమతిదారులు డిమాండ్ చేస్తున్నా సర్కారు మాత్రం 5 శాతం ఇచ్చి చేతులు దులుపుకుంది.

అవినీతి ఆరోపణలున్నా ఏం చేయలేం

- సీవీసీపై ఫిర్యాదులకు కేంద్రం జవాబు



న్యూఢిల్లీ: కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు వచ్చినా ఆయనపై చర్యలు తీసుకోలేమని మోడీ సర్కారు తెలిపింది. ప్రస్తుతం సీవీసీపై చర్యలు తీసుకోవడంపై మార్గదర్శకాలు లేవని మినిస్ట్రీ ఆఫ్ పర్సనల్ వివరించింది. అయితే ఈ మార్గదర్శకాలు రూపొందించే ప్రక్రియను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రెయినింగ్(డీ ఓ పీ టీ) మొదలుపెట్టిందని ఓ ఆర్టీఐకి సమాధానంగా తెలిపింది. సీవీసీ దర్యాప్తు నివేదిక సహ పలు అంశాల ఆధారంగా సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్ వర్మను తొలగించిన నేపథ్యంలో ఈ సమాచారం వెలువడటం ప్రస్తుతం దుమారం రేపుతోంది.

అటవీ శాఖలో విధులు నిర్వహిస్తున్న సంజీవ్ చతుర్వేది ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ మేరకు సమాచారం వెల్లడైంది. సీవీసీ కెవి చౌదరిపై పలు అవినీతి ఆరోపణలు చేస్తూ చతుర్వేది 2017లో రాష్ట్రపతికి లేఖ రాశారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)-ఢిల్లీ లో అవినీతి ఆరోపణలకు సంబంధించిన దర్యాప్తును సీవీసీ మూసివేసిందని ఆయన ఆరోపించారు. ఇలాంటి ఏడు అవినీతి, అక్రమ వ్యవహారాలకు సంబంధించిన సమాచారం, వాటికి సంబంధించిన ఆధారాలతో 1000 పేజీల లేఖను రాష్ట్రపతి భవన్‌కు పంపారు. ఇందులో తనను బాధితుడిగా మార్చే ఒక వ్యవహారమూ ఉన్నట్టు చతుర్వేది తెలిపారు. కాగా, ఈ ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి భవన్ వాటిని కార్మిక మంత్రిత్వ శాఖకు బదిలీ చేసింది. 2012 నుంచి 2014 మధ్యకాలంలో చతుర్వేది ఎయిమ్స్‌లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ కాలంలో ఆయన పలు అవినీతి వ్యవ హారాలను సీబీఐ దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ సమగ్ర దర్యాప్తు చేపట్టిన తర్వాత నాలుగింటిపై డిపార్ట్‌మెంటల్ యాక్షన్ తీసుకునేందుకు నిర్ణయించింది. ఈ నాలుగు కేసుల్లో సీవీసీ అధికారులకు సన్నిహితంగా ఉన్న పలు అధికారులు, సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్లనూ సీబీఐ ప్రస్తావించింది. అయితే ఈ విచారణనూ సీవీసీ నిలిపేసిందని చతుర్వేది దస్తావేజుల్లో తేలింది. 2017లో రాష్ట్రపతి భవన్‌లో తాను దాఖలు చేసి ఫిర్యాదులకు సంబంధించిన సమాచారాన్ని అందజేయాల్సిందిగా ఆర్టీఐ దరఖాస్తు చేయగా.. 2017 జూలై 15, 2017 ఆగస్టు 18న రెండు ఫిర్యాదులు అందిన్నట్టు కార్మిక శాఖ తెలిపింది. తగిన మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన తర్వాత సీవీసీపై చర్యలు తీసుకుంటారని వివరించింది.

ప్రాంతీయ రింగ్ రోడ్డు పరిధిలో

11 శాటిలైట్ టౌన్‌షిప్‌లు



'వాక్ టు వర్క్' కాన్సెప్ట్‌తో సన్నాహాలు

- 1000 నుంచి 5 వేల ఎకరాల్లో నిర్మాణానికి నిర్ణయం
- సర్కారుకు ముసాయిదా ప్రతిపాదనలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర రాజధాని నగరానికి చేరువలో ప్రాంతీయ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) పరిధిలో 11 శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 346.32 కిలోమీటర్ల విస్తీర్ణంతో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్‌ఆర్)కు వెలుపల హైదరాబాద్ కేంద్రంగా 50 నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ప్రతిపాదించిన రీజనల్ రింగ్ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతించిన సంగతి తెలిసిందే. దక్షణాదిలో రెండో దేశ రాజధానిగా గుర్తింపు ఉన్న హైదరాబాద్ నగరం ఉనికిని కాపాడుకుంటూనే, ఆధునిక మౌలికసదుపాయల కల్పనకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగా హైదరాబాద్‌పై జనాభాతోపాటు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వీలుగా ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు అందుబాటులో ఉన్నప్పటికీ, వాహనాల రద్దీ విపరీతంగా పెరుగుతున్నది. దీంతో అధికమవుతున్న వాహన కాలుష్యం ప్రమాణాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నది.

తక్కువ కాలుష్యం ఉన్న నగరం

ప్రస్తుతం హైదరాబాద్ నగరానికి దేశంలో తక్కువ కాలుష్యం ఉన్న నగరంగా గుర్తింపు ఉంది. దేశంలో అత్యధిక కాలుష్య నగరం కాన్పూర్ కాగా, ఆ తర్వాత వారణాసి, చెన్నై, ఢిల్లీ, లక్నో, బెంగళూరు తర్వాత చివర్లో హైదరాబాద్ ఉండడం గమనార్హం. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ నగరానికి గొప్ప గుర్తింపు ఉంది. ప్రపంచంలోని అత్యుత్తమ 20 నగరాల్లో ఒకటిగా, ఆసియా ఉత్తమ నగరంగా ఇప్పటికే పేరుగాంచింది. టూరిస్టులు ఎక్కువగా సందర్శించే నగరాల్లో ఒకటిగా, ప్రపంచంలోనే ఎక్కువ కార్యాలయాలుగా ఉండే నగరంగా కూడా పేరుంది. ఐటీ నగరంగా కూడా అందరికి సుపరిచితమే. ఇలాంటి ప్రతిష్ఠను కాపాడుకుంటూ, హైదరాబాద్‌ను విస్తరణ దిశగా ప్రభుత్వం రీజనల్ రింగ్ రోడ్డును ప్రపంచస్థాయి ప్రమాణాలు ఉండేలా కార్యాచరణను రూపొందిస్తున్నది.

రూ.11వేల కోట్ల ప్రాజెక్టు

ప్రాంతీయ రింగ్ రోడ్డును రోడ్లు, భవనాల శాఖ నిర్మించనుంది. దాదాపు రూ.11వేల కోట్ల నిధులు అవసరం కానున్నాయి. ఆర్‌ఆర్‌ఆర్‌ను రెండు రోడ్లుగా నిర్మించాలని ప్రభుత్వ ప్రణాళిక రూపొందించింది. వాటిలో చౌటుప్పల్ నుంచి కంది వరకు 180 కిలోమీటర్లు కాగా దీనికి రూ.5000 కోట్లు వ్యయం చేయనుంది. మరొక దశ సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 154 కిలోమీటర్ల మేరకు ఉన్నాయి. దీనికి రూ.6000 కోట్లు ఖర్చుపెట్టనుంది. ఒక్కో కిలోమీటర్‌కు రూ.33 కోట్లు అవుతుందని ప్రాథమిక అంచనా. మొత్తం కేటాయింపుల్లో 70 శాతం నిర్మాణం వ్యయం కాగా, మిగతా 30 శాతం భూసేకరణ, బాధితులను తరలించడానికి వినియోగిస్తారని సమాచారం.

ప్రపంచస్థాయి ప్రమాణాల మేరకు రీజనల్ రింగ్ రోడ్డును తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని కీలక నిర్ణయాలను తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. అందులోభాగంగానే రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో 11 శాటిలైట్ టౌన్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఒకొక్క టౌన్‌షిప్‌కు కనీసం 1000 ఎకరాల నుంచి 5000 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేందుకు వీలుగా మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ, రోడ్లు భవనాల శాఖ సంయుక్తంగా ప్రతిపాదనలు రూపొందిస్తున్నాయి.

హైదరాబాద్ సిటీకి 'వాక్ టు వర్క్' కాన్సెప్ట్‌లో 11 శాటిలైట్ టౌన్‌షిప్‌లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రాథమికంగా టౌన్‌సిప్ కేంద్రాలపై ఉన్నతస్థాయిలో ముసాయిదా ఖరారు అయినట్టు విశ్వసనీయ సమాచారం.



శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటయ్యే ప్రాంతాలు

1. జాతీయ రహదారి - 65, ముంబయిరోడ్డు- సదాశివపేట ప్రాంతం
2. జాతీయ రహదారి- 161, ఆంధోల్ రోడ్డు పరిసర ప్రాంతం
3. జాతీయ రహదారి -765(డి), మెదక్ రోడ్డు- నర్సాపూర్ పరిసర ప్రాంతాలు
4. జాతీయ రహదారి- 44 తూప్రాన్ పరిసర ప్రాంతం
5. రాష్ట్ర రహదారి 1, కరీంగనర్ రోడ్డు ఆహ్మదీపురం ప్రాంతం
6. జాతీయ రహదారి- 163, వరంగల్‌రోడ్డు-యాదగిరిగుట్ట పరిసర ప్రాంతం
7. జాతీయ రహదారి- 65, విజయవాడరోడ్డు-చౌటుప్పల్ పరిసర ప్రాంతం
8. రాష్ట్ర రహదారి - 19, నాగార్జునసాగర్ రోడ్డు -నాగిళ్ల పాంతం
9. జాతీయ రహదారి - 765, శ్రీశైలంరోడ్డు-వెల్దండ ప్రాంతం
10. జాతీయ రహదారి - 44, బెంగళూరురోడ్డు-బాలానగర్ పరిసర ప్రాంతం
11. జాతీయ రహదారి - 163, చేవెళ్ళ-పరిగి రోడ్డు చెన్గోముల్ పరిసర ప్రాంతం


స్వాతి, నరేష్


కుల దురహంకార పీడ పోవాలి

21వ శతాబ్దంలో కూడా డబ్బుకు, పరువుకు, కులానికి అధిక ప్రాధాన్యతనిస్తుండటం దురదృష్టకరం. ఎక్కడో ఉత్తరాది రాష్ట్రాల్లో గతంలో ఇలాంటి కుల దురహంకార హత్యలు జరిగాయని వినేవాళ్లం. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇలాంటివి జరగడానికి ఆయా ప్రాంతాల వెనుకబాటుతనం, నిరక్షరాస్యత, పేదరికం మొదలైనవి కారణాలుగా చెప్పవచ్చు. కానీ ఇటీవల ఈ విష సంస్కృతి అభివృద్ధి చెందుతున్న దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా మన తెలంగాణలో కూడా ఈ విష జాఢ్యం పాకింది. ఉత్తరాది రాష్ట్రాల్లో అనేక మంది యువకులు కుల జాఢ్యం కారణంగా పాశవికంగా హత్య చేయబడ్డారు. ప్రేమపేరుతో రెండు వేరువేరు సామాజిక వర్గాల మధ్య కులాంర వివాహాలు చేసుకుంటుంటే సహించలేకుండా హత్యలకు పాల్పడుతున్నారు. తమ పరువుకు భంగం వాటిల్లిందంటూ తీవ్ర అభ్యంతరాన్ని హత్యల రూపంలో బయటపెడ్డటం, అమానవీయంగా, క్రూర మృగాలను చంపినట్టు వేట కత్తులతో మనుషులను చంపడం అంటే ఈ సమాజం ఎటుపోతోంది?

పసుల స్వామి

మానవుడు అధునాతన శాస్త్ర, సాంకేతిక రంగాలవైపు విజయవంతంగా దూసుకుపోతున్నాడో నైతిక విలువల విషయంలో అంత అధ: పాతాళానికి పడిపోతున్నాడో ఈ మధ్యకాలంలో జరిగిన ఘోరకలిని బట్టి చెప్పవచ్చు. భారతదేశంలో తరతరాలుగా వస్తున్న నిచ్చెన మెట్ల వ్యవస్థకు ప్రాణం పోసి ఇప్పటి వరకు దాన్ని సజీవంగా కాపాడుతున్నది మనుధర్మశాస్త్రమే. అగ్రకులానికి చెందిన పురుషులు అణగారిన బడుగు వర్గాలకు చెందిన స్త్రీలపై ఎన్ని ఆకృత్యాలకైనా పాల్పడవ్చు. ఎలాంటి దాడులకు పాల్పడినా అడిగేవారుండరు. కానీ అదే అణగారిన బడుగు, దళిత వర్గాలకు చెందిన మగవారు మాత్రం అగ్రవర్ణ స్త్రీలపై ప్రేమ ప్రకటించరాదు. పెండ్లి చేసుకోరాదు. అలా చేస్తే అతని కండ్లను తీసివేయాలని మనుస్మృతి బోధిస్తుంది. కులం, మతం అనేవి సంకర జాతికి పుట్టిన రెండు కవల రాక్షసుల్లాంటివి. కులం, మతం అనేవి భారతదేశానికి కుక్కమూతి పిందెలాంటివి.

21వ శతాబ్దంలో కూడా డబ్బుకు, పరువుకు, కులానికి అధిక ప్రాధాన్యతనిస్తుండటం దురదృష్టకరం. ఎక్కడో ఉత్తరాది రాష్ట్రాల్లో గతంలో ఇలాంటి కుల దురహంకార హత్యలు జరిగాయని వినేవాళ్లం. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇలాంటివి జరగడానికి ఆయా ప్రాంతాల వెనుకబాటుతనం, నిరక్షరాస్యత, పేదరికం మొదలైనవి కారణాలుగా చెప్పవచ్చు. కానీ ఇటీవల ఈ విష సంస్కృతి అభివృద్ధి చెందుతున్న దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా మన తెలంగాణలో కూడా ఈ విష జాఢ్యం పాకింది. ఉత్తరాది రాష్ట్రాల్లో అనేక మంది యువకులు కుల జాఢ్యం కారణంగా పాశవికంగా హత్య చేయబడ్డారు. ప్రేమపేరుతో రెండు వేరువేరు సామాజిక వర్గాల మధ్య కులాంర వివాహాలు చేసుకుంటుంటే సహించలేకుండా హత్యలకు పాల్పడుతున్నారు. తమ పరువుకు భంగం వాటిల్లిందంటూ తీవ్ర అభ్యంతరాన్ని హత్యల రూపంలో బయటపెడ్డటం, అమానవీయంగా, క్రూర మృగాలను చంపినట్టు వేట కత్తులతో మనుషులను చంపడంతో ఈ సమాజం ఎటుపోతోంది? మానవ విలువలన్నీ ఏమైపోతున్నాయి? అని యావత్ సభ్య సమాజం గుండెలమీద చేయివేసుకొని ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఏ విలువలకీ ప్రస్థానం? దీని ద్వారా సమాజానికి మనం ఏం అందిస్తున్నామో తెలుసుకోవాలి. గౌతమబుద్ధుడు నడియాడిన పరమ పవిత్రమైన ధర్మ క్షేత్రంలో నేడు జరుగుతున్న దేమిటి? వరుసగా మంథని మధుకర్, స్వాతి, నరేష్, రాజేష్, ప్రణయ్‌ల హత్యలు దళితులపై ఒక పథకం ప్రకారం హత్యలు జరుగుతున్నాయా? అనిపిస్తుంది. గతంలో ప్రేమ పెండ్లీలు చేసుకున్న దళిత యువకులను అగ్రవర్ణాలకు చెందిన వారు చంపినా నేటికీ ఆయా హత్యలలో ప్రధాన పాత్ర పోషించిన వారికి సత్వరమే కఠిన శిక్షలు పడకపోవడంతో వెనువెంటనే ఒకదాని తర్వాత ఒకటి అనగా మిర్యాలగూడలో ప్రణయ్ ఉదంతం నుంచి తేరుకోకపముందే హైదరాబాద్ ఎర్రగడ్డలో ప్రేమ పెండ్లి చేసుకున్న మాధవి, ప్రవీణ్‌కుమార్‌లపై దాడులకు తెగబడటం నిందితులకు భయం లేకుండా పోయి, పైగా ప్రోత్సహిచినట్టవుతుంది. అందుకే ఇటీవల మరికొన్ని ఘటనలు వెలుగుచూశాయి. అలా కాకుండా అగ్రవర్ణాలకు చెందిన దోషులకు గానీ, కుల దురహంకార హత్యలు చేస్తున్న దోషులకు వెంటనే శిక్ష పడాలంటే సిట్టింగ్ జడ్జీతో కేసు విచారణ వేగవంత చేసి నిందితులకు ఉరిశిక్షను అమలు చేస్తేనే కులాంతర వివాహాలు చేసుకున్న దళిత యువకులను కాపాడుకుంటాము. కులం కాకుండా మానవులలో గుణం ప్రధానంగా చూడాలి. సమ సమాజ స్థాపన జరగాలంటే కులాంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు ఫూలే, పెరియార్ రామస్వామి నాయకర్‌ల ఆశయాలకు అనుగుణంగా అనగా కులాంతర వివాహాలు ప్రభుత్వమే జరిపించి, ప్రతి ఊరిలో కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ కల్పించి, వారికి తగిన జీవనోపాధి కల్పించాలి. కుల దురహంకారం, డబ్బు మదంతో తాము ఏం చేసినా చెల్లుబాటవుతుందనే పద్ధతి వల్ల ఇంకా ఎంతమంది ప్రణయ్‌లను బలి తీసుకుంటుందో ఏమో? కులాల మధ్య ఉన్న అడ్డుగోడల్ని తొలగించి, నీతి, మానవత్వమున్న మనుషులను తయారు చేసేందుకు కావాల్సిన కార్యాచరణ ప్రణాళికలను ప్రభుత్వమే స్వచ్ఛంద సంస్థలు, యువతీ యువకులు, మహిళా సంఘాలు ఇతర భావసారూపత్య కలిగిన సంస్థలను, వ్యక్తులను కలుపుకొని ప్రభుత్వమే ఆ దిశగా అడుగులు వేస్తే డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ కన్నకలలు సాకారమవుతాయి. కుల జాఢ్యపు పీడ విరగడవుతుంది.


మాధవి, ప్రవీణ్‌కుమార్


ప్రణయ్, అమృత


సెల్ : 9652872885

కుటుంబ సమస్య పరిష్కరించమంటే
కుల బహిష్కరణ వేటు

ఏసురత్నం

కుటుంబం అన్నాక ఎన్నో సమస్యలు ఉంటాయి. వాటిని పరిష్కరించుకొని కలిపి సుఖంగా జీవించాలి. కానీ ఆ కుటుంబ సమస్యే కుల బహిష్కరణకు గురైన సంఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మేడిపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల రాజరెడ్డికి ఇద్దరు భార్యలు మొదటి భార్య కూతురుకు పెండ్లి విషయంతో వచ్చిన గొడవతో మొదటి భార్య కుల పెద్దలను ఆశ్రయించింది. దీంతో కుల సంఘ సభ్యులు రాజరెడ్డిని కుల సంఘ సమావేశానికి రావాలని పలుమార్లు సూచించారు. ఎంతకూ రాజరెడ్డి అక్కడికి వెళ్లలేదు. దీంతో ఆయనతో ఎవరు మాట్లాడకూడదు, వారి వ్యవసాయ పనులకు ఎవరు వెళ్లవద్దనే నిబంధనలు విధించారు. దీంతో చేసేది లేక స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. దీంతో కుల సభ్యులను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. అక్కడ పోలసీసులు కౌన్సిలింగ్ చేయడంతో రాజరెడ్డిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని, బహిష్కరణలు అలాంటివి చేయకూడదని, అందరూ కలిసిమెలసి ఉండాలని ఒప్పంద పత్రంపై 8.6.2018న రాసుకున్నారు. 19.12.2018న మళ్లీ గుడేటి కాపు సంఘం సభ్యులు సమావేశం నిర్వహించి రాజరెడ్డిని మళ్లీ పంచాయతీకి పిలిచారు. అక్కడ రూ.33వేల జరిమానా కట్టాలని తీర్మానించారు. తాను కట్టలేనని అని రాజరెడ్డి ఖరాఖండిగా చెప్పడంతో ఆయనతో ఎవరు మాట్లాడవద్దని, వారి వ్యవసాయ పనులకు ఎవరు వెళ్లవద్దని కుల సంఘం సభ్యులు తీర్మానించారు. దీంతో మళ్లీ ఠాణాను ఆశ్రయించాడంతో ఆ కుల సంఘం సభ్యులైన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అయినప్పటికీ బహిష్కరణ కొనసాగుతూనే ఉంది.

సెల్ : 9948163703


బహిష్కరణ ఎత్తివేస్తున్నట్టు అధికారులకు రాసి ఇచ్చిన గుడేటి కాపు సంఘం పెద్ద మనుషులు(ఫైల్)

బహిష్కరించిన వారిపై కేసు నమోదు చేశాం



ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల రాజరెడ్డిని కుల బహిష్కరణకు గురిచేసింది నిజం. అది కుటుంబ పంచాయితి. అందులో అనవసరంగా కుల పెద్దలు జోక్యం చేసుకున్నారు. పెద్దలు తగాదాలను పరిష్కరిస్తే మంచిది. కానీ ఇలా కుల బహిష్కరణలు, గ్రామ బహిష్కరణలు చట్ట విరుద్ధం. రాజరెడ్డిని కుల బహిష్కరణ చేసిన వారిపై కేసు నమోదు చేశాం. వారిని త్వరలో కోర్టుకు హాజరు పర్చి శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- రామ్‌నాయక్, ఎస్ఐ

ఎన్నికల్లో ప్రచారం చేయొద్దని
దళిత సర్పంచ్ అభ్యర్థికి పెత్తందారుల బెదిరింపులు

ఎం.రవిందర్

మనది ప్రజాస్వామిక దేశం. ఈ దేశంలో ప్రతి పౌరుడూ స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఎన్నికల్లో పాల్గొనవచ్చు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. కానీ కొందరు పెత్తందారులు దళితులను తమ కీలు బొమ్మల్లా వాడుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రకారం ఎస్సీకి కేటాయించిన స్థానంలో తమ తొత్తులుగా, తమ చెప్పుచేతుల్లో ఉండేవారిని నిలబెట్టి గెలిపించుకునేందుకు అన్ని రకాల కుతంత్రాలు పన్నుతున్నారు. అంతోఇంతో రాజకీయంగా చైతన్యవంతులైన దళితులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడితే తమ విధివిధానాలు ప్రజలకు తెలిపి ఓటు అభ్యర్థించకుండా అడ్డుపతున్నారు. వీధుల్లో తిరిగి ప్రచారం చేస్తే నీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్య సిద్ధించి 70 ఏండ్లు దాటినా ఇంకా దళితుడు తమ చెప్పు చేతుల్లోనే ఉండాలని, తాము చెప్పినట్టే వినాలని పెత్తందారులు గ్రామాల్లో హుకూం జారీ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో స్వేచ్ఛగా ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి కొరవడింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదంటే అక్కడ పెత్తందారుల ఆగడాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.



"అధికారంలో మేమున్నాం... మేము చెప్పిందే ఇక్కడ వేదం. కాదంటే శాల్తీ లేచిపోతుంది. పంచాయతీ ఎన్నికల్లో మా పార్టీ అభ్యర్థినే గెలిపించుకుంటాం. కాదని ప్రచారం చేస్తే కాళ్లూ చేతులు విరుగుతాయ్" అంటూ పెత్తదారులు దళిత సర్పంచ్ అభ్యర్థిని బెదిరిస్తున్నారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలోని వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం తిమ్మాపూర్ గ్రామంలోనే ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒకవైపు కసరత్తు చేస్తుంటే అధికార పార్టీకి చెందిన నాయకులు ఎస్సీలకు రిజర్వు అయిన గ్రామ పంచాయతీలలో పెత్తనం చెలాయిస్తున్నారు. తమకు అనుకూలమైన అభ్యర్థిని గెలుపించుకోవడానికి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ ఎస్సీలకు రిజర్వు అయ్యింది. గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన జోగు నర్సిములు, టీఆర్ఎస్ బలపర్చిన శేఖర్‌లు బరిలో ఉన్నారు. అయితే టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి శేఖర్‌కు పెత్తదారులు మద్దతిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన బోగు నర్సిములును ఓడించడానికి ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరి మధ్య పెత్తదారులు చిచ్చుపెట్టారు. అగ్రవర్ణాలు పథకం ప్రకారం ఇరువురి మధ్య కొట్లాట పెట్టాయి. ఒకరిపైఒకరు దాడులు చేసుకునే విధంగా ప్రణాళికలు తయారు చేశారు. అందులో భాగంగానే కిరాణ షాపు యజమాని జోగు చిన్నయ్యపై దాడి జరిగింది. అంతేకాకుండా కాంగ్రెస్ బలపర్చిన జోగు నర్సిములు గ్రామంలో ప్రచారం నిర్వహించకుండా పథకం వేసి అడ్డుకుంటున్నారు. ఇంతటితో అగకుండా "నీవు మా కాలనీలో అడుగు పెడితే నీ అంతు చూస్తామ"ని బెదిరిస్తున్నారు. దీంతో చేసేదేమిలేక నామినేషన్ వేసిన జోగు నర్సిములు ప్రచారం చేయకుండా ఇంటికే పరిమితమయ్యాడు. రాహులపల్లి అనుబంధ గ్రామంగా ఉన్న తిమ్మాపూర్ ఇటీవల గ్రామ పంచాయతీగా మారింది. ఈ గ్రామంలో 1550 మంది జనాభా ఉండగా 487 ఓట్లు ఉన్నాయి. ఈ గ్రామంలో అగ్రవర్ణాలు ఏం చెబితే అది వినాల్సిందే. లేదంటే ఆ కుటుంబాన్ని ఏదో రకంగా హింసిస్తారు. ఇక్కడా అదే జరిగింది. వారికి అనుకూలంగా ఉన్న శేఖర్‌ను గెలిపంచుకొని అంతా వారే చూసుకునే విధంగా ప్రణాళికలు తయారు చేసుకున్నారు. కాని జోగు నర్సిములు వారి మాట వినకుండా నామినేషన్ వేశారు. ఎస్సీ రిజర్వుడు అయినా పెత్తదారులు ఓట్లే ఇక్కడ అధికంగా ఉంటాయి. గ్రామ సర్పంచ్ అభ్యర్థితోపాటు వార్డు మెంబర్‌గా నామినేషన్ వేసిన చంద్రపల్లి అంతయ్య ఇంటికి వచ్చి బెదిరించారు. ఈయన పొలాలు పెత్తదారులు పొలాల దగ్గర ఉండటంతో చేసేది ఏమి లేక ఆయన ప్రచారం చేసుకోకుండా ఇంటికే పరిమితమయ్యారు. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి ప్రచారం చేస్తున్న జోగు చిన్నయ్య అనే దళిత కుటుంబ సభ్యులను బెదిరింపులకు పాల్పడి గ్రామం నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య కొట్లాట పెట్టారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకునే విధంగా అగ్రవర్ణాలు పథకం రూపొందించాయి. నేడు గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుంతోనని బాధిత కుటుంబాలు బిక్కుబిక్కుమంటున్నాయి. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడు ఈ తతాంగాన్ని నడిపిస్తున్నాడని గ్రామస్తులు అంటున్నారు. ఆయన కుమారులు రాత్రి వేళలో బాధితులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయందోళన గ్రామస్తుల్లో ఉంది. తమకు అనుకూలమైన అభ్యర్థిని గెలిపించుకొని ఉప సర్పంచ్‌గా ఎన్నికై పెత్తనమందా తామే చెలాయించాలనే ధోరణితోనే గ్రామానికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు ఈ పథకం పన్నాడని కొందరు అంటున్నారు. మరోపక్క ఇతర ప్రాంతాల్లో ఉన్న పెత్తదారులు కూడా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. మర్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదనే చెప్పవచ్చు. తాను మర్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని అయినా నేటికి వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని సర్పంచ్ అభ్యర్థి నర్సిములు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుగకుంటే తాము ఊరు విడిచి వెళ్లవలసిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సెల్ : 9490099505




పెత్తందారుల ఏలుబడిలో దళితవాడల పరిస్థితి ఇదీ...

ప్రపంచకప్‌లో ప్రత్యర్థులు అందరికీ కొరకరాని కొయ్యగా కోహ్లిసేన ఎందుకు నిలువనున్నది? అనే ప్రశ్నకు తొలి రెండు వన్డేల్లో టీమ్ ఇండియా సమాధానం చెప్పింది. ఫామ్‌లో ఉన్న ఆతిథ్య జట్టుపై, అనుకూలించని పరిస్థితుల్లో టీమ్ ఇండియా చూపుతోన్న ఆధిపత్యం క్రికెట్ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రెండో వన్డే వేదికలోనే మరో సమరానికి సిద్ధమైన కోహ్లిసేన ఇక్కడే 3-0తో సిరీస్ సొంతం చేసుకోవాలని భావిస్తోంది. ఐదు వన్డేల సిరీస్‌లో ఆశలు సజీవంగా నిలువాలంటే ఆతిథ్య న్యూజిలాండ్‌కు ఇది చావోరేవో పరిస్థితి. భారత్, కివీస్ మూడో వన్డే నేడు.



జకోవిచ్ సప్తపది



మెల్‌బోర్న్ పార్క్ ఫైనల్లో ఓటమెరుగని రికార్డు అతడిది. కానీ ప్రత్యర్థి తాజా టోర్నీలో ఒక్క గేమ్‌నూ కోల్పోలేదు. పైగా ఇద్దరూ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో నం.1, నం.2 స్థానాల్లో ఉన్నారు. మహిళల సింగిల్స్ మాదిరిగానే పురుషుల సింగిల్స్‌లోనూ టైటిల్ వేటలో మారథాన్ మ్యాచ్ ఖాయమనే అనిపించింది. కానీ సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్ ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో ఓటమెరుగని రికార్డును నిలుపుకున్నాడు. వరుస సెట్లలో నడాల్‌పై నెగ్గి ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ ముద్దాడాడు. ఆరు టైటిళ్ల రాయ్ ఎమర్సన్, రోజర్ ఫెడరర్‌లను దాటేశాడు. కెరీర్ 15వ గ్రాండ్‌స్లామ్‌తో దిగ్గజ పిట్ సంప్రాస్ సరసన నిలిచాడు.

- ఏడో ఆస్ట్రేలియన్ టైటిల్ సొంతం
- ఫైనల్లో నడాల్‌పై మెరుపు విజయం
- 15 గ్రాండ్‌స్లామ్స్‌తో సంప్రాస్ సరసన జకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్



2012 ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ పోరు. ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ చరిత్రలోనే టైటిల్ కోసం ఆరు గంటలకు పైగా పోరాటం జరిగింది. స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్‌పై పైచేయి సాధించేందుకు సెర్బియా చిన్నోడు సర్వశక్తులు వడ్డాడు. తాజాగా, 2019 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్స్. టైటిల్ పోరులో మరోసారి జకోవిచ్, నడాల్ సమరం. ఇప్పుడు సైతం టైటిల్ ఎవరిని వరించినా, అంత సులువుగా దక్కదనే అంచనా. కానీ భీకర ఫామ్‌లో ఉన్న జకోవిచ్ అంచనాలను తలకిందులు చేశాడు. కేవలం రెండు గంటల్లోనే నడాల్‌ను ఓడించాడు. 6-3, 6-2, 6-3తో సాధికారిక విజయం సాధించి, ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచాడు.

ఎదురులేని జకోవిచ్ : హోరాహోరీ అనుకున్న పురుషుల సింగిల్స్ ఫైనల్ ఏకపక్షమైంది. ఫైనల్స్‌కు చేరిన ప్రస్థానంలో ప్రత్యర్థులకు కనీసం ఒక్క సెట్‌ను సైతం కోల్పోని స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్, ఆదివారం నాటి ఫైనల్లో ఆరంభంలోనే చేతులెత్తేశాడు. 124 నిమిషాల్లోనే వరల్డ్ నం.1కు సరెండర్ అయిపోయాడు. ఇద్దరు యోధుల పోరాటాన్ని ఆస్వాదించాలని ఆశించిన అభిమానులకు ఆరంభ నిమిషాల్లోనే జరుగబోయేది అర్థమైపోయింది!. తొలి పది నిమిషాల్లోనే జకోవిచ్ తొలి సెట్‌లో 3-0 ఆధిక్యంలో నిలిచాడు. తొలి గేమ్‌లో, మూడో గేమ్‌లో 40-0తో జకోవిచ్ ఆధిపత్యం చెలాయించగా.. రెండో గేమ్‌లో నడాల్ 15-40తో ఖాతా తెరిచాడు. తొలి 14 పాయింట్లలో నడాల్ కేవలం ఒక్కటంటే ఒక్కటే పాయింట్ సాధించాడు. ఫోర్‌హ్యాండ్ షాట్లలో టైమింగ్ కోల్పోయిన నడాల్, జకోవిచ్ ముందు తేలిపోయాడు. నడాల్‌ను చిత్తు చేసిన జకోవిచ్ తొలి సెట్‌ను 6-3తో కైవసం చేసుకున్నాడు. గణాంకాల పరంగా రెండో సెట్‌ను జకోవిచ్ 6-2తో మరింత సులువగా నెగ్గినా, ఇక్కడ నడాల్ నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఫోర్‌హ్యాండ్



సమస్యను అధిగమించిన నడాల్ రెండో సెట్‌లో సుదీర్ఘ ర్యాలీలు ఆడాడు. పాయింట్ కోసం జకోవిచ్ ఇక్కడ కష్టపడాల్సి వచ్చింది. తొలి రెండు సర్వ్‌లను నిలుపుకున్న నడాల్ 2-2తో జోరందుకున్నట్టే కనిపించాడు. కానీ తర్వాత వరుసగా నాలుగు గేమ్ పాయింట్లు గెల్చుకున్న జకోవిచ్ 6-2తో రెండో సెట్‌నూ సొంతం చేసుకున్నాడు. చావోరేవో తేల్చుకోవాల్సిన మూడో సెట్లోనూ నడాల్ ఆట మారలేదు. తొలి సర్వ్‌ను నిలుపుకున్నా, తర్వాత జకోవిచ్ జోరు ముందు నిలువలేదు. నడాల్ అసౌకర్యాన్ని గమించిన జకోవిచ్, అతడి చేత పదే పదే తప్పిదాలు చేయించాడు. 6-3తో మూడో సెట్‌నూ, ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను వశపర్చుకున్నాడు. మ్యాచ్‌లో 8 ఏస్‌లు సంధించిన జకోవిచ్, 34 విన్నర్లు సాధించాడు. కానీ 4 డబుల్ ఫాల్ట్స్‌కు పాల్పడిన నడాల్ 21 విన్నర్లే సాధించాడు. అనవసర తప్పిదాల్లో జకోవిచ్ 9కే పరిమితం కాగా, నడాల్ 28 వరకూ వెళ్లాడు. ఓవరాల్‌గా జకోవిచ్ 18 గేములు నెగ్గగా, నడాల్ 8 గేముల్లో మాత్రమే పైచేయి సాధించాడు. పురుషుల డబుల్స్‌లో ఐదో సీడ్ ఫ్రాన్స్ జోడీ నికోలస్ మహత్, పీరీ హ్యూస్ హెర్బర్ట్‌లు గెలుపొందారు. కెంటినన్ (ఫిన్లాండ్), పీర్స్ (ఆస్ట్రేలియా)లపై 6-4, 7-6(7-1)తో గెలుపొంది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను అందుకున్నారు.

లక్ష్యం 3-0

- సిరీస్ విజయంపై భారత్ గురి
- న్యూజిలాండ్‌కు ఇది చావోరేవో
- నేడు మూడో వన్డే పోరు
- ఉ॥ 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

మౌంట్ మంగానుయ్

హోరాహోరీ తప్పదని భావించిన పోటీని కోహ్లిసేన ఏకపక్షం చేసింది. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన కివీస్ పిచ్‌లపై మణికట్టు మాయగాళ్లతో ఆతిథ్య న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. చాహల్, కుల్దీప్‌లు మాయ చేసిన పిచ్‌పైనే మూడో వన్డే జరుగనున్నది. నేటి వన్డేతోనే సిరీస్‌ను సొంతం చేసుకోవాలని కోహ్లిసేన ఉవ్విళ్లూరుతోంది. కెప్టెన్ కోహ్లి ఈ వన్డే తర్వాత విశ్రాంతి తీసుకోనుండటం, ఈ మ్యాచ్‌తోనే నిషేధం నుంచి బయటపడిన హార్దిక్ పాండ్య తిరిగి మైదానంలోకి అడుగు పెట్టనుండటంతో విజయంపై భారత్ దీమాగా కనిపిస్తోంది. బ్యాటింగ్ లైనప్ అనూహ్య వైఫల్యంతో కంగుతిన్న కివీస్, నేటి వన్డేలో పట్టు వదిలితే సిరీస్‌పై ఆశలు కోల్పోనున్నది. సిరీస్ విజయాన్ని అందించి స్వదేశానికి చేరాలని భావిస్తోన్న కోహ్లికి కివీస్ చెక్ పెడుతుందా? ఆసక్తికరం.

పాండ్య వస్తున్నాడు! : బిజీ క్రికెట్‌లో నిమగ్నమైన కెప్టెన్ కోహ్లికి ఈ పర్యటనలో ఇదే ఆఖరు మ్యాచ్. మహిళలపై అనుచిత వ్యాఖ్యలతో నిషేధానికి గురైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఈ వన్డే ఎంపికకు అందుబాటులో ఉన్నాడు. పేస్ విభాగంలో బుమ్రా మినహా మిషన్ ప్రపంచకప్ ప్రణాళిక తుది జట్టు అంతా నేడు బరిలోకి దిగనున్నది. మానసికంగా కలత చెందిన పాండ్య పునరాగమనంలో సత్తా చాటాలని ఆశిస్తున్నాడు. ఆటతో మళ్లీ తనపై చర్చను క్రికెట్‌కు పరిమితం చేయాలని అతడి కోరిక!. రోహిత్, కోహ్లి, ధావన్‌లు బ్యాటింగ్ లైనప్‌కు బలం. మిడిల్ ఓవర్లలో స్కోరు వేగం నెమ్మదించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేదార్ జాదవ్, ఎం.ఎస్ ధోని ధనాధన్ సామర్థ్యం నిరూపించుకునే సమయం ఆసన్నమైంది. తొలి రెండు వన్డేల్లో ఎనిమిది వికెట్లు కూల్చిన కుల్దీప్ యాదవ్ నేడూ కీలకం కానున్నాడు. చాహల్‌తో కలిసి కుల్దీప్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు. భువనేశ్వర్, మహ్మద్ షమిలతో కలిసి పాండ్య పేస్ బాధ్యతలు మోయనున్నాడు.

నెగ్గితేనే ఆశలు : కోహ్లిసేన వరల్డ్ నం.2 ర్యాంక్‌పై కన్నేసి సిరీస్‌ను ఆరంభించిన న్యూజిలాండ్, అసలు పోరులో తేలిపోయింది. జట్టులో మ్యాచ్ విన్నర్లు, నాణ్యమైన ఆటగాళ్లు ఉన్నారు. కానీ భారత బౌలర్ల జోరుకు ఎవ్వరూ క్రీజులో నిలిచే పరిస్థితి కనిపించలేదు. సీనియర్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ నుంచి కివీస్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. మన్రో జట్టులో తన స్థానానికి న్యాయం చేయాల్సి ఉన్నది. ఫామ్‌లో ఉన్న రాస్ టేలర్, టామ్ లాథమ్, నికోల్స్‌లు భారత స్పిన్‌కు దాసోహం అయ్యారు. నేటి మ్యాచ్‌లో స్పిన్‌పై బలహీనతను కివీస్ అధిగమించాలి. ఆరంభంలో పేస్, మధ్యలో స్పిన్‌కు ఎదురు నిలిస్తేనే న్యూజిలాండ్‌కు గెలుపు ఆశలు. బంతితో బౌల్ట్, సౌథీలు ప్రభావం చూపలేకపోతున్నారు. భారత బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయటం సైతం కివీస్‌కు ఇప్పుడు ప్రధాన ఆందోళన.

పిచ్ రిపోర్టు : మౌంట్ మంగానుయ్ పిచ్ సహజసిద్ధంగా పేసర్లకు అనుకూలం. కానీ భారత స్పిన్నర్లు ఇక్కడ వికెట్ల మోత మోగించారు. కివీస్ స్పిన్‌కు వికెట్లు పడకున్నా, పరుగుల పొదుపు దక్కింది. ఆహ్లాదకర వాతావరణంలో మరో భారీ స్కోర్ల మ్యాచ్ ఖాయమని చెప్పవచ్చు.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమి, చాహల్.

న్యూజిలాండ్ : మార్టిన్ గప్టిల్, కొలిన్ మన్రో, కానె విలియమ్సన్, రాస్ టేలర్, టామ్ లాథమ్, హెన్రీ నికోల్స్, మిచెల్ శాంట్నర్, బ్రేస్‌వెల్, ఇశ్ సోధి, ఫెర్గుసన్, ట్రెంట్ బౌల్ట్.

ప్రజలారా తస్మాస్ జాగ్రత్త!

' దేశంలో పర్యటిస్తోన్న ఓ బృందం దౌర్జన్యాల గురించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసులు ఈ హెచ్చరిక జారీ చేస్తున్నాం. సాక్షులు కథనం ప్రకారం అమాయకులైన న్యూజిలాండ్‌ను నేపియర్, మౌంట్ మాంగనుయ్‌లో ఈ బృందం దారుణంగా దాడి చేసింది. మీరు బ్యాట్, బంతితో సంచరిస్తుంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోక తప్పదు' అని ఈస్ట్రర్న్ డిస్ట్రిక్ట్ పోలీసులు ఫేస్‌బుక్ పేజీలో సరదా హెచ్చరిక జారీ చేశారు. కోహ్లిసేన గ్రూప్ ఫోటోను ఈ కామెంట్‌కు జత చేశారు. న్యూజిలాండ్ పోలీసుల పోస్ట్‌లపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. పలువురు క్రికెటర్లు, అభిమానులు సోషల్ మీడియాలో ఈ పోస్ట్‌ను పంచుకున్నారు.

ఫలించిన రెండేండ్ల నిరీక్షణ

- ఇండోనేషియా టైటిల్ సైనా సొంతం
- గాయంతో తప్పకున్న మారిన్

జకర్తా : రియో ఒలింపిక్స్‌లో మోకాలి గాయానికి గురైన సైనా నెహ్వాల్ అప్పట్నుంచి బిడబ్ల్యూఎఫ్ సర్క్యూట్‌లో స్థాయికి తగిన ప్రదర్శన చేయలేకపోయింది. కామన్‌వెల్త్ క్రీడల్లో స్వర్ణం, నేషనల్ చాంపియన్‌గా నిలిచి ఫామ్ నిరూపించుకున్నా, బిడబ్ల్యూఎఫ్ సర్క్యూట్‌లో టైటిల్ లేమి సైనాను వెంటాడింది. పారుపల్లి కశ్యప్‌తో వివాహం తర్వాత ఈ ఏడాది సీజన్‌ను సరికొత్తగా ఆరంభించిన సైనా నెహ్వాల్, గత వారం మలేషియా మాస్టర్స్‌లో సెమీఫైనల్స్‌కు చేరింది. ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో స్ఫూర్తిదాయక విజయాలు నమోదు చేసిన సైనా నెహ్వాల్ రెండేండ్ల తర్వాత తొలి బీబ్ల్యూఎఫ్ టైటిల్ సాధించింది. ఆదివారం జరిగిన ఇండోనేషియా మాస్టర్స్ మహిళల సింగిల్స్ ఫైనల్లో కరొలినా మారిన్ (స్పెయిన్) గాయంతో పోటీ నుంచి తప్పుకున్నది. 9-3తో ముందంజలో నిలిచిన మారిన్, సైనాకు రిటర్న్ ఇచ్చే క్రమంలో మోకాలి గాయానికి గురైంది. ఫిజియో సాయంతో మళ్లీ కోర్టులోకి వచ్చిన తర్వాత 10-4తో ఉన్న సమయంలో మారిన్ నొప్పి భరించలేకపోయింది. దీంతో టైటిల్ పోరు పోటీ నుంచి వైదొలిగింది. ' ఇండోనేషియా ఫైనల్స్ ఈ విధంగా సాగాలని అనుకోలేదు. క్రీడాకారులకు గాయాలకు



అత్యంత బాధాకరం, మారిన్‌ను ఇలా చూడటం దురదృష్టకరం. మహిళల సింగిల్స్‌లో ఎదుర్కొనేందుకు ఉత్తమ షట్లర్ మారిన్. ఆమె వేగంగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని సైనా నెహ్వాల్ పేర్కొన్నది.

సర్ఫరాజ్‌పై ఐసీసీ వేటు

- నాలుగు మ్యాచుల నిషేధం
- మండిపడిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు



దుబాయ్ : జాతి వివక్ష వ్యాఖ్యలు చేసిన పాకిస్తాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై ఐసీసీ (అంతర్జాతీయ క్రికెట్ మండలి) క్రమశిక్షణ కొరడా ఝులిపించింది. దక్షిణాఫ్రికా పేసర్ ఆండిల్ ఫెలుక్‌వయోను ఉద్దేశించి సర్ఫరాజ్ వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేశాడు. సఫారీ సీమర్‌ను ' ఒరే కర్రోడా' అని సంభోదిస్తూ సర్ఫరాజ్ చేసిన వ్యాఖ్యలు స్టంప్ మైక్‌లో రికార్డు అయ్యాయి. దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో ఈ ఘటన చోటుచేసుకున్నది. దీనిపై దక్షిణాఫ్రికా డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళ్లి, ఫెలుక్‌వయోకు వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్పిన సర్ఫరాజ్, ట్విట్టర్ ఖాతాలో సైతం బహిరంగ క్షమాపణలు చెప్పాడు. సర్ఫరాజ్‌ను దక్షిణాఫ్రికా క్షమించిందని ఆ జట్టు కెప్టెన్ డుప్లెసిస్ సైతం వ్యాఖ్యానించాడు. సర్ఫరాజ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ, నిబంధనల ప్రకారం జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినందుకు పాక్ కెప్టెన్ నాలుగు మ్యాచుల నిషేధం విధించింది. దీంతో దక్షిణాఫ్రికాతో చివరి రెండు వన్డేలకు సర్ఫరాజ్ దూరమయ్యాడు. సర్ఫరాజ్ స్థానంలో షోయబ్ మాలిక్ పాక్‌కు నాయకత్వం వహించాడు. సర్ఫరాజ్ క్షమాపణలు చెప్పటంతో వివాదాన్ని ఇరు పక్షాలు పరిష్కరించుకున్నాయని, అయినా ఐసీసీ నిషేధం విధించటం సమంజసం కాదని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పేర్కొన్నది.

డీజిల్ ధర పెంపు

- రెండు రోజుల విరామం తర్వాత మళ్లీ...
- నెలలోపే జనాలపై రూ. 3.64 భారం



న్యూఢిల్లీ: రెండు రోజుల విరామం తర్వాత దేశంలో డీజిల్ ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ నెల 23 నుంచి రెండు రోజులు స్తబ్దుగా ఉన్న డీజిల్ ధరలు.. శనివారం నుంచి మళ్లీ అదే బాట పట్టాయి. ఆదివారం మరోసారి లీటరు డీజిల్ ధర రూ. 0.11 పైసలు పెరిగింది. దీంతో ఈ ఏడాది ప్రారంభమైన నెలలోపే లీటరు డీజిల్‌పై రూ. 3.64ల భారం జనాలపై పడింది. డీజిల్ ధరల పెంపు ప్రభావం నిత్యావసర వస్తువుల మీద పడుతూ జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మోడీ సర్కారు మాత్రం పట్టించుకోవడం లేదు. సవరించిన ధరల ప్రకారం.. ఢిల్లీలో లీటరు డీజిల్ ధర రూ. 66 లకు చేరగా, పెట్రోల్ రూ. 71.27గా ఉన్నది. ఇవే ధరలు హైదరాబాద్‌లో రూ. 71.75, రూ. 75.61గా నమోదయ్యాయి. కాగా, గత నాలుగు రోజుల నుంచి పెట్రో ధరలు స్తబ్దుగా ఉండటం గమనార్హం.

తాజ్‌ను ముస్లింలు నిర్మించలేదు

కేంద్రమంత్రి అనంత్ కుమార్ హెగ్డే వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ప్రపంచ ఏడు వింతల్లో ఒకటైన తాజ్ మహల్‌ను ముస్లింలు నిర్మించలేదని.. అది హిందూ దేవాలయమేనంటూ కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హెగ్డే మాట్లాడుతూ.. 'తాజ్ మహల్‌ను ముస్లింలు నిర్మించలేదు. తాజ్ ఉన్న స్థలాన్ని షాజహాన్ హిందూ రాజు జయసింహ నుంచి కొనుగోలు చేశాడు. ఇది ఆయన జీవిత చరిత్ర పుస్తకంలో రాసి ఉంది. అది శివాలయం. రాజా పరమానంద తీర్థ అక్కడ తేజో ఆలయాన్ని నిర్మించారు. మనం ఇలాగే నిశ్శబ్దంగా ఊరుకుంటే మన ఇండ్లకు మసీదుల పేరు పెడతారు. చివరికి రాముడిని జహాపనా అని.. సీతను బీబీ అని పేరు మార్చేస్తారు' అని వ్యాఖ్యానించారు. అంతేగాక చరిత్రను తిరగరాయాల్సిన అవసరం ఉందని.. హిందూ మహిళను ముట్టుకుంటే వారి చేతులు నరికేయాలి అనే విధంగా చరిత్ర రాయాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. హెగ్డే గతంలోనూ టిప్పు సుల్తాన్‌ను హిందూ వ్యతిరేకిగా వ్యాఖ్యానిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం విదితమే.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.